
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 193
బుధవారం 29-3-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



గడువు పొడిగింపు
పాన్, ఆధార్ అనుసంధానానికి జూన్ 30 వరకు గడువు పెంచిన కేంద్రం - 13లో



సన్‌రైజర్స్ సరికొత్తగా..
కొత్త కెప్టెన్, కొత్త కోచ్.. పలు కీలక మార్పులతో ఐపీఎల్‌కు సిద్ధం - 12లో



ఆ బంగ్లాతో ఎన్నో జ్ఞాపకాలు
అధికారిక బంగ్లాతో తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయని.. అయినప్పటికీ బంగ్లాను ఖాళీ చేస్తానని రాహుల్ గాంధీ చెప్పారు.
వివరాలు 6లో ▸



కన్నడనాట.. రిజర్వేషన్ల రగడ
కర్నాటకలో ముస్లింలకు అందుతున్న 4% రిజర్వేషన్లను రద్దు చేసి వక్కలిగలు, లింగాయత్‌లకు పంచడం వివాదంగా మారింది.
వివరాలు 6లో ▸



పెరిగిన ఈపీఎఫ్‌వో వడ్డీ రేటు
ఈపీఎఫ్‌వో డిపాజిట్లపై వడ్డీ రేటును 2022–23కి గాను 8.15 శాతానికి పెంచుతూ ఈబీటీ నిర్ణయం తీసుకుంది.
వివరాలు 6లో ▸



అవినీతిపరులను కాపాడేందుకే..
అవినీతికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యల వల్లే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

162 స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులు భర్తీ



ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి చేపట్టిన వాక్–ఇన్ ఇంటర్వ్యూలు ముగిశాయి. ఈ సందర్భంగా 14 స్పెషాలిటీల్లో 162 పోస్టులను భర్తీ చేశారు. వీటిలో జనరల్ మెడిసిన్ 28, జనరల్ సర్జరీ 27, గైనకాలజీ 33, అనస్తీషియా 22, పాథాలజీ 12, పీడియాట్రిక్స్ 12, మిగిలిన స్పెషాలిటీల్లో ఇతర పోస్టులు ఉన్నాయి.
వివరాలు 14 ▸

మార్గదర్శి అక్రమాల డొంక కదలడంతో రామోజీ బెంబేలు



మార్గదర్శి అక్రమాల డొంక కదిలి ప్రధాన ముద్దాయిగా నిరూపణ అయ్యే పరిస్థితి రావడంతో రామోజీరావు బెంబేలెత్తుతున్నాడని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. అందుకే దళితులపై దమనకాండ అంటూ ఈనాడులో అడ్డగోలు రాతలు రాస్తున్నాడని మండిపడ్డారు.
వివరాలు 10 ▸


మంగళవారం విశాఖపట్నంలో జీ20 దేశాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సుస్థిర హౌసింగ్‌పై చర్చిద్దాం

విశాఖలో జీ20 దేశాల ప్రతినిధులతో భేటీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ప్రతి ఒక్కరికీ సొంతింటిని సమకూర్చడమే మా లక్ష్యం
- రాష్ట్రంలో జోరుగా గృహ నిర్మాణాలు
- ఖర్చు తగ్గించడంతోపాటు నిర్మాణంలో నాణ్యత అత్యంత ప్రధానం
- మౌలిక సదుపాయాల కల్పనలో మెరుగైన విధానాలపై చర్చించాలి
- అధికారంలోకి వచ్చాక 30 లక్షల ఇళ్ల పట్టాలిచ్చాం
- 22 లక్షల గృహాల నిర్మాణాన్ని చేపట్టాం

సాక్షి, విశాఖపట్నం: మౌలిక సదుపాయాలు లాంటి కీలక రంగంపై జీ20 వర్కింగ్ గ్రూపు సమావేశాల్లో చర్చించడం శుభ పరిణామమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. విశాఖలో ప్రారంభమైన జీ20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు సమావేశంలో మంగళవారం రాత్రి వివిధ దేశాల ప్రతినిధులనుద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి దిశగా తమ ప్రభుత్వం పని చేస్తోందని, ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ రంగంలో కీలకమైన మౌలిక వసతులను కల్పించడంలో సుస్థిర విధానాలపై జీ20 వర్కింగ్ గ్రూపు ఆలోచన చేయాలని కోరారు. 'రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. లక్షల ఇళ్లకు మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్రైనేజీ, రోడ్లు, కరెంట్.. ఇలా కనీస సదుపాయాలను కల్పించడంలో స్థిరమైన విధానాలపై జీ20 వర్కింగ్ గ్రూపు ఆలోచన చేయాలని కోరుతున్నా. ఖర్చును తగ్గించడంతోపాటు నిర్మాణంలో నాణ్యత అత్యంత ప్రధానం. కలలలోగిళ్లు చిరకాలం నిలిచేలా

మిగతా 2వ పేజీలో ▶

విదేశీ ప్రతినిధులకు ఆత్మీయ విందు
ఆంధ్ర వైభవాన్ని చాటి చెప్పేలా సాంస్కృతిక ప్రదర్శనలు

జీ20 వసుధైక కుటుంబం పుస్తకావిష్కరణ
2లో

అనర్హత వేటే ఆయుధంగా... కాంగ్రెస్ ఆందోళన పథం

విపక్షాల ఐక్యతకు చొరవ
- స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!
- త్వరలో 'జై భారత్ మహా సత్యాగ్రహం'
- నెలపాటు జాతీయ స్థాయిలో ఆందోళనలు


పార్లమెంట్ బయట విపక్ష ఎంపీల నిరసన

జాతీయ స్థాయిలో విపక్షాల ఐక్యత దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి! వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనేందుకు విపక్షాలన్నింటినీ ఒక్కతాటిపైకి తెచ్చే ప్రయత్నాలకు కాంగ్రెస్ పదును పెడుతోంది! రాహుల్‌పై అనర్హత వేటునే ఇందుకు ఆయుధంగా మలచుకుంటోంది. రాహుల్‌పై వేటు విషయమై లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని యోచిస్తోంది. ఏప్రిల్ తొలి వారంలో విపక్షాల ముఖ్య నేతలతో సమావేశం కానుంది.
6లో

అమలాపురం ఘటనలో కేసుల ఉపసంహరణ
- సామాజిక వర్గాల్లో సామరస్యాన్ని పెంపొందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ
- క్యాంపు కార్యాలయంలో కోనసీమ నేతలతో సమావేశం
- అన్నదమ్ముల్లా కలిసుండాలని పిలుపు
- ప్రభుత్వ నిర్ణయంపై నేతల హర్షం

2లో

రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల కేసులో విచారించనున్న అధికారులు
- ఆర్థిక నేరాలకు కేరాఫ్‌గా మార్గదర్శి
- కేసులో దర్యాప్తు వేగవంతం

- వివరాలు 10లో



జూన్‌లో గ్రూప్-1 మెయిన్స్
- కొత్త షెడ్యూల్ విడుదల
- జూన్ 3 నుంచి 10 వరకు పరీక్షల నిర్వహణ
- ఏప్రిల్ 23 నుంచి 29 వరకు నిర్వహించేందుకు గతంలో తేదీల ప్రకటన
- యూపీఎస్సీ సివిల్స్ ఇంటర్వ్యూల నేపథ్యంలో వాయిదా వేసిన ఏపీపీఎస్సీ
- ఈ ఇంటర్వ్యూలకు ఏపీ నుంచి 25 మందికిపైగా అభ్యర్థుల ఎంపిక
- వారి భవిష్యత్తు దృష్ట్యా గ్రూప్–1 మెయిన్స్ వాయిదా

2లో

టెన్త్ పరీక్షలకు సకలం సిద్ధం
ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు.. ఉ.8.45 నుంచి ఉ.9.30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థుల అనుమతి

3లో

రాజధానిపై జూలై 11న విచారణ
- సుప్రీంకోర్టు వెల్లడి
- ఉపసంహరించిన చట్టాలపై హైకోర్టు తీర్పు చెప్పింది
- కేసులో పూర్తిస్థాయి స్టే లేదు
- ఈ అంశాన్ని త్వరగా తేల్చాలని సుప్రీంకోర్టును కోరిన ఏపీ ప్రభుత్వం

14లో

విదేశీ ప్రతినిధులకు ఆత్మీయ విందు

ఆంధ్ర వైభవాన్ని చాటి చెప్పేలా సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న విదేశీ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: జీ–20 సదస్సుకు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మీయ విందునిచ్చారు. అనంతరం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ, సాంస్కృతిక పరిణామంతో పాటు రాష్ట్ర చారిత్రక క్రమాన్ని తెలియజెప్పేలా ఇచ్చిన ప్రత్యేక నృత్య ప్రదర్శన విదేశీ ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకుంది. కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర, వంశధార, సువర్ణముఖీ నదీ తీరప్రాంతాలలో ఘనంగా విలసిల్లిన రాష్ట్ర చారిత్రక వారసత్వం, వ్యవసాయ, పాడి రంగాల్లో ఆంధ్రప్రదేశ్ వైభవాన్ని తెలియజెప్పేలా నృత్య ప్రదర్శనను నిర్వహించారు. క్రీస్తుపూర్వం కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో మానవ పరిణామ క్రమం, దేశ చరిత్రలో గొప్ప చక్రవర్తిగా పేరొందిన తెలుగు నృపతి గౌతమీ పుత్ర శాతకర్ణి పరిపాలనా కాలంలో తెలుగు నేల వైభవాన్ని చాటిచెప్పేలా మరో ప్రదర్శన ఏర్పాటు చేశారు. మహాభారతాన్ని తెలుగులో అనువదించిన నన్నయతో పాటు అంగట్లో రాశులుగా రత్నాలు అమ్మిన వైభవంతో తెలుగు నేలను పాలించిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి వైభవం.. అష్టదిగ్గజ కవులు, వారి సాహిత్యం, హంపీ వైభవం మొదలుకుని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి నవరత్నాల ద్వారా పేదలందరికీ సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై నవ్యాంధ్ర–దివ్యాంధ్ర పేరుతో కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలన్నీ విదేశీ ప్రతినిధులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

జీ-20 వసుధైక కుటుంబం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, అధికారులు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): జీ20 వసుధైక కుటుంబం 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే పుస్తకాన్ని మంగళవారం విశాఖ విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు రోజా, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. జీ20 సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వీరు విమానాశ్రయానికి వచ్చారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రులు మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు రేగుళ్ల మల్లికార్జునరావు రచించారని తెలిపారు.

నీటిలెక్కలు తేల్చడానికి రెడీ

- తెలంగాణ కోటా కంటే ఎక్కువగా 73.56 టీఎంసీలు వాడుకుందంటున్న ఏపీ ప్రభుత్వం
- తమ కోటా ఇంకా 199.31 టీఎంసీలు మిగిలాయని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలను కోటా కంటే అధికంగా వాడుకున్నారంటూ రెండు రాష్ట్రాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్న నేపథ్యంలో.. నీటిలెక్కలు తేల్చేందుకు కృష్ణాబోర్డు సిద్ధమైంది. ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా బేసిన్‌లో రెండు రాష్ట్రాలు వినియోగించుకున్న నీటిలెక్కలు తేల్చి.. కోటాలో మిగిలిన నీటిని లభ్యత ఆధారంగా కేటాయించేందుకు బోర్డు చైర్మన్ శివ్‌నంద్‌కుమార్ సిద్ధమయ్యారు. ఏప్రిల్ మొదటి వారంలో సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి అనువైన రోజును ఎంపిక చేయాలని రెండు రాష్ట్రాల జలవనరులశాఖ ఉన్నతాధికారులను కృష్ణాబోర్డు కోరింది. 2022–23 నీటి సంవత్సరంలో ఫిబ్రవరి 28 వరకు దిగువ కృష్ణా బేసిన్‌లో 972.46 టీఎంసీల లభ్యత ఉందని.. ఇందులో ఏపీ వాటా 641.82 (66 శాతం) టీఎంసీలు, తెలంగాణ వాటా 330.64 (34 శాతం) టీఎంసీలని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి కృష్ణాబోర్డుకు లేఖ రాశారు. ఫిబ్రవరి వరకు రెండు రాష్ట్రాలు 846.72 టీఎంసీలను వాడుకున్నాయని తెలిపారు. అందులో ఏపీ 442.52 (52.2 శాతం) టీఎంసీలు, తెలంగాణ 404.20 (47.8 శాతం) టీఎంసీలు వాడుకున్నాయని వివరించారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే ఏపీ కోటాలో ఇంకా 199.31 టీఎంసీలు మిగిలే ఉన్నాయని, తెలంగాణ ఆ రాష్ట్ర కోటా కంటే అధికంగా 73.56 టీఎంసీలు అదనంగా వాడుకుందని కృష్ణాబోర్డుకు ఫిర్యాదు చేశారు. ఇదిలాఉంటే.. ఉమ్మడి ప్రాజెక్టుల్లో కోటా కంటే ఏపీ ప్రభుత్వం అదనంగా 38.72 టీఎంసీలు వాడుకుందని, ఇకపై నీటిని వాడుకోకుండా కట్టడిచేయాలని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ కృష్ణాబోర్డుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే నీటిలెక్కలు తేల్చి వివాదానికి తెరదించడానికి కృష్ణాబోర్డు సిద్ధమైంది.

బీసీల మహాధర్నాతో హోరెత్తిన జంతర్‌మంతర్

బీసీల పోరాటానికి వైఎస్సార్‌సీపీ పూర్తి మద్దతు: ఎంపీలు మోపిదేవి, బీద



మహాధర్నాలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు మోపిదేవి, బీద

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంతో జంతర్‌మంతర్ హోరెత్తింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, రాష్ట్రీయ ఓబీసీ మహా సంఘ్ ఆధ్వర్యంలో 'బీసీల మహాధర్నా' జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలంటే కేంద్ర ప్రభుత్వానికి చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి.. చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, కేంద్ర బడ్జెట్లో బీసీలకు కనీసం రూ.లక్ష కోట్లు కేటాయించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ బీసీ కులగణన, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 27 శాతం నుండి 50%కి పెంచాలన్న డిమాండ్లపై పార్లమెంట్‌లో రోజూ పోరాడుతున్నామని చెప్పారు. సామాజిక న్యాయానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందన్నారు. బీసీల పోరాటానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తాను బీసీ ప్రధానినని చెప్పుకొంటున్నా.. తొమ్మిదేళ్ల పాలనలో బీసీలకు చేసిందేమీ లేదని బీఆర్‌ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్ మండిపడ్డారు. బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. బీసీలంతా రాజకీయ పార్టీలకు అతీతంగా, ఐక్యంగా ముందుకు సాగితే కేంద్రం దిగిరాక తప్పదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. ధర్నాను బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ యాదవ్ సమన్వయం చేయగా.. ప్రొఫెసర్ భవన్ రావు తైవాడే (మహారాష్ట్ర), ప్రొఫెసర్ జోగేంద్ర కవాడే, మాజీ ఎంపీ ఇంద్రజిత్ సింగ్ (పంజాబ్), హన్సరాజ్ (ఢిల్లీ) రాజేష్ షైనీ (హరియాణా), విక్రమ్ సాహా మాట్లాడారు.





జీ20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సదస్సులో భాగంగా విశాఖ సాగర తీరంలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

సుస్థిర హౌసింగ్‌పై చర్చిద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

ఎలాంటి విధానాలను అనుసరించాలన్న అంశంపై చర్చించాలి. ఈ చర్చల్లో అందుకు పరిష్కార మార్గాలు దొరుకుతాయని ఆశిస్తున్నా' అని తెలిపారు. రాష్ట్రంలో భూమి లభ్యత చాలా ఉందన్నారు. అధికారంలోకి వచ్చాక 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు 22 లక్షల గృహాల నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు.

ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం..

జీ 20 సదస్సు సందర్భంగా విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి ఆయన రాత్రి 7.05 గంటలకు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఆర్కే రోజా, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, కె.భాగ్యలక్ష్మి, శెట్టి ఫల్గుణ, నగర మేయర్ జి.హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని నిర్మల, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, టూరిజం స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, కలెక్టర్ ఏ.మల్లికార్జున తదితరులు ముఖ్యమంత్రికి సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి జీ 20 సదస్సు జరుగుతున్న రాడిసన్ బ్లూ హోటల్‌కు సీఎం చేరుకున్నారు. అంతకుముందు గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద ముఖ్యమంత్రి ప్రయాణించాల్సిన విమానంలో చిన్నపాటి సాంకేతిక సమస్య ఏర్పడటంతో పది నిమిషాలు అలస్యమైంది. విమానాన్ని పూర్తిస్థాయిలో పరీక్షించిన అనంతరం పైలెట్లు ప్రయాణానికి సిద్ధం చేశారు.



జీ20 సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాయంత్రం 6.25 గంటలకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖ బయలుదేరారు.

తొలిరోజు నాలుగు సెషన్లు

జీ20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సదస్సు మంగళవారం ఉదయం విశాఖ సాగర తీరంలో ఘనంగా ప్రారంభమైంది. జీ20 ఇండియా ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో ఈనెల 31 వరకు నాలుగు రోజుల పాటు సదస్సు జరగనుంది. రాడిసన్ బ్లూ హోటల్‌లో తొలిరోజు నాలుగు సెషన్లు నిర్వహించగా 14 సభ్య దేశాలు, ఎనిమిది అతిథి దేశాలు, 10 అంతర్జాతీయ సంస్థలకు చెందిన 57 మంది ముఖ్య ప్రతినిధులు హాజరయ్యారు. నగరాలను ఆర్థిక కేంద్రాలుగా తీర్చిదిద్దడం, పట్టణ మౌలిక సదుపాయాలు, ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను పెంచడం తదితర అంశాలపై చర్చించారు. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యూఎన్‌డీపీ), ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ), ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్), ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ), యూరోపియన్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ (ఈబీఆర్‌డీ) వంటి కీలక అంతర్జాతీయ సంస్థలకు చెందిన నిపుణులు సెషన్లలో పాల్గొన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ జియోగ్రఫీ, ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్, యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధులు జాతీయ మౌలిక సదుపాయాల వ్యయాన్ని మెరుగుపరచడంపై సదస్సులో కేస్ స్టడీస్‌ను సమర్పించారు. జీ 20 సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులకు రాడిసన్ బ్లూ హోటల్ ప్రవేశ ద్వారం వద్ద సన్నాయి మేళాలతో ఆహ్వానం పలికారు. అతిథుల నుదుట తిలకం దిద్ది హారతి పట్టారు. సదస్సు నేపథ్యంలో నగరంలో 2,500 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. హోటల్ ప్రాంగణంలోకి మీడియా సహా ఎవరినీ అనుమతించలేదు.

నేటి కార్యక్రమాలు ఇవీ..

రెండో రోజు బుధవారం హోటల్ సమీపంలోని సాగర తీరంలో యోగా, మెడిటేషన్, పౌష్టికాహార వినియోగంపై సంబంధిత నిపుణులతో అవగాహన కార్యక్రమాలుంటాయి. పట్టణాలు/నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా సమావేశంలో చర్చిస్తారు.



విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

అమలాపురం ఘటనలో కేసుల ఉపసంహరణ

సాక్షి, అమరావతి: అమలాపురం ఘటనలో నమోదైన కేసులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విభేదాలను రూపుమాపి సామాజిక వర్గాల మధ్య శాంతి, సామరస్యపూర్వక వాతావరణాన్ని పెంపొందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఈమేరకు అమలాపురం ఘటనలో నమోదైన కేసులను ఉపసంహరించాలని నిర్ణయించారు. సామాజికవర్గాల మధ్య సామరస్యాన్ని సాధించి ఐకమత్యాన్ని పెంపొందించేలా సీఎం జగన్ తీసుకున్న చొరవ పట్ల కోనసీమ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కోనసీమ ప్రాంత నేతలు, సామాజికవర్గాల నాయకులతో క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడిపూడి సూర్యనారాయణ తదితరులు ఇందులో పాల్గొన్నారు. అన్నదమ్ముల్లా అంతా కలసిమెలసి జీవిస్తూ ఒక్కటవుదామని సీఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

రేపటి తరాలు కూడా..

తరతరాలుగా మీరంతా అదే ప్రాంతంలో కలసిమెలసి జీవిస్తున్నారు. అక్కడే పుట్టి, అక్కడే పెరిగి, జీవిత చరమాంకం వరకూ అక్కడే ఉంటున్నారు. రేపటి తరాలు కూడా అక్కడే జీవించాలి. భావోద్వేగాల మధ్య కొన్ని ఘటనలు జరిగినప్పుడు వాటిని మరిచిపోయి మీరంతా మునుపటిలా కలిసిమెలిసి జీవించాలి. లేదంటే భవిష్యత్తు దెబ్బతింటుంది. దీన్ని లాగుతూ పోతే మనుషుల మధ్య దూరం పెరుగుతుంది. దీనివల్ల నష్టపోయేది మనమే. అందుకే అందరం కలిసి ఉండాలి. ఆప్యాయతతో ఉండాలి. చిన్న చిన్న గొడవలు, మనస్పర్థలు, అపోహలున్నా పక్కనపెట్టి ఆప్యాయంగా మాట్లాడుకుందాం. తప్పులు భూతద్దంలో చూసుకోకుండా కలిసిపోదాం. అందరం కలిసికట్టుగా ఒక్కటవుదాం. మిమ్మల్ని ఏకం చేయడం కోసం ఈ ప్రయత్నమంతా చేస్తున్నాం.



సీఎం వైఎస్ జగన్‌ను సత్కరిస్తున్న కోనసీమ ప్రాంత ప్రజాప్రతినిధులు, సామాజికవర్గాల నేతలు

పారదర్శకంగా స్వచ్ఛమైన వ్యవస్థ

పార్టీలను చూడకుండా సంతృప్త స్థాయిలో పథకాలు అందచేస్తున్నాం. వలంటీర్‌లకు తోడుగా గృహ సారథులు ఉంటారు. వ్యవస్థలో పారదర్శకత ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. రూపాయి కూడా లంచం లేకుండా రూ.2 లక్షల కోట్ల మేర లబ్ధిదారులకు నేరుగా (డీబీటీ) అందించడం దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదు. టీడీపీ హయాంలో ఏది కావాలన్నా లంచం ఇవ్వాల్సిందే. ఇప్పుడు ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్నాం. లంచాలకు తావులేని మంచి వ్యవస్థను తీసుకొచ్చాం. ఇలాంటి వ్యవస్థ ఉంటే సమాజానికి మంచి జరుగుతుంది.

భావోద్వేగాలతో ఊహించని ఘటన : పినిపే విశ్వరూప్, పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

అమలాపురంలో జరిగిన ఘటన దురదృష్టకరం. భావోద్వేగాలతో మేం ఊహించని ఘటన జరిగింది. దీన్ని మేం వ్యక్తిగతంగా తీసుకోలేదు. కోనసీమలో మళ్లీ గొడవలు రాకుండా మీరు (సీఎం జగన్) తీసుకున్న చొరవకు ధన్యవాదాలు. మేం మనస్ఫూర్తిగా కేసులన్నీ ఉపసంహరించుకుంటున్నాం. మా పట్ల మీరు చూపుతున్న ప్రేమకు కృతజ్ఞతలు. అందరం సమన్వయంతో ముందుకెళతాం.

పూర్తిగా సహకరిస్తాం: కాపు నాయకులు

నాడు జరిగిన ఘటనలు దురదృష్టకరం. అవి ఏమాత్రం మంచిది కాదు. సామరస్య వాతావరణం కోసం పూర్తిగా సహకరిస్తాం. దీనికోసం ముఖ్యమంత్రి చొరవ తీసుకోవడం హర్షణీయం. యువకుల భవిష్యత్తు, వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి పెద్ద మనసుతో తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

ఐకమత్యంగా ఉంటాం: శెట్టిబలిజ నాయకులు

శెట్టి బలిజ సామాజిక వర్గానికి గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇవ్వనన్ని పదవులు ఇచ్చి సీఎం జగన్ గౌరవించారు. పెద్ద మనసుతో కేసులు ఉపసంహరించి మరింత సాయం చేశారు. మీకు రుణపడి ఉంటాం. సమాజ శ్రేయస్సు కోసం మీరు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి శెట్టిబలిజ, కాపు సామాజిక వర్గాలు ఐకమత్యంగా ఉంటాయి.

జూన్‌లో గ్రూప్-1 మెయిన్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్–1 పోస్టుల భర్తీకి నిర్వహించాల్సిన మెయిన్స్ పరీక్షలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) రీషెడ్యూల్ చేసింది. ఏప్రిల్ 23 నుంచి 29 వరకు నిర్వహించాలని గతంలో నిర్ణయించిన ఈ పరీక్షలను జూన్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనుంది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్స్ పరీక్షలకు సంబంధించిన మూడోవిడత ఇంటర్వ్యూలు ఏప్రిల్ 24 నుంచి మే 18 వరకు జరుగనుండడంతో ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేసింది. సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారు ఆ ఇంటర్వ్యూల్లో విజయం సాధించేలా సన్నద్ధమయ్యేందుకు వీలుగా గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని కమిషన్ నిర్ణయించినట్లు ఏపీపీఎస్సీ సభ్యుడు ఎస్.సలాంబాబు తెలిపారు. రాష్ట్రం నుంచి 25 మందికి పైగా సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి సివిల్స్‌లో ఎక్కువమంది విజయం సాధించేలా ఆయా అభ్యర్థులు ప్రిపేరయ్యేందుకు వెసులుబాటు కల్పించేందుకు కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. జూన్ 3, 5, 6, 7, 8, 9, 10 వ తేదీల్లో గ్రూప్–1 మెయిన్ పరీక్షలు జరగనున్నాయి. కమిషన్ ఇచ్చే ఏ నోటిఫికేషన్ అయినా సకాలంలో పూర్తిచేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన సూచనలు ఇచ్చిన నేపథ్యంలో కమిషన్ అదేబాటలో నడుస్తోంది. టైమ్‌బౌండ్‌లో ఆయా నోటిఫికేషన్లను పూర్తిచేసి అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించేలా చేసింది. గ్రూప్–1 పోస్టుల విషయంలోను అదేరీతిన నోటిఫికేషన్ నుంచి ప్రిలిమ్స్ ఫలితాల వరకు చర్యలు తీసుకుంది. ఇంటర్వ్యూలు ఉండే పోస్టుల నోటిఫికేషన్లను తొమ్మిదినెలల్లో, ఇంటర్వ్యూలు లేని పోస్టుల నియామకాలను ఆరునెలల్లో పూర్తిచేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను మూడునెలల్లోనే పూర్తిచేయించి పోస్టులు భర్తీచేయించింది. అదే మార్గంలో గ్రూప్–1 పోస్టుల భర్తీకి 2022 అక్టోబర్‌లో నోటిఫికేషన్ జారీచేసి జనవరి 8న ప్రిలిమ్స్‌ను నిర్వహించింది. ఫలితాలను అదే నెల 27న విడుదల చేసింది. మెయిన్స్‌కు అభ్యర్థుల సన్నద్ధానికి వీలుగా 85 రోజుల వ్యవధి ఇస్తూ ఏప్రిల్ 23 నుంచి పరీక్షలను నిర్వహించేలా షెడ్యూల్ ఇచ్చింది. యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో కూడా మెయిన్స్ పేపర్లు తొమ్మిదికిగాను సగటున 90 రోజుల వ్యవధి ఇస్తుంటుంది. ఏపీపీఎస్సీ గ్రూప్–1లో ఏడు పేపర్లకు 85 రోజుల వ్యవధిని కమిషన్ అభ్యర్థులకు కల్పించింది. ఆగస్టు, సెప్టెంబర్‌ల నాటికి అభ్యర్థుల నియామకాన్ని పూర్తిచేయించేలా కమిషన్ కాలవ్యవధి నిర్ణయించుకుంది. అయితే ప్రస్తుతం యూపీఎస్సీ సివిల్స్ ఇంటర్వ్యూలు.. గ్రూప్–1మెయిన్స్ తేదీల్లోనే జరుగనుండడంతో ఆ అభ్యర్థుల మేలును దృష్టిలో పెట్టుకుని ఏపీపీఎస్సీ మెయిన్స్ తేదీలను వాయిదా వేసింది. కమిషన్ నిర్ణయం పట్ల అభ్యర్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సివిల్స్‌లో రాష్ట్రం నుంచి ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి ఎంతో మేలు చేకూరడంతో పాటు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను ఎదుర్కొనేందుకు తమకూ అవకాశం కలుగుతోందని వారు పేర్కొంటూ కమిషన్‌కు ధన్యవాదాలు చెబుతున్నారు.

జూన్ 3 నుంచి 10 వరకు పరీక్షలు నిర్వహించేలా కొత్త షెడ్యూల్

- ఏప్రిల్ 23 నుంచి 29 వరకు నిర్వహిస్తామని గతంలో ప్రకటన
- యూపీఎస్సీ సివిల్స్ ఇంటర్వ్యూల నేపథ్యంలో వాయిదా వేసిన ఏపీపీఎస్సీ
- ఏప్రిల్ 24 నుంచి మే 18 వరకు సివిల్స్ ఫేజ్–3 ఇంటర్వ్యూలు
- ఈ ఇంటర్వ్యూలకు ఏపీ నుంచి 25 మందికిపైగా అభ్యర్థుల ఎంపిక
- సివిల్స్ అభ్యర్థుల భవిష్యత్తు దృష్ట్యా గ్రూప్–1 మెయిన్స్ వాయిదా
- గతంలో టీడీపీ హయాంలో అభ్యర్థులకు తీరని అన్యాయం
- అప్పటి గ్రూప్–1 నోటిఫికేషన్‌ను పూర్తిచేయించి నిరుద్యోగులకు న్యాయం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

APPSC

గ్రూప్-1 మెయిన్ పరీక్షల షెడ్యూల్

తేదీ	పేపర్
జూన్ 3	తెలుగు పేపర్ (క్వాలిఫయింగ్ నేచర్)
జూన్ 5	ఇంగ్లిష్ పేపర్ (క్వాలిఫయింగ్ నేచర్)
జూన్ 6	పేపర్-1 జనరల్ ఎస్సే (ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు)
జూన్ 7	పేపర్-2 హిస్టరీ, కల్చరల్, జియోగ్రఫీ (ఇండియా, ఆంధ్రప్రదేశ్)
జూన్ 8	పేపర్-3 పాలిటీ, కానిస్టిట్యూషన్, గవర్నెన్సు, లా ఎథిక్స్
జూన్ 9	పేపర్-4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా అండ్ ఆంధ్రప్రదేశ్
జూన్ 10	పేపర్-5 సైన్స్, టెక్నాలజీ, ఎన్విరాన్మెంటల్ ఇష్యూస్

గతంలో అంతా గందరగోళం

గత ప్రభుత్వ హయాంలో గ్రూప్–1 నుంచి అన్ని నోటిఫికేషన్లలోను నిరుద్యోగులు తీవ్ర గందరగోళానికి గురికావలసి వచ్చిందని నిరుద్యోగ విద్యావంతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంపై తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో గ్రూప్–1లో చోటుచేసుకున్న నిర్వాకాలను గుర్తుచేస్తున్నారు. 2016లో నాటి ప్రభుత్వ హయాంలో 78 గ్రూప్–1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 2017 మే 7న ప్రిలిమ్స్ నిర్వహించారు. ప్రిలిమ్స్ ఫలితాలు మే 27న విడుదల చేసి ఆగస్టు 17 నుంచి మెయిన్స్ పరీక్షలను పెట్టారు. అంటే కేవలం 81 రోజుల వ్యవధిని మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. అప్పట్లో మెయిన్స్‌లో ఇంగ్లిష్‌లో అర్హత సాధించకపోయినా నాటి ప్రభుత్వంలోని పెద్దలకు సంబంధించిన ఐదుగురిని ఇంటర్వ్యూలకు దొడ్డిదారిన ఎంపిక చేశారు. దీనిపై వివాదం రేగడంతో తిరిగి కొత్తజాబితాను ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇక 2018 గ్రూప్–1 గురించి చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు. సరిగ్గా అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ జారీ చేసి నిరుద్యోగులను నాటి టీడీపీ ప్రభుత్వం మోసం చేసింది. ఆనాటి గ్రూప్–1 ప్రిలిమ్స్ 2019 మే 26న జరిగింది. ఈ పరీక్షల్లో పూర్తి అక్రమాలు, అవకతవకలు జరగడంతో గందరగోళం ఏర్పడింది. ఏకంగా 42 ప్రశ్నలు, సమాధానాలు తప్పుగా రావడం, న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలు కావడంతో మొత్తం ప్రక్రియ ఆలస్యమైంది. చివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ గ్రూప్–1పై న్యాయవివాదాలన్నిటినీ పరిష్కరించి మెయిన్స్ నిర్వహించి నిరుద్యోగులకు న్యాయం చేసింది. మెయిన్స్‌లో కూడా డిజిటల్ ఇవాల్యుయేషన్‌పై న్యాయవివాదాన్ని లేవనెత్తుతూ తెలుగుదేశం నేతలు నియామకాలను అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. అయినా వాటిని కూడా పరిష్కరించి అభ్యర్థులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం న్యాయం చేసింది. కాగా, గ్రూప్–1 మెయిన్ పరీక్షల షెడ్యూల్‌ను ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. జూన్ 3 నుంచి 10వ తేదీవరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

'రుడా' పరిధిలోకి 65 గ్రామాలు

సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిని ప్రభుత్వం విస్తరించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 4 మండలాలకు చెందిన 65 గ్రామాలను రుడా పరిధిలోకి తీసుకువస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. రామచంద్రాపురం రూరల్, కె.గంగవరం మండలాల్లోని అన్ని గ్రామాలు, రాయవరం, కపిలేశ్వరం మండలాలకు చెందిన కొన్ని గ్రామాలను కలిపి 338 చ.కి.మీ పరిధిని పెంచింది. కొత్త గ్రామాల చేరికతో రుడా పరిధి 3,142 చ.కి.మీకి చేరింది.

30న రామతీర్థంలో శ్రీరామనవమి ఉత్సవాలు

సాక్షి, అమరావతి: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 30న విజయనగరం జిల్లా నెలిమర్ల మండలం రామతీర్థంలోని శ్రీరామస్వామి ఆలయంలో ప్రభుత్వం అధికారికంగా నవమి ఉత్సవాలను నిర్వహించనుంది. ఆ రోజు ఆలయంలో నిర్వహించే శ్రీరామనవమి వేడుకల్లో స్వామివార్లకు పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి బొత్స సమర్పించనున్నట్లు దేవదాయ శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

163 నియోజకవర్గాలకు బీజేపీ కన్వీనర్ల నియామకం

రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రకటన

సాక్షి, అమరావతి: పార్టీ సంస్థాగత కార్యక్రమాల పర్యవేక్షణకు బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గాలకు కన్వీనర్లు, కో–కన్వీనర్లను ప్రకటించింది. రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అందులో 163 అసెంబ్లీ నియోజకవర్గాలలో కొన్నింటికీ అసెంబ్లీ కన్వీనర్, కో–కన్వీనర్‌లను, కొన్నింటికి కేవలం కన్వీనర్లను మాత్రమే నియమించారు. పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అచ్చెన్న హత్యపై త్రిసభ్య కమిటీ విచారణ

కడప (అగ్రికల్చర్): కడప బహుళార్థ పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న హత్యపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ శాఖాపరమైన విచారణ చేపట్టింది. కమిటీ సభ్యులు పశు సంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్లు సింహాచలం, వెంకట్రావు, జేడీ రత్నకుమారి మంగళవారం కడపలోని జిల్లా పశు సంవర్థక శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ముందుగా అచ్చెన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో విచారణ చేపట్టి.. ఫిబ్రవరి 14, 15 తేదీలలో నిజనిర్ధారణ కమిటీ వచ్చి వెళ్లిన తరువాత చోటుచేసుకున్న పరిణామాలపై ఆరా తీశారు. ఏడీ శ్రీధర్‌లింగారెడ్డి, సురేంద్రనాథ్ బెనర్జీలను జేడీ కార్యాలయానికి పిలిపించి త్రిసభ్య కమిటీ ఆరా తీసినట్టు తెలిసింది. దీంతోపాటు కార్యాలయంలో పనిచేసే మరి కొందరిని విచారించడంతోపాటు లిఖితపూర్వకంగా వివరాలను సేకరించినట్టు తెలిసింది.



రాష్ట్రంలో ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరగనున్న టెన్త్ పబ్లిక్‌పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. విద్యార్థులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందిలేకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతోంది. వారికి అవసరమైన ఫర్నిచర్, మంచినీటి సదుపాయంతో పాటు అత్యవసర సమయాల్లో సేవలందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతోంది. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చర్యలు చేపట్టారు. కొత్తగా పునర్విభజించిన 26 జిల్లాల ప్రాతిపదికన ఇవి జరుగుతాయి. ఆయా జిల్లాల డీఈఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్ని జిల్లాల అధికారులు, వివిధ శాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు.

– సాక్షి, అమరావతి

టెన్త్ పరీక్షలకు సకలం సిద్ధం

ఏప్రిల్ 3 నుంచి 18 వరకు నిర్వహణ

ఉ.8.45 నుంచి ఉ.9.30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థుల అనుమతి

- మొత్తం 6.64 లక్షల మంది విద్యార్థుల హాజరు
- రాకపోకలకు అనువుగా ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, విద్యార్థులకు ఉచిత ప్రయాణ సదుపాయం
- సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబులు, కెమెరాలు, ఇయర్‌ఫోన్లు సహ డిజిటల్ పరికరాల నిషేధం
- అధికారులు కూడా ఎవరూ తీసుకురాకూడదు
- రాష్ట్రవ్యాప్తంగా 3,449 పరీక్ష కేంద్రాల ఏర్పాటు.. అన్నిచోట్లా 144 సెక్షన్ విధింపు
- పేపర్ల లీకేజీ, ఫేక్ ప్రచారాల నివారణకు మొబైల్ పోలీసు స్క్వాడ్‌లు..
- డీఈఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూముల ఏర్పాటు
- ఏప్రిల్ 19 నుంచి 26 వరకు మూల్యాంకనం
- పరీక్షల ఏర్పాట్లను సమీక్షించిన పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

విద్యార్థులు, పరీక్ష కేంద్రాలు ఇతర వివరాలు..

రెగ్యులర్ అభ్యర్థులు 6,09,070	బాలురు 3,11,329
బాలికలు 2,97,741	సప్లిమెంటరీ అభ్యర్థులు 53,410
ఓఎస్సెస్సీ అభ్యర్థులు 1525	ఓఎస్సెస్సీ సప్లిమెంటరీ 147
మొత్తం అభ్యర్థులు 6,64,152	మొత్తం పరీక్షా కేంద్రాల సంఖ్య 3,449
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 156	సిట్టింగ్ స్క్వాడ్‌లు 682

మూల్యాంకనం ఏప్రిల్ 19-26 వరకు..

ఉ.9:30 నుంచి మ.12:45 గంటల వరకు..

ఈ పరీక్షలు ఉ.9:30 నుంచి మ.12:45 గంటల వరకు 3.15 గంటల పాటు నిర్వహిస్తారు. అభ్యర్థులను ఉ.8:45 నుంచి 9:30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. తద్వారా వారు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలను రాయగలుగుతారని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. అలాగే.. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌తో సహా, ఎవరూ మొబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లడానికి అనుమతించరు. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, కెమెరాలు, ఇయర్‌ఫోన్లు, స్పీకర్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ వంటి ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలనూ అనుమతించరు. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నారు. విద్యాశాఖతో పాటు రెవెన్యూ, పోలీసు, పోస్టల్, ఆర్టీసీ, వైద్యారోగ్య శాఖ, ఏపీ ట్రాన్స్‌కో తదితర విభాగాలు ఈ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నాయి.

ప్రతి పాయింట్లోనూ పోలీసు భద్రత

పరీక్ష పత్రాల రక్షణ దృష్ట్యా అన్ని డిస్ట్రిబ్యూషన్, స్టోరేజ్ పాయింట్‌ల వద్ద కాన్ఫిడెన్షియల్ ఎగ్జామినేషన్ మెటీరియల్‌కు భద్రత ఉండేలా పోలీసులను ఏర్పాటు చేయనున్నారు. వీటిని తీసుకెళ్లే వాహనాలకు జిల్లా కేంద్రాల నుంచి ఎస్కార్ట్ ఏర్పాటుచేస్తారు. పరీక్షా కేంద్రాల సందర్శనకు పోలీసు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు కేంద్రాల వద్ద సాయుధ గార్డులను పెట్టనున్నారు. ఇక ప్రశ్నపత్రాల లీకేజీ, నకిలీ ప్రశ్నపత్రాలు మొదలైన వాటికి సంబంధించిన పుకార్లను నిలువరించే చర్యలకు వీలుగా మొబైల్ పోలీస్ స్క్వాడ్‌లకు సూచనలు అందిస్తారు. ఎక్కడైనా తప్పిదాలు జరిగితే సంబంధిత సిబ్బందిని వెంటనే విధుల నుంచి తప్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తారు. శాంతిభద్రతల నిర్వహణకు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించనున్నారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్, నెట్‌సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్ష కేంద్రాలకు పరీక్షలు జరిగినన్ని రోజులూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

ఇక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల రాకపోకలకు వీలుగా ఆర్టీసీ కూడా చర్యలు తీసుకుంటోంది. అన్ని రూట్లలో ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపనున్నారు. హాల్ టికెట్ ఉన్న అభ్యర్థులు అన్ని పరీక్షల రోజుల్లో వారి నివాసం నుండి పరీక్షా కేంద్రానికి ఉచితంగా ప్రయాణించడానికి అనుమతిస్తారు. అలాగే..

- ఎండల దృష్ట్యా విద్యార్థులు అస్వస్థతకు, అనారోగ్యానికి గురికాకుండా పరీక్ష కేంద్రాల్లో ఏఎన్ఎంల నియామకంతో పాటు తగిన మెడికల్ కిట్లను వైద్యశాఖ ఏర్పాటుచేయనుంది. మొబైల్ మెడికల్ వాహనాలను కూడా అందుబాటులో ఉంచనుంది.
- అన్ని పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్‌తో పాటు వెంటిలేషన్, పరిశుభ్ర వాతావరణం, ఉండేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.
- ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్‌లో సహా అన్ని జిల్లాల విద్యాధికారి కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేయనున్నారు. డైరెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 0866–2974540
- వొకేషనల్ పబ్లిక్ పరీక్షలతో సహా అన్ని సబ్జెక్టులకు బార్‌కోడింగ్ విధానాన్ని పొడిగించనున్నారు. కోడింగ్ విధానంపై జిల్లా స్థాయిలో బార్‌కోడ్ సూపర్‌వైజర్లు, ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇస్తారు. సమాధాన పత్రాలను కోడింగ్ విధానంలో మూల్యాంకనం చేయనున్నారు.
- కోడింగ్ నంబర్ల పరిశీలన తదితర పనులు నిర్వహించాల్సి ఉన్నందున ఇన్విజిలేటర్లు ఉ.8:15లోపు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌కి రిపోర్ట్ చేయాలి.
- విద్యార్థులకు ఇచ్చే గ్రాఫ్‌లు, మ్యాప్ పాయింట్లు, సమాధానాల బుక్‌లెట్లపై రోల్ నెంబర్, పేరు వంటివి రాయకూడదు. గ్రాఫ్‌లు, మ్యాప్ పాయింట్లు అటుఇటు కాకుండా ఉండేందుకు బుక్‌లెట్‌పై క్రమసంఖ్యను రాసేలా చూడాలి.

గవర్నర్‌ను కలిసిన సమాచార కమిషన్ సభ్యులు



సాక్షి, అమరావతి: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ సభ్యులు రాజ్‌భవన్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషన్ పనితీరు, రాష్ట్రంలో ఆర్టీఐ చట్టం అమలుపై సంక్షిప్త నివేదికను సమర్పించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా, కమిషన్ సభ్యులు కట్టా జనార్ధనరావు, ఐలాపురం రాజా, ఆర్.శ్రీనివాసరావు, యు.హరిప్రసాద్‌రెడ్డి, కె.చెన్నారెడ్డి, పి.శామ్యూల్ జోనాథన్, కార్యదర్శి(లా) జి.శ్రీనివాసులు ఉన్నారు.

ఏదో పనిమీద పక్క దేశానికి వెళ్తున్నారు. చేతిలో ఎలాంటి డాక్యుమెంట్లు లేవు. విమానాశ్రయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్కానర్ ద్వారా నడిచి వెళ్లారు. అంతే చెకింగ్, ఇమిగ్రేషన్ గట్రా అన్నీ అయిపోయాయి. విమానంలో కూర్చోగానే.. సీటు మీ శరీరానికి తగ్గట్టుగా మారిపోయింది. విమానం దిగి హోటల్‌కు వెళ్లగానే ఆకలేసింది. మనకు నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేయగానే.. ప్రింట్ చేసి తెచ్చి ఇచ్చేశారు..

ఇదేమిటి ఏదేదో చెప్పేస్తున్నారు అనిపిస్తోందా? భవిష్యత్తులో.. అంటే 2070 నాటికి ప్రయాణం ఇలానే ఉంటుందట. ఆ వివరాలేమిటో చూద్దామా..

హార్ట్‌బీటే పాస్‌పోర్ట్.. ప్రింట్ చేసిందే ఆహారం..

బ్రిటన్‌కు చెందిన 'ది ఈజీ జెట్'సంస్థ మరో 50 ఏళ్ల తర్వాత ప్రయాణాల తీరు ఎలా ఉంటుంది? సెలవులను ఎలా ఎంజాయ్ చేస్తామన్న అంశంపై శాస్త్రవేత్తలు, నిపుణులతో మాట్లాడి 'ది ఈజీ జెట్ 2070 ఫ్యూచర్ ట్రావెల్'పేరిట నివేదికను విడుదల చేసింది. లండన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బిర్గిట్టె అండర్సన్, డిజైన్ సైంటిస్ట్ మెలిస్సా స్టెర్రీ, క్రాన్‌ఫీల్డ్ వర్సిటీ ప్రొఫెసర్ గ్రాహం బ్రైత్‌వేట్‌లతో పాటు మరికొందరు తమ అంచనాలను వెల్లడించారు.



జస్ట్ అలా నడిచివెళితే చాలు..

ప్రతి ఒక్కరి వేలిముద్ర, కంటి ఐరిస్ వేర్వేరుగా ఉన్నట్టే.. గుండె కొట్టుకునే సిగ్నేచర్ కూడా విభిన్నంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ సిగ్నేచర్ డేటాను స్టోర్ చేసి.. వ్యక్తిగత గుర్తింపు, పాస్‌పోర్టుగా వాడొచ్చంటున్నారు. ఉదాహరణకు విమానాశ్రయంలోని ప్రత్యేక మార్గం ద్వారా వెళ్లగానే.. సెన్సర్లు, కెమెరాలు, ప్రత్యేక పరికరాలు స్పందిస్తాయి. ఐరిస్ స్కాన్, ఫేషియల్ రికగ్నిషన్ (ముఖం గుర్తింపు), హార్ట్‌బీట్ సిగ్నేచర్‌లను గుర్తించి.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేస్తాయి. ఇదంతా సెకన్లలోనే జరిగిపోతుంది.



విమానంలో కూర్చోగానే..

ప్రయాణికులు విమానం ఎక్కి సీట్లో కూర్చోగానే.. వారి శరీరానికి తగినట్టు (సన్నగా, లావుగా, పొడవు, పొట్టి.. ఇలా) కాళ్లగా సీటు ఆకృతి మారిపోతుంది. సీటుపై తలకు పక్కన అమర్చిన ప్రొజెక్టర్ నుంచి సరిగ్గా కళ్లకు ముందు డిస్‌ప్లే ఏర్పడుతుంది. ఏ ఇబ్బందీ లేకుండా కావాల్సినవి వీక్షించవచ్చు.

ఇల్లు- ఎయిర్‌పోర్ట్ టెర్మినల్- ఇల్లు

ఉన్నచోటి నుంచే గాల్లోకి ఎగిరి ప్రయాణించి మళ్లీ అలాగే కిందకు దిగగలిగే (వీటీఓఎల్) ఎయిర్ ట్యాక్సీలు అంతటా అందుబాటులోకి వస్తాయి. ఇంటి దగ్గరే ఎయిర్ ట్యాక్సీ ఎక్కి నేరుగా విమానాశ్రయం టెర్మినల్‌లో దిగడం.. ప్రయాణం చేశాక మళ్లీ టెర్మినల్ నుంచి నేరుగా ఇంటి వద్ద దిగడం.. సాధారణంగా మారిపోతుంది.

త్రీడీ ప్రింటెడ్ ఫుడ్.. కావాల్సినట్టు బెడ్

- మనకు నచ్చిన ఆహారాన్ని కాసేపట్లోనే ఫ్రెష్‌గా ప్రింట్ చేసి ఇచ్చే 'ఫుడ్ త్రీడీ ప్రింటింగ్'మెషీన్లు అందుబాటులోకి వస్తాయి. అల్పాహారం నుంచి రాత్రి భోజనం దాకా ఏదైనా ప్రింట్ చేసుకుని తినేయడమే.



- హోటళ్లలో రూమ్‌లు 'స్మార్ట్'గా మారిపోతాయి. మనం రూమ్‌కు వెళ్లే ముందే.. గదిలో ఉష్ణోగ్రత ఎంత ఉండాలో, లోపలికి వెళ్లగానే ఏదైనా సంగీతం ప్లేకావాలో, బెడ్ ఎంత మెత్తగా ఉండాలో, గీజర్‌లో నీళ్ల ఎంత వేడితో ఉండాలో నిర్ణయించుకోవచ్చు. అందుకు తగినట్టుగా అన్నీ మారిపోతాయి.
- మనకు కావాల్సిన మోడల్, డిజైన్, వస్త్రంతో డ్రెస్సులు కూడా త్రీడీ ప్రింటింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అంటే మనం ఇక లగేజీ తీసుకెళ్లాల్సిన అవసరం దాదాపు లేనట్టే.

ప్రత్యేక సూట్లతో 'టైమ్ ట్రావెలింగ్'



హాలిడే కోసం ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్లినప్పుడు ప్రత్యేకమైన 'హాప్టిక్'సూట్లను వేసుకోవచ్చు. ఏదైనా ప్రదేశాన్ని చూస్తున్న సమయంలోనే వర్చువల్/అగుమెంటెడ్ రియాలిటీ ద్వారా.. అవి ఒకప్పుడు ఎలా ఉండేవి, ఎలా మారుతూ వచ్చాయన్నది కళ్ల ముందే కనిపించే సదుపాయం వచ్చేస్తుంది.

ఇతర భాషల్లో ఎవరైనా మాట్లాడుతుంటే.. అప్పటికప్పుడు మనకు కావాల్సిన భాషలోకి మార్చి వినిపించే 'ఇన్ ఇయర్' పరికరాలు వస్తాయి. ఎక్కడైనా, ఏ భాష వారితోనైనా సులభంగా మాట్లాడొచ్చు.

సాక్షి, సెంట్రల్ డెస్క్

ఏపీలో మానవ వనరుల అభివృద్ధి అభినందనీయం

- ప్రపంచ బ్యాంక్ డైరెక్టర్ (ఇండియా) ఆగస్ట్ తను కమే
- పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం అమలు సంతృప్తికరం
- గుంటూరు జిల్లా వెనిగండ్లలో పర్యటన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆగస్ట్ తను కమే

పెదకాకాని/సాక్షి, అమరావతి: ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్యం అవసరాన్ని, ప్రాధాన్యతను గుర్తించి వివిధ పథకాలు అమలు చేస్తున్న విధానం అభినందనీయమని ప్రపంచ బ్యాంక్ డైరెక్టర్ (ఇండియా) ఆగస్ట్ తను కమే అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, ఎస్‌ఏపీడీ శ్రీనివాస్‌తో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీతో ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆగస్ట తను కమే మాట్లాడుతూ.. ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఈ రంగాల్లో సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారని, విద్య, వైద్య రంగాల పనితీరు చాలా బాగుందన్నారు. ఈ రంగాలకు ప్రపంచ బ్యాంకు తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ రెండు రంగాల్లో భాగస్వామిగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. తరగతి గదుల్లో విద్యార్థులు చదువు పట్ల చూపుతున్న శ్రద్ధ, మధ్యాహ్న భోజనాన్ని తృప్తిగా తినడం మంచి పరిణామం అన్నారు. ప్రభుత్వం మన బడి నాడు–నేడు పథకం ద్వారా విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడం శుభపరిణామమన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నారని వివరించారు. అధికారులతో కలిసి విద్యార్థులు ఉపయోగిస్తున్న టాయిలెట్లను పరిశీలించారు. నాడు నేడు ప్రోగ్రాం డైరెక్టర్ కాలెబ్, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావులతో కలిసి మంగళవారం విజయవాడలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.

ఇంగ్లిష్ ప్రావీణ్యం బావుంది

ప్రపంచ బ్యాంకు బృందం మంగళవారం సాయంత్రం సెక్రటేరియెట్‌లో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో, ముఖ్యంగా బాలికల్లో ఆంగ్ల సంభాషణలు విని సంతోషం కలిగిందన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. 'సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచడానికి, ఆహ్లాదకరమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించడానికి తీసుకుంటున్న చర్యలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వివరించారు. ఈ ప్రాజెక్టు 2021 జూలై నుంచి 2026 జూన్ వరకు అమలవుతుందని తెలిపారు.

అభివృద్ధిని ప్రత్యక్షంగా చూశాం: ఆగస్ట్ తను కమే

సీఎం వైఎస్ జగన్ పనితీరు, పాలనకు ప్రపంచ బ్యాంకు కితాబు ఇచ్చింది. ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ (ఇండియా) ఆగస్ట్ తను కమే నేతృత్వంలోని బృందం రాష్ట్రంలో పర్యటిస్తూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సోమవారం సమావేశమై ప్రపంచ బ్యాంకు సాయంతో రాష్ట్రంలో అమలవుతున్న మూడు ప్రాజెక్టులపై సమీక్షించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సీఎం జగన్ పనితీరును మెచ్చుకుంటూ ఆగస్ట్ తను కమే మంగళవారం ట్వీట్ చేశారు. ''మీ దార్శనికతను మాతో పంచుకున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. విద్య, వైద్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన వైనాన్ని మేము వణుకూరు, భవానీపురం, వెనిగండ్లలో ప్రత్యక్షంగా చూశాం. ఈ రంగాలపై ప్రభుత్వం భవిష్యత్‌లో కూడా అధికంగా వ్యయం చేయనుండటం, నమోదవుతున్న వృద్ధి ఈ రంగాల్లో స్థిరమైన పెట్టుబడులను ఆకర్షిస్తాయి'' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.


పోలవరానికి రూ.826.18 కోట్లు విడుదల

రాష్ట్ర ప్రభుత్వానికి రీయింబర్స్ చేస్తూ కేంద్ర ఆర్థికశాఖ ఉత్తర్వులు

- ఇంకా రీయింబర్స్ బకాయిలే రూ.1,755.80 కోట్లు
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా రూ.1,671.23 కోట్లు విడుదల
- 2014, ఏప్రిల్ 1 నుంచి ఇప్పటిదాకా పోలవరానికి రూ.16,045.19 కోట్లు ఖర్చుచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటివరకు రూ.14,289.39 కోట్లు రీయింబర్స్ చేసిన కేంద్రం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులకు చేసిన ఖర్చులో మరో రూ.826.18 కోట్లను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇంకా రూ.1,755.80 కోట్లు రీయింబర్స్ చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1,671.23 కోట్లను కేంద్రం పోలవరం ప్రాజెక్టుకు విడుదల చేసింది.

విభజన చట్టం ప్రకారం వంద శాతం వ్యయంతో కేంద్రమే నిర్మించాల్సిన ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కమీషన్ల కక్కుర్తితో 2016, సెప్టెంబరు 7 అర్ధరాత్రి రాష్ట్ర ప్రభుత్వానికి దక్కేలా నాటి సీఎం చంద్రబాబు చేశారు. ఈ క్రమంలో 2013–14 ధరల ప్రకారం 2014, ఏప్రిల్ 1 నాటికి మిగిలిన నీటిపారుదల విభాగం వ్యయాన్ని మాత్రమే చెల్లిస్తామని కేంద్రం పెట్టిన షరతుకు నాటి టీడీపీ సర్కార్ అంగీకరించింది. ప్రాజెక్టు పనులకు తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తే.. ఆ తర్వాత వాటిని రీయింబర్స్ చేస్తామని కూడా కేంద్రం మెలిక పెట్టింది. రీయింబర్స్ చేయడంలో కేంద్రం తీవ్ర జాప్యంచేస్తున్నా.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ఖజానా నుంచే నిధులు కేటాయిస్తూ పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ ప్రణాళికాయుతంగా పూర్తిచేస్తున్నారు. ప్రాజెక్టు సత్వర పూర్తికి రూ.15 వేల కోట్లను ముందస్తుగా విడుదల చేయాలని.. బకాయిపడిన రూ.2,581.88 కోట్లను రీయింబర్స్ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన ప్రతి సందర్భంలోనూ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్రం స్పందించి రూ.826.18 కోట్లు విడుదల చేసింది.



ఏడాదికి సగటున రూ.1,587.71 కోట్లు..

పోలవరం ప్రాజెక్టు పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.20,775.90 కోట్లు ఖర్చుచేసింది. ఇందులో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించక ముందు.. అంటే 2014, ఏప్రిల్ 1కి కంటే ముందు రూ.4,730.71 కోట్లను వెచ్చించింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక 2014, ఏప్రిల్ 1 తర్వాత ప్రాజెక్టు పనులకు రూ.16,045.19 కోట్లు వ్యయం చేసింది. అందులో 2014 నుంచి ఇప్పటిదాకా రూ.14,289.39 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసింది. అంటే తొమ్మిదేళ్లలో ఏడాదికి సగటున రూ.1,587.71 కోట్లు విడుదల చేస్తోంది.

వెంటాడుతున్న చంద్రబాబు పాపం..

- కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను దక్కించునే క్రమంలో 2013–14 ధరల ప్రకారం నిధులిస్తామని కేంద్రం పెట్టిన షరతుకు నాటి సీఎం చంద్రబాబు అంగీకరించడం పోలవరం ప్రాజెక్టుకు శాపంగా మారింది.
- 2017–18 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.55,548.86 కోట్లుగా కేంద్ర జలసంఘం సాంకేతిక సలహా మండలి (టీఏసీ) ఆమోదించింది. దీన్ని రూ.47,725.74 కోట్లకు రివైజ్డ్ కాస్ట్ కమిటీ (ఆర్‌సీసీ) కుదించింది. 2013–14 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్టు నీటిపారుదల విభాగం వ్యయం రూ.20,398.61 కోట్లుగా తేల్చింది. ఇందులో 2014, ఏప్రిల్ 1 వరకూ ఖర్చుచేసిన రూ.4,730.71 కోట్లు పోనూ మిగిలిన రూ.15,667.90 కోట్లను మాత్రమే విడుదల చేస్తామని తేల్చిచెప్పింది.
- 2013–14 ధరల ప్రకారం నిధులిస్తే చాలని నాటి సీఎం చంద్రబాబు అంగీకరించడంతో.. ఆ ప్రకారమే నిధులిస్తామని కేంద్ర జల్‌శక్తి శాఖ పేర్కొంది. ఇప్పటికే రూ.14,289.39 కోట్లను విడుదల చేసిన నేపథ్యంలో.. ఇంకా రూ.1,378.51 కోట్లు మాత్రమే ఇస్తామని చెబుతోంది. ఇది పోలవరం ప్రాజెక్టు పనులకు అడ్డంకిగా మారుతోంది.
- 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస కల్పన వ్యయమే రూ.33,168.23 కోట్లని.. రూ.20,398.61 కోట్లతో ప్రాజెక్టును ఎలా పూర్తిచేయగలమని ప్రధాని మోదీ, కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లతో సమావేశమైన ప్రతి సందర్భంలోనూ సీఎం జగన్ విజ్ఞప్తి చేస్తూ వస్తుండటంతో.. కేంద్రం ఆ దిశగా అడుగులు వేస్తోంది. 2017–18 ధరల ప్రకారం కేంద్రం నిధులు ఇవ్వాలంటే.. సవరించిన అంచనా వ్యయం రూ.55,548.87 కోట్లను కేంద్ర మంత్రిమండలి ఆమోదించాల్సి ఉంది.

కోతకు గురైన ప్రాంతంలో సమాంతరంగా డయాఫ్రమ్ వాల్

- కొత్తగా 'యూ' ఆకారంలో నిర్మించి పాతదానితో అనుసంధానం చేయాలి
- 21వ సమావేశం మినిట్స్ విడుదల చేసిన డీడీఆర్పీ చైర్మన్ ఏబీ పాండ్య

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ప్రధాన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పునాది కోతకు గురైన ప్రాంతంలోను, దెబ్బతిన్న రెండుచోట్ల సమాంతరంగా 'యూ' ఆకారంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి పాతదానితో అనుసంధానం చేయాలని జలవనరుల శాఖ అధికారులకు డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) దిశానిర్దేశం చేసింది. ఈ పనులు పూర్తయ్యాక డయాఫ్రమ్ వాల్ పటిష్టతపై మరోసారి పరీక్షలు నిర్వహించి.. ప్రధాన డ్యామ్ పనులు ప్రారంభించాలని సూచించింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గోదావరి వరదల ఉధృతికి కోతకు గురవడం వల్ల ఏర్పడిన నాలుగు అగాధాలను ఇసుకతో పూడ్చి.. సాంద్రత 85 శాతం వచ్చేవరకు వైబ్రో కాంపాక్షన్ చేయడం ద్వారా యథాస్థితికి తేవాలని నిర్దేశించింది. ఈ పనులను తక్షణమే చేపట్టడానికి అనుమతి ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టు పనులను ఈనెల 4న ఏబీ పాండ్య నేతృత్వంలో సీడబ్ల్యూసీ, వ్యాప్కోస్, సీడబ్ల్యూపీఆర్ఎస్, ఎన్‌హెచ్‌పీసీ, పీపీఏ నిపుణులు సభ్యులుగా ఏర్పాటైన డీడీఆర్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈనెల 5న రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సమావేశమై గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడం, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చి యథాస్థితికి తేవడంపై చర్చించింది. వాటిపై విధానపరమైన నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు సంబంధించి 21వ సమావేశం మినిట్స్‌ను మంగళవారం డీడీఆర్పీ చైర్మన్ ఏబీ పాండ్య విడుదల చేశారు. ఆ మినిట్స్‌లో ప్రధానాంశాలు ఇవీ...

డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో 1,750 మీటర్ల పొడవున నిర్మించాలి. ఇందులో జీ–హిల్ పోను మిగతా 1,396 మీటర్ల పొడవున నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌పై గోదావరి వరద ప్రభావం పడింది. డయాఫ్రమ్ వాల్ కోతకు గురైన ప్రాంతంలో (175 నుంచి 360 మీటర్ల వరకు ఒక భాగం, 1,170 నుంచి 1,370 మీటర్ల వరకు మరో భాగం) సమాంతరంగా 'యూ' ఆకారంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి పాత దానితో అనుసంధానం చేయాలి.
- డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని, బలహీనంగా మారిన రెండు ప్రదేశాల్లో (477 నుంచి 513 మీటర్ల వరకు, 948 నుంచి 1,020 మీటర్ల వరకు) రాతిపొర తగిలేవరకూ 'యూ' ఆకారంలో సమాంతరంగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేయాలి. మిగతా భాగంలో డయాఫ్రమ్ వాల్‌ను ఉపరితలం నుంచి ఐదు మీటర్ల లోతువరకు ఇరువైపులా బంకమట్టి కూర్చి పటిష్టం చేయాలి. తర్వాత డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని పరీక్షించి ప్రధాన డ్యామ్ పనులు ప్రారంభించాలి.

వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి..

గోదావరి వరదల ఉధృతి ప్రభావం వల్ల ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నాలుగు చోట్ల కోతకు గురై అగాధాలు ఏర్పడ్డాయి. వాటిని ఇసుకతో నింపి వైబ్రో కాంపాక్షన్ చేయడం ద్వారా యథాస్థితికి తేవాలి. వైబ్రో కాంపాక్షన్ చేసిన తర్వాత ఇసుక సాంద్రత 85 శాతం ఉండి తీరాలి. డీడీఆర్పీ సూచించిన మేరకు డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడం, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను పూడ్చి యథాస్థితికి తెచ్చే పనులకు సుమారు రూ.2,022 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. చంద్రబాబు కమీషన్ల కక్కుర్తికి పాల్పడకుండా ఉండి ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టు పనులు చేపట్టి ఉంటే ఈ దుస్థితి దాపురించేదికాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

జీవితం ఒక ప్రవాహం. ప్రవాహానికి అరుగుదల ఉండదు. మరమ్మతులు అవసరం లేదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, మార్చి, 29

ఈ మార్పు మంచికేనా?

ప్రజాందోళన పెరిగితే దాన్ని నీరుగార్చడానికైనా పాలకులు ఒక అడుగు వెనక్కి వేస్తారు. కనీసం వేసినట్టు కనిపిస్తారు. మూడు నెలలుగా సాగుతున్న ప్రజా ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చడంతో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతెన్యాహూ ఆ పనే చేశారు. ప్రభుత్వమే జవాబుదారీ అంటూ ఆ దేశ న్యాయమూర్తులకు ఇప్పటి దాకా అనేక అధికారాలున్నాయి. వాటిని నిర్వీర్యపరిచేలా న్యాయ వ్యవస్థలో మార్పులకు దిగిన ఆయన, చివరకు ప్రజాగ్రహంతో ఆగాల్సి వచ్చింది. రక్షణమంత్రిపై వేటు ప్రకటన గత వారాంతంలో కథలో ఈ కొత్తమలుపునకు దారి తీసింది. ప్రధాని చర్యలకు వ్యతిరేకంగా దేశంలోని అతి పెద్ద కార్మిక సంఘం సమ్మెకు దిగేసరికి, ఆస్పత్రులు, విద్యాలయాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విదేశాల్లో ఇజ్రాయెలీ దౌత్యకార్యాలయాలు – అన్నీ సోమవారం మూతబడ్డాయి. ఆర్థిక వ్యవస్థ స్తంభించడం, సొంత దేశాధ్యక్షుడితో పాటు అమెరికా సహా అంత ర్జాతీయ సమాజదృష్టి పడడంతో ఒత్తిడి పెరిగి నెతెన్యాహూ మనసు మార్చుకున్నట్టు కనిపించారు.

మిత్రదేశమైన అమెరికా సైతం నెతెన్యాహూకు సుద్దులు చెప్పాల్సి వచ్చింది. రక్షణమంత్రి ఉద్వాసన వార్తలందాక కలవరపడి, ప్రజాస్వామ్యానికి అప్రతిష్ఠ తీసుకురావద్దని ఇజ్రాయెల్‌ను పదే పదే హెచ్చరించింది. మార్పులకు విరామమిచ్చినట్టు నెతెన్యాహూ ప్రకటించగానే, ఆయనను అమెరికా అధ్యక్షుడితో భేటీకి ఆహ్వానిస్తున్నట్టు అమెరికన్ రాయబారి వెల్లడించడం గమనార్హం. ప్రధానిగా నెతెన్యాహూ పదవి చేపట్టి 3 నెలలు దాటినా, ఇంతవరకూ కలవని అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు హుటాహుటిన భేటీ జరపనుండడం ఆసక్తికర పరిణామమే. మధ్యప్రాచ్యంలో అమెరికాకు అనేక ప్రయోజనాలున్నాయి. వాషింగ్టన్, జెరూసలేమ్‌ల సైనిక భాగస్వామ్యంపైనే దాని దృష్టి.

నిజానికి మార్పుల్ని వ్యతిరేకించిన రక్షణమంత్రిని ఇంటికి పంపి, తన పంతం నెగ్గించుకోవచ్చని నెతెన్యాహూ తప్పుగా అంచనా వేశారు. ఇజ్రాయెలీ సైనికదళాలకు వెన్నెముక లాంటి సైనిక రిజర్విస్టులు సైతం విధులకు హాజరయ్యేందుకు నిరాకరించడంతో దేశ భద్రతకే ముప్పొచ్చింది. ఎగసిన వ్యతిరేకతకు తలొగ్గి, మార్పులకు సర్కార్ బ్రేకులు వేయాల్సి వచ్చింది. 73 ఏళ్ళ నెతన్యాహూ మాట నమ్మి, కార్మిక సంఘం సమ్మె విరమించింది. అలా మంగళవారం ఇజ్రాయెలీ వీధులు పైకి ప్రశాంతంగా కనిపించాయి. కానీ, సంక్షోభం పరిష్కారమైందనుకోలేం. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న నెతెన్యాహూ జడ్జీల ఎంపిక వ్యవస్థపై పట్టు బిగించే ప్రతిపాదిత బిల్లుకు పూర్తిగా స్వస్తి పలికారనుకోలేం. మిత జాతీయవాదులు, ఛాందసులు, అతి మితవాదుల కలగాపులగమైన సంకీర్ణ సర్కారు ఆ బిల్లు తుది రూపాన్ని మంగళవారం పరిశీలనకు చేపట్టడమే అందుకు ఉదాహరణ.

జనం ఎన్నుకొనని శిష్టవర్గీయుల చేతిలో, వామపక్షం వైపు మొగ్గే వ్యవస్థగా జ్యుడీషియరీ మారిందనేది ప్రభుత్వ ఆరోపణ. సుప్రీం కోర్ట్ నిర్ణయాల్ని సైతం సాధారణ మెజారిటీతో పార్లమెంట్ కొట్టిపారేసే వీలు కల్పించాలనీ, జడ్జీల నియామక సంఘంలో ప్రభుత్వ ప్రతినిధుల ప్రాతినిధ్యం పెంచాలనీ, న్యాయ సలహాదారుల సలహాను మంత్రులు శిరసావహించాలనే చట్టాన్ని ఎత్తేయాలనీ... ఇలా పలు మార్పులు చేద్దామని ప్రభుత్వ యోచన. కానీ, ఈ మార్పులు చివరకు న్యాయ వ్యవస్థను నీరుగార్చి, పాలకుల వైపే మొగ్గుతో ప్రజాస్వామ్యానికి హాని చేస్తాయని ప్రజలు, ప్రతిపక్షాల ఆందోళన. ప్రభుత్వం మాత్రం పాలకులకు మరింత జవాబుదారీగా ఉండేలా న్యాయ వ్యవస్థలో మార్పులు తేవాలనే తమ ప్రయత్నం అంటోంది. దాన్ని అడ్డుకోవడం అప్రజాస్వామికమని నెతెన్యాహూ బృందం వాదిస్తోంది. వెరసి, పార్లమెంట్ తదుపరి సమావేశాల్లో ఈ బిల్లు కథ మళ్ళీ పైకి రావచ్చు. ఈ 2 నెలల జాప్యంతో భారీ పౌర నిరసనపై నీళ్ళు జల్లి, ఏకాభిప్రాయం పేర ఏదో ఒక రూపంలో బిల్లుకు ముద్ర వేయాలనేది పాలకుల ప్రస్తుత వ్యూహం.

అబద్ధాలు చెప్పడం, తిమ్మిని బమ్మిని చేయడం నెతెన్యాహూ స్వభావం కాబట్టి, కుట్రలకు ఆయన తెర దించేవరకూ ప్రజా ఉద్యమంతో ఒత్తిడి పెట్టాల్సిందేనని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. తాజా పరిణామాలతో నెతెన్యాహూకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆయన రాజకీయ బుద్ధి సూక్ష్మతకూ, అవసరమైతే రాజీపడే నేర్పుకూ గట్టి దెబ్బే తగిలింది. పరస్పర విరుద్ధ ఎన్నికల హామీలిచ్చిన పార్టీల్ని సైతం కలుపుకొని, పంచకూట కషాయమైన సంకీర్ణ సర్కార్‌ను ఆయన ఏర్పాటుచేసి నిండా 4 నెలలైనా కాలేదు. న్యాయవ్యవస్థను తిరగదోడే పని ఆయన కొనసాగిస్తే ప్రజాగ్రహం తప్పదు. ఆపేస్తే సంకీర్ణంలో అతి మితవాద పక్షాలు వైదొలగుతాయి. ముందు నుయ్యి, వెనుక గొయ్యి. దీన్నెలా దాటతారన్న దాన్నిబట్టి ఆయన ఎంతకాలం పదవిలో ఉంటారో తేలుతుంది.

వరుస సంక్షోభాలతో, గత నాలుగేళ్ళలో 5 సార్లు ఎన్నికలతో ఇజ్రాయెల్ రాజకీయ అని శ్చితితో సతమతమవుతోంది. మళ్ళీ వెంటనే మరో ఎన్నికను భరించలేని ఇజ్రాయెల్‌కూ, అక్కడి ప్రజాస్వామ్యానికీ తాజా సంక్షోభం మరో అగ్నిపరీక్ష. కాకపోతే మూడు నెలలుగా లక్షలాది ప్రజలు వీధికెక్కి, తెలుపు – నీలం రంగుల జాతీయ పతకాన్ని చేబూని, నిరసన ప్రదర్శనలు చేస్తున్నా హింసాకాండ చెలరేగకపోవడం, చుక్క రక్తం చిందకపోవడం చెప్పుకోవాల్సిన విశేషం. జీవం తొణికిస లాడుతున్న ప్రజాస్వామ్యానికి సంకేతం. ఇప్పటికైతే ఇజ్రాయెల్ ప్రజలకు దక్కింది తాత్కాలిక విజయమే కావచ్చు. లక్షలాది జనం పార్లమెంట్ ముంగిట చేస్తున్న 'డెమోక్రాషియా' (ప్రజాస్వామ్యం) నినాదాలు, ప్రతిధ్వనిస్తున్న జెరూసలేమ్ వీధుల ప్రజాచేతన... ప్రపంచానికి ఆశాకిరణాలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.అష్టమి రా.10.08వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.9.11 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.11.41 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.20 నుండి 12.03 వరకు.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

మూల్యం కారకులదేనన్న ఊసెక్కడ?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

భోపాల్ గ్యాస్ దుర్ఘటన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ప్రవర్తించిన తీరు... నిర్లక్ష్యం, ఉదాసీనత, బాధితుల పట్ల పట్టింపులేనితనాలకు అద్దం పడుతోంది. నష్టపరిహారం కోసం కేంద్ర ప్రభుత్వం బాధితులకు ఏకైక ప్రతినిధిగా నిలబడటమే కాకుండా... ఒక కొత్త చట్టాన్ని అమల్లోకి తేవడం ద్వారా యూనియన్ కార్బైడ్ సంస్థతో రాజీపడిపోవడం కూడా ఒక తప్పిదమే. ఈ కేసు విషయమై మార్చి 14వ తేదీన సుప్రీంకోర్టు క్యూరేటివ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, సంక్షేమ రాజ్యంగా కేంద్ర ప్రభుత్వం బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహార మొత్తంలోని హెచ్చుతగ్గులను సరి చేయాలని చెప్పింది. అయితే ఇది కాలుష్య కారకులే పరిహారం చెల్లించాలన్న ప్రాథమిక సూత్రానికి విరుద్ధమైనది.

1984 నాటి భోపాల్ దుర్ఘటన విషయంలో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌ను ఈ నెల 14న సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో దశాబ్దాల న్యాయ పోరాటానికి తెరపడినట్లు అయ్యింది. ఆధునిక యుగంలో పర్యావరణానికి సంబంధించి ఓ కార్పొరేట్ సంస్థ తీవ్ర నేరానికి పాల్పడిన తొలి ఘటన ఇదే కావచ్చు.

1984 డిసెంబరు 2వ తేదీ రాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కీటకనాశిని కర్మాగారం నుంచి మిథైల్ ఐసోసైనైడ్ అనే విషపూరిత రసాయనం విడుదలైంది. కొన్నివేల మంది ఊపిరాడక చనిపోయారు. వేల మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషపూరిత రసాయన ప్రభావం కొన్ని తరాల పాటు కనిపించింది. ప్రమాదం తాలూకూ విష వ్యర్థాలను బహిరంగంగా పడేసిన కారణంగా అక్కడి నేల కూడా కలుషితమైంది. పౌరులకు జరిగిన ఈ నష్టానికి, నేరపూరిత నిర్లక్ష్యానికి కంపెనీ, దాంట్లోని అధికారులదే బాధ్యతని న్యాయ స్థానాల్లో కేసులు దాఖలయ్యాయి. జిల్లా కోర్టులో మొదలైన న్యాయ పోరాటం దశాబ్దాల కాలంలో సుప్రీంకోర్టును చేరింది. దేశ అత్యున్నత న్యాయ స్థానంలోనైనా తమకు న్యాయం దక్కుతుందని బాధితులు ఆశించారు. అయితే క్యూరేటివ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడం వారికి అశనిపాతంలా మారింది.

ప్రభుత్వాల నిర్లక్ష్యం

భోపాల్ గ్యాస్ దుర్ఘటన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ప్రవర్తించిన తీరు... నిర్లక్ష్యం, ఉదాసీనత, బాధితుల పట్ల పట్టింపులేనితనాలకు అద్దం పడుతోంది. నష్టపరిహారం కోసం కేంద్ర ప్రభుత్వం బాధితులకు ఏకైక ప్రతినిధిగా నిలబడటమే కాకుండా... ఒక కొత్త చట్టాన్ని (భోపాల్ గ్యాస్ లీక్ డిజాస్టర్ –ప్రాసెసింగ్ ఆఫ్ క్లెయిమ్స్– యాక్ట్ 1985) అమల్లోకి తేవడం ద్వారా యూనియన్ కార్బైడ్ సంస్థతో రాజీపడిపోయింది. ఇది ఓ మహా తప్పిదం. నష్టపరిహారం కోరుతూ ప్రభుత్వం 1988లో కేసు దాఖలు చేసింది. కొంత పరిహారం ప్రకటించారు కూడా. అయితే దీన్ని అందరూ ఊహించినట్టుగానే యూనియన్ కార్బైడ్ ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేసింది.

భారత్‌లో కేసులు ఉన్నాయనీ, తాము న్యాయ స్థానాన్ని ఎదుర్కొంటున్నా మనీ యూనియన్ కార్బైడ్ అమెరికాలో లిటిగేషన్ల ముప్పును తప్పించుకుంది. యూనియన్ కార్బైడ్ జరిపిన లాబీయింగ్... సుప్రీంకోర్టు సున్నిత ప్రోత్సాహం... వెరసి కేంద్ర ప్రభుత్వం మరో ఘోర తప్పిదం చేయడానికి కారణం అయ్యాయి. యూనియన్ కార్బైడ్ కేవలం రూ.715 కోట్లు చెల్లిస్తే అన్ని రకాల సివిల్, క్రిమినల్ కేసులు మూసివేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

పాత పరిహారమే అంతిమం!

అయితే బాధితులు మరోసారి సుప్రీంకోర్టు తలుపుతట్టి ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని కోరడం వల్ల కంపెనీ చెల్లిస్తానన్న పరిహారం చాలా తక్కువనీ, నేరం బాధ్యత కూడా తగినంతగా కంపెనీపై మోపలేదనీ స్పష్టమైంది. కంపెనీ అధికారులపై 2010లో భోపాల్ జిల్లా కోర్టులో క్రిమినల్ కేసులు దాఖ లయ్యాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రోజు వారీ కార్యకలాపాలు పర్యవేక్షించే అధి కారులకు శిక్ష కూడా పడింది. దీని పర్యవసానంగా గ్యాస్ దుర్ఘటనపై ప్రజల దృష్టి కేంద్రీకృతమైంది. ఇది కాస్తా తీవ్ర ఆందోళనకూ దారితీసింది. ఈ ఒత్తిడికి తలొగ్గిన కేంద్రం నష్ట పరిహారం మొత్తాన్ని పెంచేందుకు మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సుప్రీంకోర్టులో గత తీర్పు సమీక్ష కోరుతూ కేసు దాఖలు చేయగా... అత్యున్నత న్యాయస్థానం దాన్ని కొట్టేసింది. పదమూడేళ్లపాటు సాగిన ఈ కేసు తాజా పరిణామం ఇది. సుప్రీంకోర్టు తాజా తీర్పులో– కంపెనీ, ప్రభుత్వాల మధ్య 1989లో కుదిరిన రాజీ ఒప్పందం ప్రకారం చెల్లించిన నష్టపరిహారమే ఫైనల్ అని తేల్చేసింది. అదనపు నష్టపరిహారం కోరేందుకు తగిన న్యాయ సూత్రం ప్రాతిపదిక లేదని స్పష్టం చేసింది.



రాజీ ఒప్పందం వెనుక లాలూచీ?

కేంద్రం, యూనియన్ కార్బైడ్‌ల మధ్య కుదిరిన రాజీ ఒప్పందం వెనుక ఎన్నో లాలూచీ వ్యవహారాలు నడిచాయని బాధితుల తరఫున క్యూరేటివ్ పిటిషన్ విచారణలో భాగమైన సంస్థలు ఆరోపిస్తున్నాయి. సమాచార హక్కు చట్టం కింద భారత్‌లో, అమెరికాలో సేకరించిన సమాచారం, పత్రాల ఆధారంగా వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ పత్రాలను కోర్టుకు అందజేశారు. యూనియన్ కార్బైడ్ అధికారులు ప్రభుత్వాన్ని ఎలా తప్పుదోవ పట్టించింది ఈ పత్రాల ద్వారా వివరించారు. దుర్ఘటనలో బతికి బయటపడ్డ వారు ఎదుర్కొన్న గాయాలు స్వల్పమని కంపెనీ కేంద్ర ప్రభుత్వానికి నచ్చజెప్పిందన్నది వీరి ఆరోపణ.

అయితే కోర్టు ఈ సాక్ష్యాలను తోసిపుచ్చింది. 1989 నాటి కోర్టు తీర్పును సమర్థించింది. అంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం తన క్యూరేటివ్ పిటిషన్‌లో మోసం జరిగిందని ఏమీ చెప్పలేదని తెలిపింది. దురదృష్టవశాత్తూ కోర్టు ఈ క్యూరేటివ్ పిటిషన్‌ను కేవలం కేంద్రం, యూనియన్ కార్బైడ్ కంపెనీల మధ్య వివాదంలా మాత్రమే చూసింది. బాధితుల పక్షాన నిలిచిన సంస్థలను థర్డ్ పార్టీ (మూడో పక్షం)గా అభివర్ణించింది. కేంద్రం భుజాలపై స్వారీ చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించింది.

కేంద్ర ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా యూనియన్ కార్బైడ్ దేశంలో అసలు విచారణకే గురి కాలేదు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రమాద బాధితులకు తగిన పరిహారం లభించకపోవడం శోచనీయం. దుర్ఘటన ప్రభావాలపై కొత్త కొత్త వివరాలు వెలుగులోకి వచ్చినా కోర్టు 1989 నాటి తీర్పే అంతిమం అని తేల్చేసింది. అప్పట్లో నిర్ణయించిన పరిహారం సాధారణ అంచనా అని మాత్రం కోర్టు ఒప్పుకొంది. మరణాలకు రూ. 3 వేలు, 'దుస్సహమైన తీవ్ర గాయాలకు' రూ. 30 వేలుగా అప్పుడు నిర్ణయించారు.

కంపెనీకి తగిన పరిహారం చెల్లించాలి

2010లో దాఖలైన క్యూరేటివ్ పిటిషన్ అటు కేంద్రానికీ, ఇటు సుప్రీంకోర్టుకూ 1989 నాటి తప్పులను దిద్దుకునేందుకు ఒక అవకాశం కల్పించింది. కాలుష్యానికి కారణమైన వారే నష్ట పరిహారాన్ని, పరిస్థితిని చక్కదిద్దేందుకు అయిన ఖర్చులను భరించాలని అప్పటి నుంచి ఇప్పటివరకూ నడిచిన కాలంలో ఎన్నో తీర్పులు వచ్చాయి. 1985 నాటి ఓలియమ్ గ్యాస్ లీక్ కేసులో కోర్టు వ్యాఖ్యానిస్తూ... ''కంపెనీ ఎంత పెద్దది, సమృద్ధమైనది అయితే అది చేసిన నష్టానికి చెల్లించాల్సిన పరిహారం కూడా అంతే ఎక్కువ మొత్తంలో ఉండాలి. ప్రమాదకరమైన, ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఎక్కువగా ఉన్న పరిశ్రమలు, కంపెనీలకు కూడా ఇది వర్తిస్తుంది'' అని స్పష్టం చేసిన విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

మార్చి 14వ తేదీ సుప్రీంకోర్టు క్యూరేటివ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, సంక్షేమ రాజ్యంగా కేంద్ర ప్రభుత్వం బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహార మొత్తంలోని హెచ్చుతగ్గులను సరి చేయాలని చెప్పింది. అయితే ఇది కాలుష్య కారకులే పరిహారం చెల్లించాలన్న ప్రాథమిక సూత్రానికి విరుద్ధమైనది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అక్షర కిరణాలు



నా కుమారుడు తన స్నేహితులకు బహుమతిగా పుస్తకాలను ఇచ్చాడు. తిరుగు బహుమతిగా పుస్తకాలను పొందాడు! తర్వాతి తరం పఠనాసక్తికి వీళ్లు ఆశాకిరణం అవుతారు.

– మురళీ నరసింహన్, మలయాళీ వ్యాఖ్యాత

పిల్లి జపం



భూమి మీద 30 కంటే ఎక్కువగా పిల్లి జాతులు ఉన్నాయి. అవి నిద్రించి లేచిన తర్వాత కాళ్లనూ, శరీరాన్నీ బాగా సాగదీస్తాయి. చూడ్డానికి ఆ సాగతీత ఎలా ఉంటుందంటే, సూర్య నమస్కారం చేస్తున్నట్టుగా! – అద్వైత్, చరిత్రకారుడు

ఇండస్ట్రీ ఉండనివ్వదు



చివరికి ప్రియాంకా చోప్రా కూడా ఒక్క మాట కొత్తది లేకుండా అందరికీ తెలిసిన విషయమే చెప్పారు (బాలీవుడ్‌లోని రాజకీయాల కారణంగానే తనకు అవకాశాలు రావడం లేదన్నారు). అయినప్పటికీ పర్వీన్ బాబీలా, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌లా మిగిలిపోకుండా ఉండటమే బాలీవుడ్‌లో ఆమె సాధించిన ఘన విజయం. – అపూర్వ, స్క్రీన్ రైటర్

పైసా వసూల్



రుణాల ఎగవేతదారులను బ్యాంకులు వేగంగా వెంబడించడంతో బ్యాంకింగ్ మోసాలు ఏటికేడాదిగా 50 శాతం వరకు తగ్గాయి! నిజమైన కారణాలతో అప్పు తీర్చలేనివారికి, మోసం చేయడం కోసమే అప్పు తీసుకునేవారికి మధ్య తేడాను దయచేసి గమనించండి.

– రిషి బాగ్రీ, పన్ను చెల్లింపుదారు

తిరుగుతూనే ఉంది



ఆధార్‌తో పాన్ కార్డును లింక్ చెయ్యడానికి గడువు పెంచడం బాగుంది. అయితే పని చేయని సర్వర్ల కారణంగా గడువు లోపల అవి రెండూ లింక్ కానప్పుడు పెనాల్టీ విధించడం అన్యాయం. నేను మార్చి 27న లింక్ కోసం రిక్వెస్ట్ పెట్టాను. ఇప్పటికీ నా పాన్, ఆధార్ లింక్ కాలేదు!

– మనోజ్ కుమార్ సైనీ, అడ్వొకేట్

గన్ కంట్రోల్



26 ఏళ్ల క్రితం స్కాట్లాండ్‌లోని డన్‌బ్లేన్ ప్రాథమిక పాఠశాలలోకి ఒక సాయుధుడు చొరబడి 16 మంది పిల్లలను, ఒక టీచర్‌ను కాల్చి చంపాడు. ఆ ఘటనతో యు.కె. ప్రభుత్వం గట్టి 'గన్ కంట్రోల్' చట్టాన్ని తెచ్చింది. నాటి నుంచి ఈ 9,400 + రోజుల్లో ఒకే ఒకసారి మాత్రమే స్కాట్లాండ్ పాఠశాలలో కాల్పులు జరిగాయి.

– పీటర్ ఫ్రాంప్టన్, ధ్వని నిపుణుడు

నూటికి ఒకటి!



2006లో బీఎస్పీ ఎమ్మెల్యే రాజ్‌పాల్ హత్య కేసులో సాక్షి అయిన ఉమేశ్‌పాల్‌ను అపహరించిన రాజకీయ నేత అతీక్ అహ్మద్ సహా ముగ్గురు నిందితులకు ఉత్తరప్రదేశ్ కోర్టు జీవిత ఖైదు విధించింది. ఎస్పీ, అప్నాదళ్‌ల మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే అయిన అతీక్‌పై వందకు పైగా క్రిమినల్ కేసులు ఉండగా, గత పదిహేడేళ్లలో అతడికి శిక్ష పడిన కేసు ఈ ఒక్కటి మాత్రమే.

– రాహుల్ శివశంకర్, సంపాదకుడు

ఇన్‌బాక్స్

గౌరునాయుడుకు తగిన పురస్కారం

''నేనున్న నేల నుండి నేల కోసం పోరాటాలు, నా చుట్టూర ఉన్న రైతుల దుఃస్థితి– యివన్నీ నన్ను కథా రచనను ఒక అవసరంగా భావించేలా చేశాయి. నా కథలన్నింటికి కేంద్రం నా ఊరే. నా ఊరి మనుషులే నా కథల్లోని పాత్రలు'' అంటారు గంటేడ గౌరునాయుడు. ఉత్తరాంధ్ర ప్రజల భాషను, యాసను పట్టుకొని ఆయన రచనలు సాగించారు. ప్రజలు వలసలు వెళ్ళడం, నిర్వాసితుల వెతలు, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం తన కథల్లో చిత్రించారు. ''ఆకలి వలన కలిగే అనుభవం కొత్తకాదు కానీ దాన్ని సాహిత్యానుభవంగా మార్చడం వలన ఆ రచన సామాజికుని మీద ఎంతటి ప్రభావాన్ని కలిగిస్తోందో గౌరునాయుడు కథలు రుజువు చేస్తున్నాయి'' అంటారు కిన్నెర శ్రీదేవి విమర్శకురాలు.



గంటేడ గౌరునాయుడు

మన్యం ప్రాంతమైన కురుపాంకు దగ్గరలోని దలాయి పేటలో రైతు కుటుంబంలో పుట్టిన గౌరునాయుడు, వ్యవసాయ పనులు చేస్తూనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి బాధ్యత గల ఉపాధ్యాయుడిగా పేరుపొందారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15న జెండా వందనానికి పిల్లలకు ఓ పాట రాసిచ్చి, బాణీ కట్టి పాడించడం అలవాటు చేసుకున్న గౌరునాయుడు గేయ రచయిత కూడా అయ్యారు. ''పాడుదమా స్వేచ్ఛా గీతం'' గేయం ఎంతలా ప్రసిద్ధి చెందిందో తెలిసిందే. ఇటీవలే ఈ గీతాన్ని 10,000 మంది పిల్లలు ఒక్కసారిగా ఆలపించి రికార్డు దక్కించుకున్నారు. ''ఇది నా వూరేనా, ఇది నే నడిచిన దారేనా'' అంటూ మారిపోతున్న పల్లె ముఖచిత్రాన్ని ఎంతో ఖేదంతో మరో గేయ రూపంలో అందించారు. తండ్రి అవసానదశలో సపర్యలు చేస్తూ తాత్వికతకు లోనయ్యారో ఏమో, భగవద్గీతను వచన కవితా రూపంలో రచించారు. మహాభారతాన్ని కూడా సరళమైన భాషలో రచించారు.

పతంజలి సాంస్కృతిక వేదిక, విజయనగరం వారు పతంజలి పేరిట ఇస్తున్న సాహిత్య పురస్కారాన్ని గౌరునాయుడు నేడు అందుకుంటున్న సందర్భంగా అభినందనలు.

– ఎస్.కె. బాబు, విజయనగరం

పాలనకు ఒక కొత్త నమూనా!

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

ప్రభుత్వ పాలనా వ్యవస్థ ఒక 'పిరమిడ్' వలె పైన ముఖ్యమంత్రి ఉంటే, దిగువన మంత్రిమండలి, దాని కింద శాసన సభ్యులు, ఆ తర్వాత జిల్లాల్లోని స్థానిక సంస్థల ప్రతినిధులు ఉంటారు. దీనికి సమాంతరంగా 'ఎగ్జిక్యూటివ్' అనబడే అధికా రులు, ఉద్యోగుల వ్యవస్థ ఉంటుంది.

అయితే మునుపటికి భిన్నంగా, దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారి ఏపీలో పిరమిడ్ స్థానాన్ని 'చతురస్రం' నమూనా పాలనతో భర్తీ చేయడం మొదలయింది. ఇది కొత్త ప్రయోగం కావడంతో దీన్ని 'గ్రీన్ ఫీల్డ్ పాలిటిక్స్' ప్రభుత్వం అనొచ్చు. ఇది ఎలా పనిచేస్తున్నది అంటే, తన 'పబ్లిక్ పాలసీ'లో భాగంగా కొన్ని ప్రాధాన్యతా రంగాలను ఎంచుకుని, క్షేత్రస్థాయిలో దాని అమలుకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంటుంది. పైనుండి ఆదేశాలు దిగువకు వెళుతుంటే, దిగువ నుంచి సాధించిన లక్ష్యాల 'డేటా' పైకి పంపే 'టూ–వే' సమాచార వ్యవస్థ ఉంటుంది. జాప్యం లేకుండా సమాచారం అందేలా 'నెట్ వర్క్' కోసం 'టెక్నాలజీ', ఆఫీసులు, సిబ్బంది ముందే ఏర్పాటు అవుతాయి. ఇవన్నీ సరే, మరి ప్రాధాన్యతా రంగం ఎంచుకోవడం ఎలా?

యూఎన్ఓ ఉపాంగం అయిన– 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' తన 177 సభ్య దేశాలు 2030 నాటికి చేరుకోవాలని నిర్దేశించిన 17 'సస్టెయినబుల్ డెవలప్మెంట్ గోల్స్' నుంచి స్థానిక అవసరాల ప్రాతిపదికగా వీటిని ఎంచుకుంటారు. ఏపీలో తొలి ప్రాధాన్యతగా విద్య, వైద్యం, వ్యవసాయ అనుబంధ రంగాలను ఈ ప్రభుత్వం ఎంచుకుంది. ఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ ఆయా రాష్ట్రాలు సాధించిన లక్ష్యాల ప్రాతిపదికగా ర్యాంకులు వెల్లడిస్తున్నది. వీటి అమలుకు 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' అనుసరిస్తారు. సరిగ్గా ఇక్కడే – 'మాకు కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు, మాకు ఓటు



వేసారా లేదా? కూడా చూడకుండా అర్హులైన అందరికీ...' అంటూ సీఎం జగన్ చెప్పే జనరంజకమైన వాగ్దానం 'కనెక్ట్' అవుతుంది ఇంతకుముందు ఇలా ఎందుకు జరగలేదు అంటే, అది ఎన్నికయిన ప్రభుత్వ నేతకు ఉండే విచక్షణ. దేశంలో ఎన్ని రాష్ట్రాలు ఇలా పని చేస్తున్నాయి అన్నప్పుడు, బయట రాష్ట్రాల అధికారుల బృందాలు తరచూ ఇక్కడికి క్షేత్రపర్యటనలకు రావడమే అందుకు జవాబు.

ఇలా ఈ ప్రభుత్వంలో పిరమిడ్ స్థానంలోకి కొత్తగా చతురస్రం నమూనా పాలన వచ్చాక, పై నుంచి కిందివరకు ఏకరీతిగా ఒక 'సాలిడ్ సిస్టం' ఏర్పడి పని చేస్తున్నది. అర్హతలు పరిశీలించి ఒకసారి లబ్ధి దారుడి పేరు ఖరారు అయ్యాక, 'డి.బి.టి.' ద్వారా ప్రభుత్వం అందించే ప్రయోజనం నేరుగా వాళ్ళ బ్యాంకు ఖాతాల్లోకి చేరుతున్నది. గతంలో మాదిరిగా హౌసింగ్ అధికారులు లబ్ధిదారుడితో– 'మీ ఎమ్మెల్యే గారు సిఫార్సు చేసిన లిస్టులో నీ పేరు లేదు' అనడానికి ఆస్కారం లేదు. ఊళ్ళో రాజకీయాలతో ఒకవేళ తొలుత ఆపినా, ఆప డానికి కారణాలు ఏమిటో అదే ఊళ్ళో వున్న సచివాలయం సిబ్బంది ఫిర్యాదుదారుకు చెప్పాల్సి వస్తున్నది. గ్రీన్‌ఫీల్డ్ పాలిటిక్స్ అమల్లోకి తెచ్చిన ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యేల 'ప్రివిలేజ్' సాగక, తొలి ఉక్కపోతలు నెల్లూరు నుంచి రికార్డు అయ్యాయి.

నెల్లూరు జిల్లా గూడూరు శాసన సభ్యుడు వెలగపల్లి వరప్రసాదరావు 'పార్టీ ఎమ్మెల్యేగా కంటే, ఒక పౌరుడిగా జగన్‌ను ఇష్ట పడుతున్నాను' అన్నారు. ఈయన మాజీ ఐఏఎస్ అధికారి కావడంతో వీరి పరిశీలనను ప్రత్యేకంగా చూడాలి. ఈ ఎస్సీ ఎమ్మెల్యే ఒక పౌరుడిగా తన పరిశీలనను దాచుకోలేక, ఉన్నది ఉన్నట్టుగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పైకి అనేశారు. ఒక ఎమ్మెల్యేకు తమ లెజిస్లేటివ్ పార్టీ నాయకుడి పట్ల ఉండేది విశ్వాసం, కానీ ఒక పౌరుడికి కాలక్రమంలో కలిగేది – ప్రేమ. దాన్ని ఐదేళ్లకు పరిమితం చేయలేము!

వ్యాసకర్త అభివృద్ధి, సామాజిక అంశాల వ్యాఖ్యాత

రామం భజే శ్యామలం

ధర్మ సంస్థాపన కోసం, దశకంఠుడి వధ కోసం శ్రీహరి ఏడవ అవతారంగా శ్రీరాముడుద్భవించిన తిథి చైత్ర శుద్ధ నవమి. ఆస్తికులకు శ్రీరాముడు మిగతా అవతారాల కన్నా మిన్న. కారణం ఆయన మనిషిగానే అవతరించినా, దేవుడి లాంటి మనిషిలా జీవించాడు. మనిషి అనుసరించదగిన ఉన్నతాదర్శాలన్నిటి సమ్మేళనం ఆయన. ఎన్నో లోకోత్తరమైన ఘనకార్యాలు సాధించినా, 'నన్ను నేను మనిషిగానే భావిస్తున్నాను' అని ప్రకటించి, మానవ జాతికి 'రామాదివ వర్తితవ్యం' (రాముడిలా ప్రవర్తించాలి) అన్న ఒజ్జ బంతి ఏర్పరిచాడు.

'నీ మేను, నామ వైభవమ్ములను, నీ పరాక్రమ ధైర్యముల, శాంత మానసము, ఈవులను, వచన సత్యముల, నీ ఎడ సద్భక్తియు జనింపగను... నీ గుణ భజనానంద కీర్తనము చేసేవారు ఎందరో మహానుభావులు' అన్నారు త్యాగరాజస్వామి. శ్రీరాముడి మేను 'పుంసాం మోహన రూపం'– పురుషులనే మోహింపజేసేది. ఆయన నామ వైభవమో? రామ మహిమ కంటే రామనామ మహిమ గొప్పదని, ఆ రుచి బాగా తెలిసినవారందరూ– హనుమంతుడు, వాల్మీకి నుంచి, కబీరు, రామదాసు దాకా – చెప్తూ వచ్చిన మాట. ఆయన పరాక్రమమా? అది తాటకకూ, మారీచ సుబాహులకూ, దండకలో ఆయన ఒక్కడి మీద మూకుమ్మడిగా దండెత్తి వచ్చిన ఖర దూషణాది పధ్నాలుగు వేల మంది రాక్షసులకూ, ఆ పిమ్మట రావణ కుంభకర్ణాదులకూ బాగా తెలుసు. కేవలం కోతులను మాత్రం తోడు చేసుకొని, సముద్రం ఆవల సురక్షితంగా ఉన్న లంకలో రాక్షసేశ్వరుడిని ముట్టడించేటంత ధైర్యం ఆయన సొత్తు. అంత పరాక్రమ శాలి అయినా, ఆయనది క్రోధమూ, క్రౌర్యమూ ఎరగని శాంత మానసం. ఈవిలో – అంటే దాతృత్వంలో – ఆశ్రితామిత కామిత ప్రదుడైన సాకేత రాముడికి సరి ఎవ్వరు? 'వచన సత్యం' సరేసరి. ఒక మాటా, ఒక బాణం, ఒక పత్ని ఆయనకు, శరణాగత రక్షణ లాగా వ్రతం.



జ్యోతిర్మయం

జన్మ దినోత్సవ సందర్భంగా రామయ్య తండ్రికీ, కల్యాణోత్సవ సందర్భంగా సీతమ్మ తల్లికీ శతకోటి వందనాలు! సాధుజనావన వ్రతో/ద్దాముడు, రాముడే పరమ దైవము మాకని నీ అడుంగు కెం/దామరలే భజించెదను దాశరథీ, కరుణాపయోనిధీ!

– ఎం. మారుతి శాస్త్రి
(రేపు శ్రీరామనవమి)

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో హైకోర్టు సీజే



సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మంగళవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం సీజే దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. చైర్మన్, ఈవో ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు నంబూరి రవి పాల్గొన్నారు.

నేటి నుంచి కువైట్‌కు విమాన సర్వీస్‌లు

- ప్రతి బుధవారం విజయవాడ నుంచి కువైట్‌కు ఎయిర్ ఇండియా సర్వీస్

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం ఎయిర్ పోర్ట్) నుంచి మరో ఇంటర్నేషనల్ విమాన సర్వీస్ ప్రారంభంకానుంది. ఇప్పటికే షార్జాకు వారానికి రెండు విమాన సర్వీస్‌లు నడుపుతున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ బుధవారం నుంచి కువైట్‌కు సర్వీస్‌ను ప్రారంభించనుంది. మొత్తం 186 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన బోయింగ్ 737–800 విమానం ప్రతి బుధవారం ఉదయం 9.55 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి కువైట్‌కు మధ్యాహ్నం 12.10 (భారత కాలమానం ప్రకారం 2.40)కు చేరుకుంటుంది. తిరిగి కువైట్ నుంచి 1.10 (భారత కాలమానం ప్రకారం 3.40)కు బయలుదేరి రాత్రి 8.35 గంటలకు ఇక్కడికి చేరుకుంటుంది. ఇప్పటి వరకు కువైట్‌కు రాకపోకలు సాగించేందుకు ఆంధ్రా ప్రాంత ప్రయాణికులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విమానాశ్రయాలను ఆశ్రయించేవారు. ఇప్పుడు కువైట్‌కు డైరెక్ట్ విమాన సర్వీస్ నడపడం వల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని ఎయిర్‌పోర్ట్ అధికారులు చెబుతున్నారు.

మచిలీపట్నం-కర్నూలు సిటీ ప్రత్యేక రైలు ఏర్పాటు

లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా మచిలీపట్నం–కర్నూలు సిటీ మధ్య దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను కేటాయించిందని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. 07067 నంబర్ రైలు మచిలీపట్నం–కర్నూలు సిటీ రైలు అని, ఇది ఏప్రిల్ 1 నుంచి 29వ తేదీ వరకు శని,మంగళ, గురువారాల్లో నడుస్తుందని చెప్పారు. ఈ రైలు మచిలీపట్నం నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి కర్నూలు సిటీకి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే 07068 నంబర్ రైలు కర్నూలు సిటీ – మచిలీపట్నం రైలు అని, ఇది ఏప్రిల్ 2 నుంచి 30వ తేదీ వరకు ఆది, బుధ, శుక్రవారాల్లో నడుస్తుందని తెలిపారు. ఈ రైలు కర్నూలు సిటీ నుంచి రాత్రి 8 గంటలకు బయల్దేరి మచిలీపట్నానికి ఉదయం 7.05 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ రైళ్లు గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల, డోన్‌ల మీదుగా ప్రయాణిస్తాయని వెల్లడించారు.

టీటీడీ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య..పునరుద్ధరణ

తిరుమల: శ్రీవారి వర్చువల్ సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో మంగళవారం టీటీడీ విడుదల చేయగా కొద్దిసేపు సాంకేతిక సమస్య ఏర్పడి వెబ్‌సైట్ స్తంభించింది. ఏప్రిల్‌కి సంబంధించి ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, కల్యాణోత్సవం వర్చువల్ సేవా టికెట్లను టీటీడీ ఉదయం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వేసవి సెలవుల నేపథ్యంలో భక్తులు భారీగా వర్చువల్ సేవలు, అనుబంధంగా దర్శన టికెట్లను బుక్ చేసుకునేందుకు వెబ్‌సైట్‌లోకి ప్రవేశించడంతో సైట్ 20 నిమిషాల పాటు స్తంభించింది. అనంతరం టీటీడీ ఈడీపీ సాంకేతిక విభాగం స్పందించి సైట్‌ను పునరుద్ధరించినట్లు టీటీడీ ఈడీపీ జీఎం సందీప్ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,886 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.56 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. కాగా, ఏప్రిల్‌లో తిరుమలలో జరిగే విశేష ఉత్సవాలను టీటీడీ పీఆర్వో విభాగం మంగళవారం వెల్లడించింది. 1న 15వ విడత బాలకాండ అఖండ పారాయణం, సర్వ ఏకాదశి, 3 నుంచి 5 వరకు శ్రీవారి వసంతోత్సవాలు, 6న తుంబురుతీర్థ ముక్కోటి, పౌర్ణమి గరుడసేవ, 16న శ్రీ భాష్యకారుల ఉత్సవారంభం, 23న అక్షయ తృతీయ, 25న శ్రీ భాష్యకారుల శాత్తుమొర, శ్రీ రామానుజ జయంతి, శంకర జయంతి, శ్రీ అనంతాళ్వారు ఉత్సవారంభం, 29 నుంచి మే 1 వరకు శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు జరగనున్నాయని పేర్కొంది.

గత ప్రభుత్వం పేదలను గాలికొదిలేసింది

అందుకే వారికి రాజధానిలో సెంటు భూమి కూడా కేటాయించలేదు

- పేదల నివాసాలకు ఐదు శాతం భూమి కేటాయించాలని చట్టం చెబుతోంది
- కానీ, మాస్టర్ ప్లాన్‌లో మాత్రం ఎలాంటి భూమి కేటాయించలేదు
- ఆ తప్పును సరిచేసేందుకే ఇప్పుడు ఆర్ 5 జోన్‌ను ఏర్పాటుచేశాం
- తమ పక్కన పేదలు, అణగారిన వర్గాలు ఉండకూడదని రాజధాని రైతులు అంటున్నారు
- అందుకే ఆర్ 5 జోన్‌ను వ్యతిరేకిస్తున్నారు.. హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- వ్యాజ్యాన్ని త్రిసభ్య ధర్మాసనానికి నివేదించిన న్యాయమూర్తి
- తగిన ఉత్తర్వుల కోసం ఫైల్‌ను సీజే ముందుంచాలని రిజిస్ట్రీకి ఆదేశం



సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలోని మొత్తం విస్తీర్ణంలో ఐదు శాతం భూమిని పేదల నివాసాల నిమిత్తం కేటాయించాలని సీఆర్‌డీఏ చట్టం స్పష్టంగా చెబుతోందని, అయితే గత ప్రభుత్వం మాత్రం పేదలను గాలికొదిలేసిందని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. పేదల కోసం రాజధాని ప్రాంతంలో సెంటు భూమి కూడా కేటాయించలేదని, ఆ తప్పును తాము ఇప్పుడు సరిచేసి, చట్టానికి అనుగుణంగా 5 శాతం భూమిని పేదల నివాసకల్పన కోసం కేటాయించామని చెప్పారు. చట్ట ప్రకారం వ్యవహరించడం కూడా తప్పు అంటూ పిటిషన్ దాఖలు చేశారని ఆయన వివరించారు. పేదలులేని ప్రపంచస్థాయి రాజధాని కావాలని రాజధాని రైతులు కోరుకుంటున్నారని, తాము మాత్రం పేదలు సైతం రాజధానిలో ఇళ్లు కట్టుకుని ఉండాలని కోరుకుంటున్నామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగానే పేదల కోసం ఆర్ 5 జోన్‌ను ఏర్పాటుచేసి, వందల ఎకరాలు భూమిని కేటాయించామన్నారు. రాజధాని రైతుల వాదనను పరిగణనలోకి తీసుకోవద్దని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ అంటరానితనం ఆలోచనలు ఉండటం దురదృష్టకరమని సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్–57 ప్రకారం పూలింగ్ ద్వారా సమీకరించిన భూమిపై సర్వహక్కులు సీఆర్‌డీఏకే ఉంటాయన్నారు. ఆ భూమి సీఆర్‌డీఏ ఆస్తి అవుతుందే తప్ప, రైతులది కాదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, ఇప్పటికే ఇదే అంశంపై దాఖలైన వ్యాజ్యాలపై సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరుపుతోందని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పడంతో ఈ వ్యాజ్యాన్ని సైతం త్రిసభ్య ధర్మాసనానికి నివేదిస్తున్నట్లు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వుల నిమిత్తం ఈ వ్యాజ్యాన్ని ఆయన ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఇళ్లు కావాలని ఎవరూ అడగలేదు..

రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా ఆర్ 5 జోన్‌ను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ గుంటూరు జిల్లా, కృష్ణాయపాళెం గ్రామానికి చెందిన రైతు అవల నందకిషోర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జస్టిస్ కృష్ణమోహన్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ వాదనలు వినిపిస్తూ, రాజధాని ప్రాంతంలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రజలెవ్వరూ కోరలేదన్నారు. గ్రామసభల్లో రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

పేదల సంక్షేమానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చట్ట ప్రకారం చేయాల్సిన పనిని గత ప్రభుత్వం విస్మరించిందని, ఆ తప్పును సరిదిద్ది మాస్టర్ ప్లాన్‌కు ఓ విలువను తీసుకొచ్చామని, దాన్ని కూడా పిటిషనర్ తప్పుపడుతున్నారని తెలిపారు. పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రాజధాని ప్రాంతంలో 900 ఎకరాలను పేదల కోసం కేటాయించామని చెప్పారు. ప్రజలు తమకు ఫలానాది కావాలని అడిగేంత వరకు ప్రభుత్వాలు ఎదురుచూడవని.. వారి అవసరాలను గుర్తించడమే ప్రభుత్వ విధి అన్నారు.

ఇదే అంశంపై త్రిసభ్య ధర్మాసనం విచారణ జరుపుతోంది..

వాదనలు విన్న న్యాయమూర్తి, ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని, తరువాత పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామన్నారు. ఈ సమయంలో ఇంద్రనీల్.. ఇదే అంశంపై దాఖలైన వ్యాజ్యాలపై సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరుపుతోందని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. తమకు ఏ ధర్మాసనమైనా ఒక్కటేనని, తాము చట్ట ప్రకారమే ఆర్ 5 జోన్‌ను ఏర్పాటుచేశామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ వ్యాజ్యాన్ని త్రిసభ్య ధర్మాసనానికి నివేదించారు. దీనిపై తగిన ఉత్తర్వులు జారీచేసేందుకు ఈ వ్యాజ్యాన్ని సీజే ముందుంచాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.

ముగ్గురిని 'బలి' తీసుకున్న కోనేరు

- కాటేరమ్మను మొక్కడానికి వచ్చి కానరాని లోకాలకు..
- చిత్తూరు జిల్లాలో దుర్ఘటన

బైరెడ్డిపల్లె(చిత్తూరు జిల్లా): ఓ దేవర మొక్కు తీర్చుకునేందుకు కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన ఓ ముగ్గురు బాలికలు సరదాగా ఈతకోసం సమీపంలోని కోనేటిలో దిగి మృత్యువాత పడిన ఘటన చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దేవదొడ్డి గ్రామానికి చెందిన కదిరప్ప కుటుంబీకులు బంధువులతో కలిసి బైరెడ్డిపల్లె మండలంలోని తీర్థం సమీపంలో ఉన్న కోట్రేపల్లె శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న కొండపై కాటేరమ్మ దేవరను నిర్వహించారు. దీంతో తమిళనాడు రాష్ట్రం అరట్ల నుంచి బంధువులు కాటేరమ్మ దేవరకు హాజరై పూజల్లో పాల్గొన్నారు. కదిరప్ప కుమార్తె గౌతమి (14)తో పాటు అరట్ల గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తె భవ్య (17), వెంకటరమణ కుమార్తె మౌనిక (13) కొండ సమీపంలో ఉన్న కోనేటిలో ఈతకెళ్లారు. కోనేటిలోని నీటిలో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగిపోయారు. కొండపై పూజల్లో నిమగ్నమైన కదిరప్ప, బంధువులు బాలికల కేకలు విని ఘటనా స్థలం వద్దకు పరుగులు తీశారు. అప్పటికే కోనేటిలో గౌతమి, భవ్య, మౌనిక విగతజీవులయి కనిపించారు. వీరి మృతదేహాలను అరట్లకు తీసుకెళ్లారు.

మహిళ పొట్టలో రెండు కిలోల వెంట్రుకలు



మహిళ పొట్టలో నుంచి తొలగించిన వెంట్రుకలతో వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్): మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళ పొట్టలో రెండు కిలోల తలవెంట్రుకలు బయటపడ్డాయి. వైద్యులు ఆపరేషన్ ద్వారా వీటిని తొలగించి ఆమెకు ప్రాణం పోశారు. మంగళవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని శ్రీవాసవి అపెక్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జన్ డాక్టర్ రమణ వివరాలు వెల్లడించారు. అంజనమ్మ అనే మహిళకు మానసిక సమస్య కారణంగా వెంట్రుకలు తినే అలవాటు ఉంది. దీంతో ఆమె తిన్న వెంట్రుకలు గర్భాశయంతో పాటు కడుపు చుట్టుపక్కల పేరుకుపోయి ఆహారం తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడేది. కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తీసుకురావడంతో వైద్యపరీక్షలు చేసి పొట్టలో పెద్ద ఎత్తున వెంట్రుకలు ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం ఆపరేషన్ చేసి తొలగించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. ఆపరేషన్‌లో జనరల్ సర్జన్ డాక్టర్ రమణతో పాటు డాక్టర్ చిట్టిబాబు, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ భూపాల్ పాల్గొన్నారు.

బాబును నమ్మిన ఎన్టీఆర్ పరిస్థితి ఏమైంది?

- అమ్ముడుపోయిన ఎమ్మెల్యేకూ అదే గతి పడుతుంది
- బాబు, బాలకృష్ణ, అచ్చెన్నాయుడు రాజీనామా చేయాలి
- పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న రోజా

సింహాచలం: చంద్రబాబును నమ్మిన ఎన్టీఆర్ పరిస్థితి ఏమైందో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలకూ అదే గతి పడుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె. రోజా చెప్పారు. ఆమె మంగళవారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు, బాలకృష్ణ ఎమ్మెల్యేలుగా రాజీనామా చేసి ఉప ఎన్నికలకు రావాలని సవాలు విసిరారు. 2024 సాధారణ ఎన్నికలకు ఇది ట్రైలర్‌గా ఉంటుందని, ప్రజలు వారి పక్కన ఉన్నారా లేదా అన్న విషయం తెలిసిపోతుందని అన్నారు. ఎమ్మెల్సీలు గెలుస్తామని చంద్రబాబు కూడా ఊహించలేదని, లేదంటే తన కొడుకు లోకేశ్‌ను ఎందుకు నిలబెట్టలేదని ప్రశ్నించారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్న చంద్రబాబును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో జీరోకి పంపించి 175 స్థానాలు గెలుచుకుంటారని చెప్పారు. తప్పులు చేసి, అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలు సీఎం వైఎస్ జగన్‌పై నిందలు వేయడం సరికాదన్నారు. ప్రతీ ఎమ్మెల్యే, ఎంపీకి ఎంతో గౌరవం ఇచ్చే వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. కోవిడ్ సమయంలో చావుబతుకుల మధ్య ఉంటే సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ పంపించి ఆరోగ్యంపై పర్యవేక్షించిన విషయం ఎమ్మెల్యే శ్రీదేవి గుర్తు చేసుకోవాలన్నారు. జగన్ అంటే ప్రాణమని, వైఎస్సార్‌సీపీకే ఓటు వేశానని చెప్పిన ఆమె.. ఇప్పుడు ఎందుకు మాట మార్చిందని ప్రశ్నించారు.

వారంలో 'ప్రసాద్' పనులకు టెండర్లు

సింహాచలం దేవస్థానానికి కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రసాద్ స్కీమ్‌కి వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని మంత్రి చెప్పారు. రూ.54.04 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఏడాది లోపే పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

ఘనంగా కోటి రుద్రాభిషేకం ప్రారంభం



కోటి రుద్రాక్ష అభిషేకంలో పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర, గౌతంరెడ్డి

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): దేశంలోనే తొలిసారిగా సర్వమానవాళి సంక్షేమం కోసం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ముత్యాలంపాడులో ఉన్న శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం కోటి రుద్రాభిషేకం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా భక్తులు వచ్చి బాబాకు రుద్రాక్షలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. విశాఖ శ్రీ శారద పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేసి కోటి రుద్రాక్ష అభిషేక విశిష్టతను వివరించారు. మందిర గౌరవాధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. షిరిడీ పూజారులతో బాబాకు విశేషంగా పూజలు, అర్చనలు, హారతులు జరిగాయి. లోక కల్యాణార్థం విశేషంగా రుద్రహోమం, గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమాలు ప్రత్యేక పూజలు జరిగాయి. పలువురు యతీశ్వరులు, ఏపీ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు బాబాను దర్శించుకున్నారు.

పలు రికార్డులు నమోదు

కోటి రుద్రాక్ష అభిషేకం కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లో నమోదు చేశారు. సంబంధిత సర్టిఫికెట్‌లను వాటి ప్రతినిధులు మందిర గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డికి అందజేశారు. కాగా, కోటి రుద్రాభిషేకాన్ని ఈ నెల 30 వరకు నిర్వహించనున్నారు.

ఏప్రిల్ 1 నుంచి దివ్య దర్శనం పునఃప్రారంభం

- అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో రోజుకి 15,000 టోకెన్ల జారీ

తిరుమల: కరోనా కారణంగా మూడేళ్ల కిందట రద్దు చేసిన దివ్య దర్శనాన్ని ఏప్రిల్ 1 నుంచి ప్రయోగాత్మకంగా టీటీడీ పునరుద్ధరించనుంది. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో నిత్యం 15,000 టోకెన్లను భక్తులకు జారీ చేయనుంది. 15,000 మంది కంటే ఎక్కువ మంది నడకమార్గంలో తిరుమలకు వస్తే, పరిస్థితిని సమీక్షించి ఏప్రిల్ 15న జరిగే పాలకమండలి సమావేశంలో టోకెన్ల పెంపుపై నిర్ణయం తీసుకోనుంది.

భక్తుల విజ్ఞప్తిపై టీటీడీ స్పందన..

కరోనా పరిస్థితుల అనంతరం శ్రీవారి దర్శనంపై ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించిన నేపథ్యంలో కాలినడకన వచ్చే వారికి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని భక్తుల నుంచి టీటీడీకి విజ్ఞాపనలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్న టీటీడీ తిరిగి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే నిత్యం 20,000 నుంచి 30,000 సర్వదర్శనం టోకెన్లను భక్తులకు టీటీడీ జారీ చేస్తుండటంతో సర్వదర్శనం టోకెన్ల కోటాను కొంత మేర తగ్గించి నిత్యం అలిపిరి కాలిబాట మార్గంలో 10,000, శ్రీవారి మెట్టు మార్గంలో 5,000 దివ్యదర్శనం టోకెన్లను జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి అలిపిరి నడక మార్గంలోని గాలిగోపురం వద్ద, శ్రీవారి మెట్టు మార్గంలోని 1,300వ మెట్టు వద్ద గతంలో ఉన్న కౌంటర్లకు 3 రోజుల్లో మరమ్మతు పనులను టీటీడీ పూర్తి చేయనుంది. మరోవైపు దివ్య దర్శనం టోకెన్ల జారీని పునరుద్ధరిస్తున్నట్లు టీటీడీ చేసిన ప్రకటనను భక్తులు స్వాగతిస్తున్నారు. నడకదారిన వచ్చే భక్తులకు గతంలో మార్గంమధ్యలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేసే వారని, ప్రస్తుతం టీటీడీ అన్నప్రసాదం వితరణను నిలిపివేసిందని, దీన్ని కూడా పునఃప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.

బహుజన హక్కులకు అడ్డుపడుతున్న కులవాదులు

- 912వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రూ.కోట్లు ఖర్చుపెట్టి కోర్టుల్లో కేసులు వేసి బహుజనుల హక్కులకు కులవాదులు అడ్డుపడుతున్నారని, రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 912వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో పేదలకు సంక్షేమం, అభివృద్ధి చేరువ కాకుండా వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పుడు పనులను వెలికి తీసి అవినీతి బండారం బట్టబయలు చేసేందుకు కొనసాగుతున్న విచారణల్లో స్టేలు తెచ్చుకోవడం ఎందుకు నిదర్శనమో చెప్పాలని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎల్లో మీడియా నీచ సంస్కృతికి దిగజారిందని, భావ స్వేచ్ఛను నిర్వీర్యం చేస్తూ కలాన్ని కులానికి అమ్మేస్తున్న వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేయాలని అర్ధరాత్రి నన్ను సంప్రదించారు

- ఉదయం పూటా మరోసారి ఒత్తిడి చేశారు
- నా కుమారుడికి కూడా ఫోన్ చేశారు
- రూ.200 కోట్లు ఇచ్చినా ఆ పని చేయనని చెప్పా
- నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ వెల్లడి

నందికొట్కూరు(నంద్యాల): ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలంటూ అర్ధరాత్రి సమయంలో తన గది తలుపు తట్టారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ వెల్లడించారు. తనతో పాటు తన కుమారుడికి కూడా ఫోన్ చేశారని తెలిపారు. క్రాస్ ఓటింగ్ కోసం తనపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని విధాలుగా ప్రయత్నించారని చెప్పారు. ఎన్ని రూ.కోట్లు ఇచ్చినా.. టీడీపీకి ఓటు వేయబోనని తేల్చి చెప్పినట్లు వెల్లడించారు. మంగళవారం నందికొట్కూరులో ఎమ్మెల్యే ఆర్థర్ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కోసం తనను టీడీపీ ఎలా ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించిందో ఆయన వివరించారు. 'ఉగాది రోజున మాక్ పోలింగ్ అనంతరం అర్ధరాత్రి సమయంలో అజయ్ అనే వ్యక్తి విజయవాడలో నేను ఉన్న గది తలుపు తట్టాడు. గన్‌మెన్.. సార్ ఎవరో మీ కోసం వచ్చారని నన్ను నిద్ర లేపాడు. అర్ధరాత్రి పూట ఎవరయ్యా? ఫోన్‌లో మాట్లాడించు అన్నాను. అవతలి వ్యక్తి సార్.. నా పేరు అజయ్. కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐతో మాట్లాడాలని ఫోన్‌లో చెప్పాడు. అర్ధరాత్రి పూట సీఐతో ఏం పని ఉందయ్యా? అయినా నేను కర్నూలు ఎమ్మెల్యేను కాదని చెప్పా. అప్పటికీ ఇంకా ఏదో చెప్పబోతే ఫోన్ కట్ చేశాను. ఉదయం మళ్లీ ఫోన్ చేశాడు. అప్పుడు కూడా ఏదో కథ చెప్పాలని చూశాడు. బాబూ మీరెందుకు ఫోన్ చేస్తున్నారో నాకు అర్థమయ్యిందని చెప్పా. ఆ సమయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కూడా నా పక్కనే ఉన్నారు. ఆ అజయ్ అనే వ్యక్తి.. 'టీడీపీకి ఓటు వేస్తే అడిగినంత డబ్బులిస్తాం సార్' అని చెప్పాడు. రూ.200 కోట్లు ఇచ్చినా టీడీపీకి ఓటు వేసే ప్రసక్తే లేదని, జగనన్న వెంటే ఉంటానని తేల్చి చెప్పి ఫోన్ పెట్టేశాను. అదే రోజు మళ్లీ నా కుమారుడికి కూడా ఫోన్ చేసి ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించాడు' అని ఆర్థర్ వివరించారు. గత ఎన్నికల్లో తనకు వైఎస్ జగన్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించారని.. 2024లో టికెట్ ఎవరికి ఇచ్చినా కూడా వారి గెలుపు కోసం పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కాగా, సీఎం జగన్‌ను దేవుడు అని పొగిడిన ఉండవల్లి శ్రీదేవి.. ఇప్పుడు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని చెప్పడం సిగ్గు చేటు అని ఎమ్మెల్యే మండిపడ్డారు. పోలింగ్ రోజు శ్రీదేవి ఓటు వేసేందుకు వచ్చినప్పుడు.. డిసైడ్ ఫ్యాక్టర్ అని టీడీపీ నేత రామానాయుడు ఎందుకు అన్నారో ఆ తర్వాత అర్థమయ్యిందన్నారు.

'లంచం ఇవ్వలేను, ఎద్దులను తీసుకోండి'

యశవంతపుర: తన పొలంలో ఉపాధి హామీ పథకం కింద చేసుకున్న పనుల బిల్లులను మంజూరు చేయడానికి పంచాయతీ అభివృద్ధి అధికారి లంచం డిమాండ్ చేశాడు. దీంతో రైతు డబ్బులు ఇవ్వలేక, తను పోషిస్తోన్న రెండు ఎద్దులను లంచంగా ఇవ్వడానికి గ్రామ పంచాయతీ ఆఫీసుకు తీసుకువచ్చాడు. ఈ ఘటన కర్ణాటకలో బీదర్ జిల్లా బసవ కళ్యాణ తాలూకా బగదూరులో మంగళవారం జరిగింది. ఉపాధి హామీ పథకం ద్వారా రైతు ప్రశాంత బిరాదార తన పొలంలో వాన నీటి నిల్వకు గుంతలు, కాలువలను తవ్వారు. ఆయనకు ఈ పనులకు రూ.లక్ష ఖర్చు కాగా, మొదటి విడతలో రూ.55 వేలు మంజూరయ్యాయి. మిగిలిన రూ.45 వేలను విడుదల చేయడానికి బగదూరు పీడీవో లంచం అడిగాడు. ఆవేదనకు గురైన రైతు 2 ఎద్దులను పంచాయతీ ఆఫీసుకు తీసుకెళ్లి వీటినే లంచంగా తీసుకుని బిల్లులను మంజూరు చేయాలని పట్టుబట్టాడు. మిగిలిన రూ.45 వేలను తక్షణం విడుదల చేస్తామని ఈవో సంతోష్ రైతుకు నచ్చజెప్పారు.

రెచ్చిపోయిన 'ఎర్ర' దొంగలు

- అటవీ అధికారులపై రాళ్లతో దాడి
- ప్రతిఘటించి రూ.12.8 లక్షల ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్ర చందనం దుంగలతో అటవీ అధికారులు

కలువాయి (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): అక్రమంగా ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న దొంగలు రెచ్చిపోయారు. రాపూరు అటవీ రేంజ్‌లో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులపై అమాంతం రాళ్లతో దాడికి దిగారు. రాపూరు అటవీ రేంజ్ అధికారి పి.రవీంద్రబాబు కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా చిట్వేలు రేంజ్ కోడూరు బీట్ పెర్లకుంట, మామిడికోన ప్రాంతాల పరిధిలోని అటవీ ప్రాంతం గుండా ఎర్రచందనం దుంగలను సరిహద్దులు దాటించి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలం కోటూరుపల్లి చెరువు, ఎర్రకాలువ పరిసరాల్లో డంపింగ్ చేస్తున్నారని అధికారులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో అటవీ రేంజ్ అధికారి పి.రవీంద్రబాబు, గోనుపల్లి డీఆర్వో మస్తానయ్య తమ సిబ్బందితో కలసి సోమవారం రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు. 565 జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలో కోటూరుపల్లి సమీప అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్న దొంగలు అధికారులను గమనించి అకస్మాత్తుగా రాళ్ల దాడికి దిగారు. అయితే దాడినుంచి తప్పించుకుంటూనే రెండు కిలోమీటర్ల మేర వారిని వెంబడించారు. దొంగలు పరారుకాగా.. ఘటనా స్థలంలో రూ.12.8 లక్షల విలువజేసే 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సిబ్బంది ఫరీద్, నాగులు, రాహుల్, భాగ్యరాజు, రాపూరు స్క్వాడ్, స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

'హేమావతి'లో హోయసల శాసనం

అమరాపురం: శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని శైవ క్షేత్రం హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో హోయసల రాజు వేయించిన శిలా శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి గుర్తించారు. నొలంబ, పల్లవ ప్రభువుల రెండో రాజధాని హేమావతి (హెంజేరు). ఇక్కడి నొలంబ శిల్ప శైలిపై మైనాస్వామి పరిశోధన చేస్తున్నారు. నొలంబ, పల్లవులకు సంబంధించిన ఎన్నో శాసనాలు, చోళులకు చెందిన రెండు శాసనాలు హేమావతిలో ఉన్నాయి. హోయసల రెండో రాజు వీరభల్లాల శాసనం మాత్రం మొదటిసారిగా గుర్తించినట్లు మైనాస్వామి తెలిపారు. నొలంబ, హోయసల శాసనాల గురించి బ్రిటీష్ వారు ముద్రించిన శాసన సంపుటి–9లో హేమావతి హోయసల శాసనం గురించి ఎటువంటి సమాచారం లేదని ఆయన చెప్పారు. హేమావతి నొలంబేశ్వరస్వామి గుడికి మాన్యాన్ని దానం చేసినట్లు శాసనంలో పేర్కొన్నారన్నారు. శాలివాహన శకవర్షం 1127 క్రోధన నామ సంవత్సరం ఫాల్గుణ మాసం బహుళ అమావాస్య ఆదివారం రోజు సూర్యగ్రహణం నాడు రెండో వీరభల్లాల రాజు మాన్యాన్ని ఇచ్చినట్లు శాసనంలో రాశారని తెలిపారు. హేమావతిలో శాసనాలకు సంబంధించి ఒక మార్గదర్శిని తయారు చేసి సందర్శకులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: పులివెందుల కాల్పుల ఘటనలో అవాస్తవాలు ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గత ఏడాది కాలంగా భరత్ యాదవ్, దిలీప్‌ల మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీల కారణంగా వచ్చిన వ్యక్తిగత విభేదాల నేపథ్యంలోనే కాల్పుల ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. భరత్‌యాదవ్ ఇతరులను బెదిరించినట్లుగా ఫిర్యాదులు వచ్చినట్లు, ఆ ఫిర్యాదులపై పోలీసులు చర్యలు తీసుకోలేదన్న విధంగా సోషల్ మీడియాలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో అవాస్తవ ప్రచారాలు చేసే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

క్లుప్తంగా..

స్వల్పంగా పెరిగిన ఈపీఎఫ్‌వో వడ్డీ రేటు

న్యూఢిల్లీ: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) డిపాజిట్లపై వడ్డీ రేటు 2022–23 ఆర్థిక సంవత్సరానికి 8.15 శాతానికి పెరిగింది. ఈ మేరకు కేంద్ర కార్మిక మంత్రి భూపేంద్ర యాదవ్ నేతృత్వంలోని ఈపీఎఫ్‌వో అత్యున్నత నిర్ణాయక సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (ఈబీటీ) నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖ అనుమతి పొందిన తర్వాత ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ జారీ చేయనుంది. ఆ తర్వాత తాజాగా పెంచిన వడ్డీరేటు మొత్తాన్ని ఈపీఎఫ్‌వో చందాదారుల ఖాతాల్లో జమ చేయనుంది. 2022 మార్చిలో డిపాజిట్లపై వడ్డీ రేటును ఈపీఎఫ్‌వో 8.10%కి తగ్గించిన విషయం తెలిసిందే. ఇది గత నాలుగు దశాబ్దాల్లోనే అత్యల్పం కావడం గమనార్హం. అంతకుముందు అది 8.5 శాతంగా ఉండేది.

మరింత అణు ఇంధనోత్పత్తి
ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్

సియోల్: అణుపాటవాన్ని మరింతగా పెంచుకునేందుకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ తీవ్రంగా యత్నిస్తున్నారు. అణు బాంబుల తయారీకి అవసరమైన అణు ఇంధన ఉత్పత్తిని మరింత వేగవంతం చేయాలని మంగళవారం జరిగిన సమావేశంలో అధికారులు, శాస్త్రవేత్తలను ఆయన ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ముఖ్యమైన లక్ష్యాలను అధ్యక్షుడు వారికి వివరించినట్లు అధికార వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా తాజా అణ్వాయుధ వ్యవస్థలను, వారి తయారీలో పురోగతిని అధికారులతో ఆయన సమీక్షించినట్లు తెలిపింది.

రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఒక్కరోజులో ఆపేవాణ్ని: ట్రంప్


వాషింగ్టన్: 2020 ఎన్నికల్లో మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైతే రష్యా–ఉక్రెయిన్‌ల యుద్ధం జరిగి ఉండేదే కాదని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో తనకున్న మంచి సంబంధాల దృష్ట్యా, అసలు ఈ యుద్ధం మొదలయ్యేదే కాదన్నారు. ఇటీవల ఫాక్స్ న్యూస్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. అమెరికా అధ్యక్షుడిగా రష్యా–ఉక్రెయిన్ సంక్షోభానికి 24 గంటల్లోనే ముగింపు పలికి ఉండేవాడినని చెప్పుకున్నారు. ''2024 దాకా యుద్ధం కొనసాగితే, నేను మళ్లీ అధ్యక్షుడినైతే ఒక్క రోజులోనే శాంతి ఒప్పందం కుదురుస్తా. నాకు, పుతిన్‌కు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య శాంతి చర్చలు చాలా ఈజీ వ్యవహారం. సంక్షోభం ఇలాగే కొనసాగితే, అమెరికా అధ్యక్ష ఎన్నికల నాటికి మూడో ప్రపంచయుద్ధానికి దారితీసి, అణుయుద్ధంగా మారే ప్రమాదముంది. రెండు ప్రపంచ యుద్ధాలు మూర్ఖుల కారణంగా స్వల్ప కారణాలతోనే జరిగాయి'' అన్నారు.

కన్నడనాట రిజర్వేషన్ల రగడ

- 4 % ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ సర్కారు వేటు
- లింగాయత్, వక్కలిగలకు సమానంగా పంపకం
- అసెంబ్లీ ఎన్నికల వేళ వివాదాస్పద నిర్ణయం
- ఎస్సీ 'అంతర్గత'రిజర్వేషన్లపైనా మంటలు

అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటకలో బసవరాజ్ బొమ్మై సారథ్యంలోని బీజేపీ సర్కారు రిజర్వేషన్ల తేనెతుట్టెను కదిపింది. ఓబీసీ కోటాలో ముస్లింలకు అందుతున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ గత వారం వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఆ 4 శాతాన్ని బీజేపీకి గట్టి ఓటు బ్యాంకైన వక్కలిగలు, లింగాయత్‌లకు సమానంగా పంచడంపై కలకలం రేగుతోంది. ఈ పరిణామం విపక్ష కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదు. ఇవి ఓటు బ్యాంకు రాజకీయాలని విమర్శిస్తూనే, తాము అధికారంలోకి వస్తే ముస్లింల కోటాను పునరుద్ధరిస్తామంటూ హస్తం పార్టీ తాజాగా ఎన్నికల హామీ ఇచ్చింది. మరోవైపు ఎస్సీ రిజర్వేషన్లను ఉప కులాలవారీగా విభజించిన తీరుతో తమకు అన్యాయం జరిగిందంటూ బంజారాలు, ఆదివాసీలు రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్



ఏం జరిగింది?

కర్ణాటకలో ముస్లింలను ఓబీసీ జాబితాలోని 2బీ కేటగిరీ నుంచి తొలగిస్తూ బొమ్మై ప్రభుత్వం వారం క్రితం నిర్ణయం తీసుకుంది. ఓబీసీ కోటాలో భాగంగా విద్య, ఉద్యోగాల్లో వారికి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేసింది. వాటిని లింగాయత్‌లు, వక్కలిగలకు చెరో 2 శాతం చొప్పున పంచింది. ముస్లింలను ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనకబడ్డ వర్గాల) జాబితాకు మారుస్తున్నట్టు సీఎం బొమ్మై చెప్పుకొచ్చారు. ''మతాధారిత రిజర్వేషన్లకు రాజ్యాంగంలో చోటు లేదు. ముస్లింలకు ఇకనుంచి 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అందుబాటులో ఉంటాయి'' అన్నారు.

కాంగ్రెస్ ఏమంటోంది?

ముస్లింలను ఓబీసీ జాబితా నుంచి ఏ ప్రాతిపదికన తొలిగించారంటూ కాంగ్రెస్ మండిపడింది. ఇది మతాల మధ్య మంటలు రాజేసే యత్నమంటూ దుయ్యబట్టింది. ముస్లింల 4 శాతాన్ని తమకు పంచడంపై లింగాయత్‌లు, వక్కలిగలు కూడా సంతోషంగా లేరని చెప్పుకొచ్చింది. ''ముస్లింలను ఓబీసీ నుంచి ఈడబ్ల్యూఎస్ కోటాకు మార్చడం రాజ్యాంగవిరుద్ధం. ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఏ మతానికి, కులానికి చెందిన వారైనా జనరల్ కేటగిరీ అయిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాకు అర్హులే అవుతారు. అలాంటి కోటాకు ముస్లింలను మార్చి, వారికేదో కొత్తగా 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు బీజేపీ చెప్పుకోవడం విడ్డూరం''అంటూ మండిపడింది. తాము అధికారంలోకొస్తే వారికి 4 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని ప్రకటించింది.

వక్కలిగ, లింగాయత్... బలీయమైన ఓటు బ్యాంకులు

వక్కలిగలు, లింగాయత్‌లు కర్ణాటకలో బలమైన సామాజిక వర్గాలు. బలీయమైన ఓటు బ్యాంకులు కావడంతో ఎన్నికల్లో వాటి ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. బెంగళూరు నగర నిర్మాత కెంపె గౌడది వక్కలిగ సామాజిక వర్గమే. రాష్ట్రంలో గత, ప్రస్తుత రాజకీయ ప్రముఖుల్లో చాలామంది ఈ కులాలకు చెందినవారే.




- పలు నివేదికల ప్రకారం రాష్ట్ర జనాభాలో లింగాయత్‌లు 17 శాతం ఉంటారు.
- మొత్తం 224 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 100 చోట్ల వీరు ఫలితాలను శాసించే స్థితిలో ఉన్నారు.
- లింగాయత్‌లు రెండు దశాబ్దాలకు పైగా బీజేపీకి గట్టి మద్దతుదారులుగా ఉంటూ వస్తున్నారు.
- ఇక వక్కలిగలు జనాభాలో 11% ఉన్నట్టు అంచనా. కానీ తాము నిజానికి 16 శాతం దాకా ఉంటామన్నది వీరి వాదన.
- తొలుత ప్రధానంగా వ్యవసాయదారులైన వక్కలిగలు స్వాతంత్ర్యానంతరం పలు రంగాలకు విస్తరించి పట్టు సాధించారు.
- తమకు రిజర్వేషన్లు పెంచాలంటూ ఈ రెండు సామాజిక వర్గాలూ కొద్ది నెలలుగా బొమ్మై ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. లేదంటే ఈసారి బీజేపీకి ఓటేసేది లేదంటూ భీష్మించుకున్నాయి.
- తాజాగా ముస్లింల 4 శాతం రిజర్వేషన్లను వీరికి పంచడంతో వక్కలిగల రిజర్వేషన్లు 4 నుంచి 6 శాతానికి, లింగాయత్‌లకు 5 నుంచి 7 శాతానికి పెరిగాయి.

భగ్గుమన్న బంజారాలు, ఆదివాసీలు

విద్య, ఉద్యోగాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లను 15 నుంచి 17 శాతానికి, ఎస్టీలకు 4 నుంచి 7 శాతానికి బీజేపీ సర్కారు గత డిసెంబర్‌లో పెంచింది. అయితే వారిలో అణగారిన ఉప కులాల వారికి రిజర్వేషన్ల ఫలాలు అందకుండా బలవంతులైన కొన్ని ఉప కులాల వాళ్లే వాటిని అత్యధికంగా చేజిక్కించుకుంటున్నారన్న ఫిర్యాదు చాలాకాలంగా ఉంది. ఈ అసమానతలను సరిచేయాలన్న వారి చిరకాల డిమాండ్‌పై బొమ్మై ప్రభుత్వం ఇటీవలే రంగంలోకి దిగింది. 101 ఎస్సీ కులాల వారికి సమ న్యాయం చేసేందుకు అంతర్గత రిజర్వేషన్లను నిర్ణయించింది.

- ఆ మేరకు రాజ్యాంగంలోని 341(2) ఆర్టికల్ ప్రకారం ఎస్సీలను 4 విభాగాలుగా వర్గీకరించారు. ఎస్సీ (లెఫ్ట్)కు 6 శాతం రిజర్వేషన్లు కేటాయించింది. ఆ జాబితాలోకి మాదిగ, ఆది ద్రవిడ, బాంబి ఉపకులాలు వస్తాయి.
- ఎస్సీ (రైట్)కు 5.5 శాతం కేటాయించింది. ఆది కర్ణాటక, హోలెయా, చలవాది ఉప కులాలు దీని కిందికి వస్తాయి. బంజారా, భోవి, కొరచ, కొరమలకు 4.5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.
- మిగిలిన ఒక్క శాతం సంచార, ఆదివాసీ జాతులైన అలెమరి, ఆరె అలెమరిలకు దక్కుతుంది.
- దీన్ని బంజారా, భోవి కులాలవాళ్లు తీవ్రంగా నిరసిస్తున్నారు. తమకు తీరని అన్యాయం జరిగిందంటూ ఆందోళనలకు దిగారు. తాజాగా మాజీ సీఎం యడ్యూరప్ప నివాసంపై రాళ్లు రువ్వడం అందులో భాగమే.



ఆ బంగ్లాతో ఎన్నో జ్ఞాపకాలు

అయినా ఖాళీ చేస్తా: రాహుల్



న్యూఢిల్లీ: ఎంపీగా అనర్హత వేటు పడ్డ నేపథ్యంలో అధికారిక బంగ్లాను ఖాళీ చేస్తానని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. నెల రోజుల్లోపు దాన్ని ఖాళీ చేయాలన్న లోక్‌సభ సచివాలయం నోటీసుపై ఆయన మంగళవారం స్పందించారు. ''12, తుగ్లక్ లేన్‌లో నాకు కేటాయించిన బంగ్లాను ఖాళీ చేయాలంటూ మీరు పంపిన లేఖకు ధన్యవాదాలు. నాలుగుసార్లు ఎంపీగా ఆ బంగ్లాలో చాలా ఏళ్లు గడిపాను. నాకక్కడ ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. నా హక్కులకు భంగం కలగని రీతిలో వ్యవహరిస్తా'' అంటూ నోటీసుకు బదులిచ్చారు. సదరు బంగ్లాలో రాహుల్ 2005 నుంచీ ఉంటున్నారు. దాన్ని ఖాళీ చేయాలన్న తాఖీదులపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. మోదీ సర్కారు తాలూకు 'బెదిరించి, భయపెట్టి, అవమానించే' వైఖరికి ఇది పరాకాష్ట అంటూ దుయ్యబట్టారు. రాహుల్‌ను బలహీనపరిచేందుకు మున్ముందు కూడా ఎంత చేయాలో అంతా చేస్తారని అభిప్రాయపడ్డారు. ''రాహుల్‌కంటూ సొంతిల్లు లేదు. అధికారిక బంగ్లా వీడాక తన తల్లి సోనియాతో 10, జన్‌పథ్ నివాసంలో ఉంటారు. లేదంటే నా ఇంటిని ఖాళీ చేసి ఆయనకిస్తా'' అని ఖర్గే చెప్పుకొచ్చారు. ''ఎన్నికల ఫలితాలు వచ్చిన ఆర్నెల్ల తర్వాత గానీ నాకు అధికారిక బంగ్లా కేటాయించలేదు. ఇలాంటివి బీజేపీకి అలవాటే'' అని విమర్శించారు.

మళ్లీ వాయిదా

ఉభయసభల్లో అదే తంతు

న్యూఢిల్లీ: అవే డిమాండ్లు. అవే ఆందోళనలు. అవే దృశ్యాలు. అదే తంతు. పార్లమెంటు ఉభయ సభల్లో మంగళవారం కూడా విపక్ష ఆందోళనలు యథావిధిగా కొనసాగాయి. సభ్యులంతా మరోసారి నల్ల దుస్తులతో సభలకు వచ్చారు. అదానీ అంశంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేశారు. 'మోదీ–అదానీ భాయీ భాయీ' వంటి నినాదాలతో హోరెత్తించారు. పదేపదే వెల్‌లోకి దూసుకెళ్లారు. సభాపతి స్థానాలపైకి పేపర్లు, స్కార్ఫులు విసిరారు! దాంతో లోక్‌సభ, రాజ్యసభ రెండూ ముందు మధ్యాహ్నానికి, అనంతరం బుధవారానికి వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే రాజ్యసభలో పలు నివేదికలను ప్రవేశపెట్టారు. మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలతో చరిత్ర సృష్టించిన నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గొహైన్, నీతూ ఘంఘాస్, స్వీటీ బూరాలను సభ అభినందించింది.

అతీక్ అహ్మద్‌కు జీవిత ఖైదు

ఉమేశ్ పాల్ కిడ్నాప్ కేసులో కోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్(యూపీ): 2006 నాటి ఉమేశ్‌పాల్ కిడ్నాప్ కేసులో గ్యాంగ్‌స్టర్–రాజకీయ నేత అతీక్ అహ్మద్, మరో ఇద్దరికి కఠిన జీవిత ఖైదు విధిస్తూ ఎంపీ–ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. తలా రూ.1 లక్ష చొప్పున జరిమానా కూడా విధించింది. అతీక్‌పై నమోదైన 100కు పైగా కేసుల్లో శిక్ష పడిన మొట్టమొదటి కేసు ఇదే. ఇదే కేసులో అతీక్ సోదరుడు ఖాలిద్ అజీం అలియాస్ అష్రఫ్, మరో ఆరుగురిని కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. తీర్పుపై హైకోర్టుకు వెళతామని అతీక్ పోలీస్ వ్యాన్ నుంచి విలేకరులతో అన్నాడు. కోర్టు తీర్పు అనంతరం పోలీసులు ముగ్గురినీ వేర్వేరు వ్యాన్లలో నైని జైలుకు తరలించారు. 2005లో జరిగిన బీఎస్పీ ఎమ్మెల్యే రాజు హత్య కేసులో అహ్మద్ తదితరులు నిందితులు. ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఉమేశ్ పాల్‌ను అతీక్ కిడ్నాప్ చేసి, బెదిరించాడు. ఈ కేసులో అతీక్ జైలుపాలయ్యాడు.

సౌదీలో బస్సు ప్రమాదం..20 మంది మృతి

రియాద్: సౌదీ అరేబియాలో ఉమ్రాహ్ తీర్థయాత్రికులతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురై 20 మంది చనిపోగా మరో 24 మంది గాయపడ్డారు. అసిర్ ప్రావిన్స్‌లోని అకాబట్ షార్ వద్ద సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఖమిస్ ముషాయత్ నుంచి అభా వైపు వెళ్తున్న బస్సు బ్రేకులు ఫెయిలై వంతెన గోడను ఢీకొట్టిన అనంతరం బోల్తాపడి మంటల్లో చిక్కుకుంది.

అవినీతిపరులను కాపాడేందుకే... విపక్షాల ఉద్యమం

దేశ వ్యతిరేక శక్తులు చేతులు కలుపుతున్నాయి • విపక్షాలపై మోదీ విసుర్లు

- బీజేపీ ఎంతగా గెలుస్తుంటే అంతగా విమర్శలు
- అయినా అవినీతిపై చర్యలు ఆగవు
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అవినీతికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యల వల్లే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలు అవినీతికి వ్యతిరేకంగా జరిగే పోరును ఆపలేవని స్పష్టం చేశారు. బీజేపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ఖ్యాతి అత్యున్నత శిఖరాలకు చేరుకున్న ఈ సమయంలో, భారత వ్యతిరేక శక్తులు అంతర్గతంగా, వెలుపలా చేతులు కలపడం సహజమేనని ప్రధాని పేర్కొన్నారు. కేంద్రం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందంటూ కొన్ని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలపై ఆయన.. కొన్ని 'అవినీతి రక్షణ ఉద్యమం' ప్రారంభించాయంటూ పరోక్షంగా దుయ్యబట్టారు. కొందరికి కోపం కూడా వస్తోందంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలతోనే గతంలో ఇంతగా అవినీతి జరిగిందనే విషయాన్ని ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. 'తప్పుడు ఆరోపణలతో దేశం తలవంచదు. అవినీతిపై చర్యలు ఆగవు. భారత వ్యతిరేక శక్తులు బలమైన పునాది వంటి రాజ్యాంగ సంస్థలపై దాడులు చేస్తున్నాయి. దేశాభివృద్ధిని ఆపేందుకు దాడికి దిగుతున్నాయి. న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేందుకు, వాటి విశ్వసనీయతను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయి'అని ఆరోపించారు. 2004–14 సంవత్సరాల మధ్య యూపీఏ ప్రభుత్వం మనీలాండరింగ్ ఆరోపణలపై రూ.5 వేల కోట్ల సొత్తును స్వాధీనం చేసుకోగా 9 ఏళ్లలో తమ ప్రభుత్వం రూ.1.10లక్షల కోట్ల ఆస్తుల్ని స్వాధీనం చేసుకుందన్నారు. ఎన్నికల్లో బీజేపీ విజయాలకు, తమ ప్రభుత్వంపై విపక్షాల విమర్శలకు సంబంధముందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బీజేపీ ఎంతగా విజయాలు సాధిస్తే ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని అంతగా లక్ష్యంగా చేసుకుంటాయన్నారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వంపై పలు అంశాలపై ప్రతిపక్షాలు విమర్శలు ఎక్కుపెడుతుండటాన్ని ఆయన ప్రస్తావించారు. బీజేపీ వరుస విజయాలు నమోదు చేసుకుంటున్న నేపథ్యంలోనే గుజరాత్ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల విమర్శల దాడులు ఎక్కువైనట్లు చెప్పారు. మున్ముందు ఈ విమర్శలు అన్ని స్థాయిల్లోనూ తీవ్రతరమవుతాయని హెచ్చరించారు.

ఏప్రిల్ 6–14 మధ్య సేవా కార్యక్రమాలు

బీజేపీ వ్యవస్థాపక దినం ఏప్రిల్ 6 నుంచి మొదలుకొని ఏప్రిల్ 14వ తేదీ అంబేడ్కర్ జయంతి రోజు వరకు సొంత నియోజకవర్గాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నం కావాలని మోదీ ఎంపీలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమాజంపై ఎంతో ప్రభావం చూపే రాజకీయ నేతలు రాజకీయేతర అంశాలపైనా దృష్టి సారించాలన్నారు. ''విష రసాయనాల నుంచి నేలకు విముక్తి కల్పించాలి. ఎంపీలు కొత్త సాంకేతికతను అలవర్చుకునేందుకు నిపుణుల సేవలను వినియోగించుకోవాలి. మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో విజయాలకు మోదీని పార్టీ ప్రశంసించింది.



బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో నేతలతో మోదీ

బీజేపీ దేశవ్యాప్త ఆందోళనలు

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ 'దొంగలందరి ఇంటి పేరు మోదీ' వ్యాఖ్యలపై దేశవ్యాప్త ఆందోళనలకు బీజేపీ ఓబీసీ మోర్చా నిర్ణయించింది. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 14 దాకా రాహుల్‌కు వ్యతిరేకంగా ప్రచారోద్యమం చేపట్టనున్నట్టు ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రకటించారు. రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ ఓబీసీ ఎంపీలు మంగళవారం ఢిల్లీలో ర్యాలీ చేశారు. ఆయన తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

స్పీకర్‌పై అవిశ్వాసం!

రాహుల్ అనర్హత వేటుపై కాంగ్రెస్ యోచన | విపక్ష పార్టీలతో విస్తృత సంప్రదింపులు | విపక్షాల కూటమి బలోపేతానికి యత్నం | ప్రతిపక్ష అగ్ర నేతలతో త్వరలో సమావేశం



కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో పాల్గొన్న పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీపై అనర్హత వేటుపై జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ అంశంపై బహుముఖ దాడితో అధికార బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా ముందుగా 'ఏకపక్షంగా వ్యవహరించి రాహుల్‌పై వేటు వేశా'రంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని యోచిస్తోంది. కాంగ్రెస్ ఎంపీలంతా మంగళవారం ఉదయమే సమావేశమై దీనిపై మల్లగుల్లాలు పడ్డారు. కోర్టు శిక్ష విధించిన గంటల వ్యవధిలోనే ఆగమేఘాలపై రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిన వైనాన్ని అవిశ్వాస తీర్మానం ద్వారా హైలైట్ చేయొచ్చన్న భావన వ్యక్తమైంది. అనంతరం దీనిపై విపక్షాలతో కూడా విస్తృతంగా చర్చోపచర్చలు జరిపినట్టు సమాచారం. అన్నీ కుదిరితే వచ్చే సోమవారం అవిశ్వాసం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే కొన్ని విపక్షాలు ఇందుకు అభ్యంతరం చెబుతున్నట్టు సమాచారం. ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటున్న విపక్షాల ఐక్యత యత్నాలకు ఇది గండి కొట్టే ప్రమాదముందన్నది వాటి వాదనగా తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే కనీసం 50 మంది ఎంపీల మద్దతు సంతకాలు అవసరం. పైగా పార్లమెంటు ఉభయ సభలూ రెండు వారాలుగా ఒక్క రోజు కూడా సజావుగా నడవని నేపథ్యంలో తీర్మానం సాధ్యాసాధ్యాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

త్యాగాలకు సిద్ధమవ్వాలి | విపక్షాలకు రాహుల్ పిలుపు

రాహుల్‌పై వేటును నిరసిస్తూ తృణమూల్ కాంగ్రెస్‌తో సహా 17 ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్‌కు తాజాగా సంఘీభావం ప్రకటించడం తెలిసిందే. ఈ క్రమంలో పార్లమెంటులో కన్పించిన విపక్షాల ఈ ఐక్యతను మరింత ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోంది. అందులో భాగంగా ఏప్రిల్ తొలి వారంలో విపక్ష అగ్రనేతలతో కీలక సమావేశం జరపాలని నిర్ణయించింది. సోమవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన విపక్షాల భేటీలోనే ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ''విపక్షాల అగ్ర నేతలు, అధ్యక్షులంతా భేటీ అయ్యేలా కాంగ్రెస్ చొరవ తీసుకోవాలని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్‌తో పాటు డీఎంకే, జేడీ(యూ), సీపీఎం నేతలు ప్రతిపాదించారు. 2024 సాధారణ ఎన్నికలకు అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాన్ని నిర్ణయించుకోవాల్సిన అవసరం చాలా ఉందని వారు పదేపదే చెప్పారు'' అని కాంగ్రెస్ ముఖ్యనేత ఒకరు వివరించారు. విపక్షాలన్నీ త్యాగాలకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ స్పష్టం చేసినట్టు చెబుతున్నారు. ''విపక్షాల ఐక్యత కోసం ఎంతటి త్యాగాలకైనా కాంగ్రెస్ సిద్ధం. నేనూ సిద్ధం'' అని ఆయన కుండబద్దలు కొట్టారని సమాచారం. ఆ భేటీకి దూరంగా ఉన్న శివసేన (ఉద్ధవ్ వర్గం) కూడా తమతో కలిసి నడుస్తోందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ వివరించారు అదానీ ఉదంతం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో తృణమూల్ సహా విపక్షాలను కాంగ్రెస్‌కు దగ్గర చేయడం తెలిసిందే.

'అదానీ'పై మోదీకి లేఖలు!

రాహుల్‌పై వేటును నిరసిస్తూ, అదానీ అంశంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ నెల రోజుల పాటు బ్లాక్ స్థాయి నుంచి హస్తిన దాకా దేశవ్యాప్త ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మార్చి 24న పార్టీ స్టీరింగ్ కమిటీ, పీసీసీ చీఫ్‌లు, అనుబంధ విభాగాల చీఫ్‌లతో జరిగిన భేటీలో అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. వివరాలు...

- ఢిల్లీలోని ఎర్రకోట నుంచి మొదలు పెట్టి దేశంలోని 35 ప్రధాన నగరాల్లో మంగళ, బుధ వారాల్లో 'లోక్‌తంత్ర్ బచావో శాంతి మార్చ్'
- ఏప్రిల్ రెండో వారంలో 'జై భారత్ మహా సత్యాగ్రహం'. ఇందులో భాగంగా బ్లాక్/మండల కాంగ్రెస్ విభాగాలు సభలు, సమావేశాలు నిర్వహించి రాహుల్‌పై వేటు, అదానీతో ప్రధాని మోదీ బంధంపై ప్రజలకు వివరిస్తాయి. రాహుల్ సందేశాన్ని పార్టీ సోషల్ మీడియా విభాగాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తాయి.
- ఏప్రిల్ 15 నుంచి 20 దాకా జై భారత్ మహా సత్యాగ్రహంలో భాగంగా విపక్షాలతో కలిసి జిల్లాల్లో కలెక్టరేట్ల ఘెరావ్. రాష్ట్ర స్థాయిలోనూ భారీ కార్యక్రమం. ఒక్క రోజు ఉపవాస దీక్షలు. అనంతరం ఢిల్లీలో జాతీయ స్థాయిలో భారీ సత్యాగ్రహం.
- మార్చి 31న జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ నేతల మీడియా సమావేశాలు.
- యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ తదితరాల ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమం. అదానీ అవినీతి, రాహుల్‌పై వేటు తదితరాలపై ప్రశ్నిస్తూ ప్రధాని మోదీకి లేఖలు.
- మహిళా కాంగ్రెస్ నిరసన ర్యాలీ.

నాష్‌విల్లే స్కూల్‌లో దురాగతం.. మాజీ విద్యార్థి పనే

28 ఏళ్ల ట్రాన్స్‌జెండర్‌గా గుర్తింపు



కాల్పులు జరుపుతున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) షూటర్

నాష్‌విల్లే: అమెరికాలోని నాష్‌విల్లే క్రిస్టియన్ ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగిన కాల్పుల్లో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మృతుల్లో తొమ్మిదేళ్ల ముగ్గురు చిన్నారులతోపాటు స్కూల్ హెడ్ కేథరిన్, ఒక సబ్‌స్టిట్యూట్ టీచర్, కస్టోడియన్ ఒకరు ఉన్నారు. అనంతరం పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయిన వ్యక్తిని 28 ఏళ్ల ఆడ్రే ఎలిజబెత్ హేల్ అనే ట్రాన్స్‌జెండర్ మహిళగా గుర్తించారు. కాల్పుల గురించి పోలీసులకు 10.13 గంటల సమయంలో సమాచారం అందింది. వెంటనే స్కూల్ వద్దకు చేరుకుని మొదటి అంతస్తులో ఉన్న విద్యార్థులు, సిబ్బందిని ఖాళీ చేయించారు. రెండో అంతస్తులో కాల్పుల శబ్దం వినిపించడంతో అక్కడికి వెళ్లిన పోలీసులపై హేల్ కాల్పులకు తెగించింది. వెంటనే జరిపిన ఎదురుకాల్పుల్లో హేల్ అక్కడికక్కడే హతమైంది. ఆమె వద్ద ఉన్న రెండు అసాల్ట్ రైఫిళ్లు, ఒక హ్యాండ్ గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15 నిమిషాల్లో ఇదంతా జరిగిపోయింది. ఆమె స్కూల్‌లోకి కారులో వచ్చినట్లుగా సీసీ ఫుటేజీలో రికార్డయి ఉంది. షూటర్ హేల్ మాజీ విద్యార్థి అని అంటున్న పోలీసులు ప్రస్తుతం ఆమెకు స్కూల్‌తో గానీ స్కూల్ స్టాఫ్‌తో గానీ ఎటువంటి సంబంధాలున్నాయి? ఎవరిపై అయినా విరోధంతో ఈ ఘోరానికి పాల్పడిందా? అనే విషయాలను పోలీసులు వెల్లడించలేదు. అయితే, కోవెనంట్ స్కూల్‌పై ద్వేష భావం ఉన్నట్లు కనిపిస్తోందని పోలీస్ చీఫ్ జాన్ డ్రేక్ అన్నారు. మరోచోట కూడా కాల్పులు జరిపేందుకు హేల్ పథకం వేసినట్లు భావిస్తున్నామన్నారు. ఎన్‌కౌంటర్ ముగిసిన వెంటనే హేల్ ఇంట్లో జరిపిన సోదాల్లో పోలీసులకు రెండు షాట్‌గన్‌లు దొరికాయి. ఇంకా స్కూల్‌కు సంబంధించిన మ్యాప్, ఇతర ప్రదేశాల మ్యాప్‌లు, కాల్పులకు ముందు రెక్కీ చేపట్టినట్లు ఆధారాలు దొరికాయి. ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు, అనూహ్య ఘటన జరగబోతోందంటూ కొద్ది నిమిషాలకు ముందే హేల్ తమకు మెసేజీలు పంపినట్లు స్నేహితులు చెబుతున్నారు. దారుణానికి వేదికైన కోవెనంట్ ప్రెస్బిటేరియన్ చర్చి స్కూల్ 2001లో ప్రారంభమైంది. ఇక్కడ ప్రి స్కూల్ నుంచి ఆరో గ్రేడ్ వరకు 200 మంది వరకు చిన్నారులు చదువుకుంటుండగా, 50 మంది సిబ్బంది ఉన్నారు.

మెక్సికో వలసదారుల కేంద్రంలో విషాదం.. 39 మంది సజీవ దహనం

మెక్సికో సిటీ: మెక్సికోలో అమెరికా సరిహద్దుల్లో వలసదారుల డిటెన్షన్ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం 39 మంది సజీవ దహనం కాగా 29 మంది పరిస్థితి విషమంగా ఉంది. వలసదారులు పరుపులకు నిప్పు పెట్టడమే దీనికి కారణమంటున్నారు. అమెరికాలోకి ప్రవేశించేందుకు ఎదురుచూసే వారిని, ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఈ డిటెన్షన్ సెంటర్‌లోనే ఉంచుతుంటారు.

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామి



సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎడపాడి పళనిస్వామి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాదిగా పార్టీపై పట్టు సాధించేందుకు ఆయనకు, పన్నీరు సెల్వానికి పోరు సాగుతుండటం తెలిసిందే. గత నెలలో కోర్టు ఉత్తర్వులతో పార్టీ గుర్తు రెండాకులను కూడా పళనిస్వామి దక్కించుకున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 29 : మార్చి : 2023



చిత్తరువులకు మెరుపు
మంగళవారం బెంగళూరు చిత్రకళా పరిషత్‌లో పెయింటింగ్స్ ప్రదర్శనను వీక్షిస్తున్న సందర్శకులు

కాసులకు ఉపాయాలు

- పార్టీలకు స్ట్రాటజీ టీమ్‌ల మేధోసాయం
- ఎన్నికల వేళ గిరాకీ మెండు



సాక్షి, బెంగళూరు: ఎన్నికల యుద్ధంలో గెలవాలంటే ధనబలమే కాదు బుద్ధిబలం కూడా ఎంతో ముఖ్యం . ఇందుకుగాను పార్టీల కోసం కార్పొరేట్ వ్యూహకర్తలు, బృందాలు క్రియాశీలకంగా పని చేస్తున్నాయి. మరికొన్ని రోజుల్లో రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఉండడంతో మూడు ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్‌లు ప్రైవేటు వ్యూహ బృందాలపై ఆధారపడుతున్నాయి. ఇంటింటి ప్రచారం, ఓటర్ల మనసులు గెలిచే ప్రణాళికలు, ప్రత్యర్థులపై పైచేయి కోసం పార్టీలు శ్రమిస్తున్నాయి. ఏ విధంగా పనిచేస్తే నెగ్గుకురావచ్చో కార్పొరేట్ వ్యూహకర్తలు మేధోసాయం చేస్తారు. ఈ వ్యూహకర్తల కోసం వివిధ రాజకీయ పార్టీలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి.

వ్యక్తులకు కూడా స్ట్రాటజీ టీమ్‌లు

స్ట్రాటజీ బృందాలను పార్టీలే కాదు, వ్యక్తులు కూడా వాడుకోవచ్చు. అభ్యర్థి లేదా నాయకుల తరపున కూడా ఈ బృందాలు పని చేస్తున్నాయి. సీఎం బసవరాజు బొమ్మై, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తరపున వ్యక్తిగతంగా ప్రత్యేక బృందాలు పని చేస్తున్నట్లు తెలిసింది. కొందరు బడా ఎమ్మెల్యేలు కూడా ఇలా వ్యూహకర్తలను నియమించుకుని నియోజకవర్గంలో ఓటర్ల నాడి ఎలా ఉందో ఆరా తీస్తున్నారు. నేతల తరపున డిజిటల్ ప్రచారం, సోషల్ మీడియా, ప్రచార కార్యక్రమాలను కూడా ఈ వ్యూహ బృందాలు నిర్వహిస్తున్నాయి. ఇందుకు నేతలు భారీగానే ముట్టజెప్పాలి.

డబ్బులు కుమ్మరిస్తున్న పార్టీలు

ప్రస్తుత రాజకీయాలు పూర్తిగా కొత్త శైలిని అందుకున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ స్ట్రాటజీ టీమ్‌లపై నేతలు, పార్టీలు ఎక్కువగా ఆధారపడుతున్నాయి. క్షేత్ర స్థాయి నుంచి సమాచారాన్ని తెప్పించుకోవడం, అందుకు అనుగుణంగా ఎన్నికల కార్యాచరణ రూపొందించుకోవడం ప్రస్తుతం నేతలు చేస్తున్న పని.. ఈ క్రమంలో ఈ స్ట్రాటజీ టీమ్‌లకు ఎన్నికల నేపథ్యంలో మంచి డిమాండ్ ఏర్పడింది. రాజకీయ పార్టీలు కూడా ఈ బృందాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసేందుకు వెనుకాడడం లేదు.

ప్రజల్లో కలిసిపోయి సమాచార సేకరణ

కార్పొరేట్ శైలిలో స్ట్రాటజీ బృందాలు పనిచేస్తాయి. లోతుగా సర్వేలు చేపట్టడం, పోటీ అభ్యర్థి కార్యవైఖరి గుర్తించడం, ఓటర్ల మనోగతం తెలుసుకోవడం వంటివి ప్రధానంగా ఉంటాయి. ఈ సంస్థల సిబ్బంది ప్రజల్లో కలిసిపోయి సమాచారం సేకరిస్తారు. తద్వారా ఓటర్ల మనోగతం ఏ పార్టీకి అనుకూలంగా ఉందో తెలుసుకోవడంతో పాటు ఎలాంటి కార్యక్రమాలు, పథకాలు, హామీలు గుప్పిస్తే ప్రజల మనస్సులను తమ వైపునకు తిప్పుకోవచ్చో తదితర సమాచారాన్ని పార్టీలకు అందిస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారా అభిప్రాయాలను సేకరించే ప్రయత్నాలు కూడా సాగిస్తున్నాయి. 224 నియోజకవర్గాల్లో సమర్థవంతుడైన గెలుపు గుర్రాల వంటి అభ్యర్థులను పార్టీ అధిష్టానాలకు సూచిస్తాయి.



రిజర్వేషన్ల పొగలు సెగలు

- పలుచోట్ల బంజారాల ధర్నాలు

శివాజీనగర: ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ వివాదం రాష్ట్రంలో ఆందోళనలకు కారణమైంది. మంగళవారం వివిధ చోట్ల లంబాణి, బంజారా సముదాయం ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. టైర్లకు, నాయకుల దిష్టిబొమ్మలకు నిప్పు పెట్టి తెలిపారు. సోమవారం శివమొగ్గ జిల్లా శికారిపుర పట్టణంలో మాజీ సీఎం యడియూరప్ప ఇంటిని ముట్టడించడంతో ఆందోళనలకు బీజం పడింది. ఈ గొడవ వెనుక కాంగ్రెస్, జేడీఎస్ హస్తముందని బీజేపీ ఆరోపించగా, యడియూరప్ప అంటే సరిపడని బీజేపీ నాయకులే ధర్నాను చేయించారని కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ అన్నారు. ఇంతలోనే రాష్ట్రంలో పలు ప్రాంతాలకు ధర్నాలు విస్తరించాయి. శివమొగ్గ జిల్లా కుంచేనహళ్లిలో లంబాణి





శివమొగ్గ జిల్లాలో నిరసన

తండాకు చెందిన వందలాది మంది ధర్నా చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులను అడ్డుకొన్నారు. బాగలకోట జిల్లాలో బీళగి, హునగుందతో పాటు ఇతర 10కిపైగా తాండాల్లో ధర్నా చేశారు.

శాంతిభద్రతలపై సీఎం ఆదేశం

ఈ ధర్నాల వల్ల శాంతి భద్రతలకు భంగం కలగరాదని సీఎం బసవరాజ బొమ్మై హోంమంత్రి జ్ఞానేంద్రకి, డీజీపీ ప్రవీణ్‌సూద్, నిఘా చీఫ్ ఉమేశ్, శాంతిభద్రతల విభాగపు ఏడీజీపీ అలోక్‌కుమార్‌లకు ఆదేశించారు. బంజారాల జనాభా అధికంగా ఉన్న శివమొగ్గ, దావణగెరె, బాగలకోటె, బీదర్, కల్బుర్గి, బళ్లారి, రాయచూరు, కొప్పళ, హావేరితో పాటు ఇతర చోట్ల కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.



కలబుర్గిలో మంగళవారం జరిగిన మెగా జౌళి పార్క్ ప్రారంభోత్సవ దృశ్యం

మాడాళ్‌కు 5 రోజుల కస్టడీ

- లోకాయుక్త ముమ్మర విచారణ

బనశంకరి: లంచం కేసులో చెన్నగిరి బీజేపీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్పను లోకాయుక్త పోలీసులు విచారణ తీవ్రతరం చేశారు. విరూపాక్షప్పను సోమవారం రాత్రి తుమకూరు జిల్లా క్యాత్సంద్ర వద్ద అరెస్టు చేశారు. రాత్రి బెంగళూరులో లోకాయుక్త ఆఫీసులో ఉంచి భోజనం, నీటి బాటిల్‌ను, బెడ్‌షీట్‌ను అందజేశారు. టోపీ కావాలనడంతో ఇచ్చారు.

అర్ధరాత్రి 12 గంటల వరకు లోకాయుక్త అధికారులు విరూపాక్షప్ప పై ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. ఆయన నివాసంలో సోదాల్లో దొరికిన రూ.8 కోట్లు ఎక్కడ నుంచి వచ్చింది అనేది ప్రధానంగా ప్రశ్నించారు. డబ్బు కు సంబంధించిన ఆధారాలు ఇవ్వలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆయనను ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో విరూపాక్షప్పను హాజరుపరచగా, ఏప్రిల్ 1వ తేదీ వరకు లోకాయుక్త కస్టడీకి జడ్జి బీ.జయంత్‌కుమార్ ఆదేశాలిచ్చారు. దీంతో లోకాయుక్త అధికారులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

వరుణ, కోలారులో పోటీ చేస్తా: సిద్దు

మైసూరు: తాను పుట్టి పెరిగిన ఊరు అయిన వరుణలోనే చివరిసారి పోటీ చేయాలనే ఆశ ఉందని, అందుకే అక్కడే పోటీలో దిగుతా, అలాగే కోలారులో కూడా పోటీ చేస్తానని సీఎల్పీ నాయకుడు సిద్దరామయ్య అన్నారు. మంగళవారం మైసూరు నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కోలారు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని అక్కడి ప్రజలు, కార్యకర్తలు కోరుతున్నారని , కాబట్టి అక్కడ కూడా బరిలో ఉంటానని చెప్పారు. వరుణ నుంచి గెలిచినప్పుడు తాను సీఎం అయ్యానని, కాబట్టి లక్కీ, అన్ లక్కీ అని నమ్మకాలు లేవని చెప్పారు.

తన కుమారుడు యతీంద్ర ఎన్నికల్లో పోటీ చేయనని చెబుతున్నాడు, దీని పైన చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కాగా సిద్దు రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తానడడంపై ఆశ్చర్యం వ్యక్తమైంది. ఇందుకు హైకమాండ్ ఒప్పుకుంటుందా అనేది చర్చనీయాంశమైంది. సిద్దరామయ్య నిర్ణయంపై పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వినిపించడం గమనార్హం.

తిమ్మరాయ రథోత్సవం

బొమ్మనహళ్లి: బెంగళూరు శివార్లలో ఆనేకల్ పట్టణంలో చరిత్ర ప్రసిద్ధ తిమ్మరాయ స్వామి వారి బ్రహ్మరథోత్సవం మంగళవారం వేలాది మంది భక్తుల మధ్య నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తిని ముస్తాబు చేసి మేళతాళాల మధ్య తేరులో ప్రతిష్ఠించారు. నమో తిమ్మరాయా అని స్మరిస్తూ తేరును లాగారు. వేలాది మంది భక్తులకు స్థానిక సంఘాలు మజ్జిగ, పానకం, ప్రసాదాలను పంపిణీ చేశాయి.



అలంకరణలో తిమ్మరాయ మూల విరాట్



తేరు ఉత్సవంలో భక్తజనం

కీచక మాస్టారుకు దేహశుద్ధి



ఉపాధ్యాయుని అకృత్యాలను వివరిస్తున్న బాలలు



ఉద్యోగానికి చెడ్డపేరు.. మంజునాథ్

- పోక్సో చట్టం కింద కేసు

తుమకూరు: ప్రభుత్వ పాఠశాలలో బాలికలను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న కీచకుడు వంటి ఉపాధ్యాయునికి తల్లిదండ్రులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన తుమకూరు జిల్లాలోని మధుగిరి తాలూకాలోని దొడ్డేరి దగ్గర బొరుగుంటె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగింది. వివరాలు.... ఇక్కడ మంజునాథ్ అనే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. చదువు చెప్పడానికి బదులు విద్యార్థినులతో వెకిలి చేష్టలు చేయడం, వారిని తాకుతూ అసభ్యంగా ప్రవర్తించడం ఇతనికి ప్రవృత్తిగా మారింది.

బడికి రావాలంటే భయపడి..

ఉపాధ్యాయుని వల్ల పాఠశాలకు రావాలంటేనే బాలికలు భయపడే పరిస్థితి నెలకొంది. చదువు మీద దృష్టి పెట్టలేకపోయారు. కొందరు బాలికలు తల్లిదండ్రులకు మొర పెట్టుకోవడంతో మంగళవారం ఉదయం మంజునాథ్ రాగానే అతనికి దేహశుద్ధి చేశారు. తరువాత పోలీసులకు, విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యాశాఖ అధికారి తిమ్మరాజు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. సీఐ హనుమంతరాయప్ప, సీడీపీఓ అనిత వచ్చి విద్యార్థులను విచారించారు. టీచర్ మంజునాథ్ తప్పు చేసినట్లు తేలడంతో సస్పెండ్ చేశారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఎత్తినహొళె పథకంలో అక్రమాలు

- ఎమ్మెల్యే శివలింగేగౌడపై లోకాయుక్తలో ఫిర్యాదు



ఆధారాలతో బీజేపీ నేత రమేశ్

బనశంకరి: ఎత్తినహొళె పథకంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ మంగళవారం బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎన్ఆర్.రమేశ్, అరసికెరె ఎమ్మెల్యే శివలింగేగౌడపై లోకాయుక్తలో రెండు ఫిర్యాదులు చేశారు. అనంతరం లోకాయుక్త కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆధారాలు విడుదల చేశారు. అరసికెరె ఎమ్మెల్యే శివలింగేగౌడ, విశ్వేశ్వరయ్య జల మండలి తుమకూరు విభాగ చీఫ్ ఇంజనీర్ మాదర్, అసిస్టెంట్ ఇంజనీక్ అనంద్‌కుమార్, హాసన విభాగ ఇంజనీర్ రఘునాథ్, అరసికెరె ఉపవిభాగ ఇంజనీర్ రఘు, కేఆర్ఐడీఎల్ సంస్థ హాసన విభాగ ఇంజనీర్ సిద్దప్ప, అరసికెరె ఉపవిభాగ అసిస్టెంట్ ఇంజనీర్ విజయ్, అసిస్టెంట్ ఇంజనీర్ దీక్షత్, పంచాయతీరాజ్‌శాఖ అరసికెరె విభాగ ఇంజనీర్ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ బసవరాజు, జూనియర్ ఇంజనీర్ ఉమేశ్ ఇతర అవినీతి అధికారులపై ఫిర్యాదు చేశామన్నారు. నరేగా పథకంలో ఎమ్మెల్యే అధికారుల సహకారంతో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఈ కేసును సీఐడీకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్ఆర్.రమేశ్ డిమాండ్ చేశారు.

సహకార బ్యాంకు ఆస్తులు సీజ్

బనశంకరి: నగరంలో బోర్డు తిప్పేసిన శ్రీ గురు రాఘవేంద్ర సహకార బ్యాంక్ వేలాది కోట్ల రూపాయల కుంభకోణంలో రూ.114 కోట్ల ఆస్తులను ఈడీ సీజ్ చేసింది. ఆ బ్యాంకుకు చెందిన స్థలాలు, భవనాలు, వాణిజ్య- పారిశ్రామిక కట్టడాలు సహా రూ.3.15 కోట్ల బ్యాంకు బ్యాలెన్సును కలిపి 21 ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకుంది.

బీఎస్పీ అభ్యర్థుల జాబితా విడుదల

శివాజీనగర: రానున్న విధానసభ ఎన్నికలకు బీఎస్పీ 53 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో బీఎస్పీ రాష్ట్రాధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ... విధానసభ ఎన్నికల్లో బీఎస్పీ ప్రముఖ పాత్ర పోషించనుందని, పలు నియోజకవర్గాల్లో తాము గెలుపు సాధిస్తామన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి అధ్యక్షతన రాష్ట్ర ఇన్‌చార్జి మాజీ ఎంపీ డాక్టర్ అశోక్ సిద్ధార్థ, రాష్ట్ర కన్వీనర్లు మారసంద్ర మునియప్ప, నితిన్ సింగ్, దినేశ్ గౌతమ్, ఎం.గోపినాథ్, తాను ఢిల్లీలో జరిగిన సభలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. మళవళ్లి నుంచి తాను పోటీ చేస్తానని వెల్లడించిన ఆయన, మిగతా గురుమిట్కల్ నుంచి కే.బీ.వాసు, మధుగిరి నుంచి ఎస్.మధు, తిపటూరు నుంచి అశ్వత్థ నారాయణ, చామరాజనగర నుంచి హ.రా.మహేశ్, బేలూరు నుంచి గంగాధర్ బహుజన్, ఆనేకల్ నుంచి చిన్నప్ప చిక్కహెగడె, యలహంక నుంచి సందీప్ మారసంద్ర మునియప్ప పోటీ చేస్తారన్నారు.

న్యూస్‌రీల్

భర్త చేతిలో భార్య హతం

మైసూరు: భర్త అక్రమ సంబంధం పెట్టుకున్న విషయాన్ని భార్య ప్రశ్నించగా ఆమెను కిరాతకంగా చంపాడు. ఈ సంఘటన చామరాజనగర తాలూకాలోని ముద్నాకూడు గ్రామంలో జరిగింది. వివరాలు.. ఏసీ సౌమ్య(27), మహేష్ చంద్రగురు భార్యాభర్తలు. ఏడేళ్ల కిందట పెళ్లి జరగ్గా, ఐదేళ్ల కుమార్తె ఉంది. భర్తకు మరో మహిళతో అక్రమ సంబంధం ఉందని తెలిసి సౌమ్య తరచూ గొడవపడేది. పెద్దలు వారికి సర్దిచెప్పేవారు. అక్రమ సంబంధం మానుకోమని పెద్దలు చెప్పినా మహేష్‌లో మార్పు రాలేదు. సోమవారం ఇదే విషయమై భార్య గట్టిగా నిలదీయడంతో కోపోద్రిక్తుడైన మహేష్ కట్టె తీసుకుని భార్యను తీవ్రంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే కన్నుమూసింది. పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి దుండగున్ని అరెస్టు చేశారు.

ట్రాన్స్‌జెండర్లకు ఎన్నికల గుర్తింపు కార్డులు



మైసూరు: మైసూరు జిల్లాలో 212 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ కేవీ రాజేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా పంచాయతీ సమావేశం హాల్లో ట్రాన్స్‌జెండర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేసి మాట్లాడారు. ఓటు హక్కు ఎంతో అమూల్యమైనదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

5న కోలారులో రాహుల్‌గాంధీ సభ ?

శివాజీనగర: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఏప్రిల్ 5న కర్ణాటకకు రానున్నారు. కోలార్‌లో కాంగ్రెస్ నిర్వహించే భారీ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. కోలారులోనే గతంలో మోదీ అనే ఇంటిపేరున్నవారే ఎక్కువగా దొంగలుగా ఉన్నారని ఆయన ఆరోపించడం, ఇదే కేసులో గుజరాత్‌లో పరువు నష్టం దావాలో రెండేళ్ల జైలు శిక్ష, ఆపై ఎంపీ సభ్యత్వం రద్దు కావడం తెలిసిన విషయాలే. దీనిని ఖండిస్తూ ఆ రోజు ప్రసంగం చేసిన స్థలంలోనే మళ్లీ రాహుల్ సభ జరపాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెండ్

బనశంకరి: సీఐపై ఆరోపణలు చేసి రాష్ట్రపతి, ప్రధానికి లేఖ రాసిన ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. బెంగళూరు సుబ్రమణ్యనగర పోలీస్ స్టేషన్ సీఐ శరణగౌడ, పబ్, బార్‌ల నుంచి మామూళ్లు తీసుకుంటున్నారని ఇద్దరు కానిస్టేబుళ్లు ఏకంగా రాష్ట్రపతి, ప్రధానమంత్రికి లేఖ రాశారు. అయితే ప్రాథమిక విచారణలో ఇది పూర్తి అబద్ధమని తేలడంతో కానిస్టేబుల్స్ శివకుమార్, విజయ్‌రాథోడ్‌ను సస్పెండ్ చేశారు. మల్లేశ్వరం పోలీస్‌స్టేషన్ ఏసీపీ నేతృత్వంలో విచారణ చేపట్టారు.

ఓలేకార్‌పై అనర్హత వేటు వేయండి

యశవంతపుర: క్రిమినల్ కేసులో రెండేళ్లపాటు జైలుశిక్ష పడిన బీజేపీ ఎమ్మెల్యే నెహ్రూ ఓలేకార్‌పై కూడా అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తూ హావేరికి చెందిన బీజేపీ కార్యకర్త సంతోష్‌రెడ్డి గవర్నర్, శాసనసభ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. నెహ్రూ ఓలేకార్‌ను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీఎం, బీజేపీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 13న ప్రజాప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పు ప్రతిని ఆయన ఫిర్యాదులో జత పరిచారు.

దొడ్డ సరిహద్దులో హైటెక్ చెక్‌పోస్టులు



దొడ్డ సరిహద్దులో ఏర్పాటు చేసిన హైటెక్ చెక్‌పోస్టు

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దొడ్డ తాలూకా సరిహద్దుల్లో వాహనాల తనిఖీ, అక్రమ రవాణాలను అరికట్టేందుకు ఈసారి హైటెక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దొడ్డ తాలూకాలో ఆరు చోట్ల ఇలాంటి చెక్‌పోస్టులు తెరిచారు. హొసహుడ్య క్రాస్, చిక్కబెళవంగల పాఠశాల ముందు, ఆరూడి కనసవాడి రోడ్డులోని దొడ్డబెళవంగల క్రాస్ వద్ద, కేసీపీ కల్యాణ మండపం సర్కిల్, రాజఘట్ట గ్రామం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గతంలో పెండాళ్లతో చెక్‌పోస్టు నిర్మించేవారు. దీంతో చెక్‌పోస్టు సిబ్బంది వర్షం, గాలికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే ఈసారి గాలి, వానకు తట్టుకునే టార్పాల్‌తో చెక్‌పోస్టు నిర్మించారు. రాత్రిపూట కూడా వాహనాల తనిఖీ కోసం చుట్టూ లైట్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను అమర్చారు.

ఆ సంప్రదాయం వద్దంటూ ధర్నా



ఆందోళన చేస్తున్న హిందూ కార్యకర్తలు

యశవంతపుర: హాసన్ జిల్లా బేలూరు శ్రీ చన్నకేశవ రథోత్సవంలో ఖురాన్ పఠనం చేసే సంప్రదాయాన్ని అడ్డుకోవాలని హిందూ సంఘాల కార్యకర్తలు మంగళవారం బేలూరులో ఆందోళన చేశారు. ఏప్రిల్ 4, 5 రెండు రోజుల పాటు బేలూరు చన్నకేశవస్వామి రథోత్సవం జరుగుతుంది. అయితే తేరు లాగే రోజున ఖురాన్‌కు చదవడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సంవత్సరం నుంచి ఖురాన్ పఠనాన్ని రద్దు చేయాలని హిందూ సంఘాల కార్యకర్తలు రాస్తారోకో చేశారు. ఈ సమయంలో ముస్లిం యువకులు బైకులపై ఖురాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ వచ్చారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు. కొందరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రాంతంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

హైదరాబాద్- అరసికెరె మధ్య స్పెషల్ రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హాసన్ జిల్లా అరసికెరెకు వేసవి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-అరసికెరె-సికింద్రాబాద్ (07233/34) ఈ స్పెషల్ రైళ్లు శుక్ర, శనివారాల్లో నడుస్తున్నాయన్నారు. మార్చి 30 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఈ సర్వీసులు నడుస్తాయి. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, రాయచూర్, గుంతకల్లు, ఆదోని, అనంతపురం, ధర్మవరం, యలహంక మీదుగా అరసికెరెకు చేరుతుందన్నారు.

అలాగే హైదరాబాద్-అరసికెరె-హైదరాబాద్ (07265/66) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రతి మంగళ, బుధవారాల్లో రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు ఏప్రిల్ 4 నుంచి జూన్ 28 వ తేదీ వరకు నడుస్తాయన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, యలహంక, తుమకూరు మీదుగా అరసికెరెకు వెళ్తుందని తెలిపారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించం

- శికారిపురలో హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర

శివమొగ్గ: రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ శివమొగ్గ జిల్లా శికారిపురలో మాజీ సీఎం యడియూరప్ప నివాసంపై రాళ్ల దాడి ఘటన నేపథ్యంలో మంగళవారం హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర శికారిపుర చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్ల వెనుక ఎవరున్నారో గుర్తిస్తామని చెప్పారు. యడియూరప్ప ఇంటిపై దాడి రాజకీయ కుట్ర అని తెలిపారు. ఇది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఘటన కాదని, రాజకీయ ప్రత్యర్థులు పనేనని ఆరోపించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జరిగిందని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, పట్టణ వ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రంలోనే అత్యధిక ఎయిర్‌పోర్టులు

కృష్ణరాజపురం: శివమొగ్గ విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ ఇటీవల ప్రారంభించారు. దేశంలో అతి ఎక్కువగా విమానాశ్రయాలు ఉన్నది కర్ణాటకలోనే అని కేంద్ర విమానాయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. మంగళవారం నగరంలోని మహదేవపుర నియోజకవర్గంలో ఆవలహళ్లిలో ఈస్ట్ పాయింట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీజేపీ యువమోర్చా సదస్సులో పాల్గొని మాట్లాడారు. గత 9 సంవత్సరాల కాలంలో దేశంలో 74 విమానాశ్రయాలను నిర్మించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్ల పరిపాలనలో 74 విమానాశ్రయాలను మాత్రమే నిర్మించిందని అన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం 10 ఎయిర్‌పోర్టులను ప్రారంభించిందని తెలిపారు.

సగం ధరకే గ్యాస్ సిలిండర్!

యశవంతపుర: రాష్ట్రంలో జేడీఎస్ అధికారంలోకి వస్తే వంటగ్యాస్ సిలిండర్ ధరలను 50 శాతం తగ్గిస్తామని మాజీ సీఎం, జేడీఎస్ నాయకుడు హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చారు. మంగళవారం యశవంతపురలో పంచరత్న రథయాత్రలో మాట్లాడారు. కేంద్రం ఉచితంగా గ్యాస్‌ను అందిస్తుందని ఉజ్వల యోజన పథకాన్ని నమ్మిన మహిళలు ఒక సిలిండర్ తీసుకున్న తరువాత షాక్‌కు గురయ్యారు. ఇప్పుడు సిలిండర్ ధర వెయ్యి రూపాయలు దాటిందని కుమారస్వామి ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఏటా ఐదు సిలిండర్లు ఉచితంగా, మరో 10 సిలిండర్లు సగం ధరకు అందిస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రతి నెల రెండు వేలు ఇస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల దీర్ఘకాలిక డిమాండ్‌ను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

జిల్లాల్లో టెక్స్‌టైల్ పార్కులు: సీఎం

శివాజీనగర: రాష్ట్రంలో 25 జిల్లాల్లో టెక్స్‌టైల్ పార్కులను స్థాపిస్తామని సీఎం బొమ్మై తెలిపారు. మంగళవారం కల్బుర్గిలో పీడీఏ ఇంజినీరింగ్ కాలేజీ సభా మందిరంలో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించారు. రాయచూరు, విజయపుర జిల్లాల్లో తొలి పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కును స్థాపిస్తాం, ఆ తరువాత మిగతా జిల్లాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. కాగా మరో ఐదు సంవత్సరాల్లో అన్ని విద్యాసంస్థలు ఐఐటీ తరహాలో ఉంటాయని సీఎం అన్నారు. బెంగళూరు జ్ఞానజ్యోతి సభా మందిరంలో తొమ్మిది నూతన విశ్వవిద్యాలయాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఐఐటీలను వెతుక్కుని వెళ్లకుండా ఇక్కడే ఐఐటీ వంటి విద్యాలయాలను సృష్టిస్తామన్నారు.

రోడ్డు పనులకు అంకురార్పణ



పాల్గొన్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి తదితరులు

గంగావతి: భారీ వర్షానికి అళ్లళి నుంచి గిణిగెర వరకు దెబ్బ తిన్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి భూమిపూజను నెరవేర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలకు తన హయాంలో రోడ్లను నిర్మించామన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానన్నారు. గ్రామ ప్రముఖులు శంకరప్ప, విజయ్‌కుమార్, ప్రకాశ్ కడగద్, లక్ష్మణ అళ్లళి, మారుతీ శరణేగౌడ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహబూబ్ నగర్‌లో రూ.1 లక్ష నిధులను తాయమ్మ దేవస్థాన అభివృద్ధి కమిటీ వారికి అందజేశారు.

కొత్త విద్యా విధానానికి శ్రీకారం

రాయచూరు రూరల్ : వర్సిటీలో నూతన విద్యా విధానాన్ని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఆన్‌లైన్ ద్వారా రిమోట్‌తో ప్రారంభించారు. మంగళవారం వర్సిటీలో శిలాఫలకాల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యా శాఖలో నూతనంగా ఏడు వర్సిటీలను అప్‌గ్రేడ్ చేశామని సీఎం బొమ్మై తెలిపారు. వర్సిటీల్లో నూతన పరిశోధనలు, ఆవిష్కారాలు, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు డిగ్రీ, పీజీ పట్టాలకు పరిమితం కాకుండా జ్ఞానార్జనకు ముందుండాలన్నారు. వైస్ చాన్స్‌లర్ హరీష్ రామస్వామి, అధికారులు బిరాదార్, విశ్వనాథ, యత్రిస్వామి, నుస్రత్ ఫాతిమా, పార్వతి, భాస్కర్, రాఘవేంద్ర, అనిల్, పంపాపతిలున్నారు.

నవమికి కోలాటం కసరత్తు

బళ్లారిఅర్బన్: నగరంలో ఈనెల 30వ తేదీ గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని మహిళలు ముందస్తుగా మంగళవారం కోలాటం ప్రదర్శనపై కసరత్తు ప్రారంభించారు. రెడ్డి వీధి ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద మమతా మహిళా బృందంతో కలిసి కోలాటం, భరతనాట్యం, క్లాసికల్ డ్యాన్స్, వివిధ నృత్యాల కసరత్తును మాస్టర్ ప్రతిమ నిర్వహించారు. మూడు రోజులుగా సీతారాముల కల్యాణోత్సవం రోజున వేడుకలు జరుపుకునేందుకు మహిళలు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత మహిళలు మమత, నిర్మల, రుక్మిణి, సువర్ణ, గాయత్రి, లక్ష్మీ, శృతిలతో పాటు చిన్నారులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కార్యకర్తల చేరిక

రాయచూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు బాబురావ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలను వీడి బీజేపీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం విరివిగా అభివృద్ధి పనులను చేసిందని వివరించారు.

రిజర్వేషన్లలో ముస్లింలకు మోసం

రాయచూరు రూరల్: బీజేపీ సర్కార్ రాష్ట్రంలో మైనార్టీలకున్న 4 శాతం రిజర్వేషన్లను ఇతర వర్గాల వారికి కేటాయించి మోసం చేసిందని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి ఆరోపించారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మైనార్టీల రిజర్వేషన్లను తొలగించడం తగదన్నారు. నేతలు శివశంకర్, విశ్వనాథ్ పట్టి, యూసఫ్ ఖాన్‌లున్నారు.

సమాజ సేవా భార్గవ ప్రశస్తి ప్రదానం

కంప్లి: హొసపేటె సంగీత భారతి అధ్యక్షులు పీ.కల్లంభట్ ఆధ్వర్యంలో పట్టణంలోని భారతి శిశు విద్యాలయపు విజ్ఞాన ఉపాధ్యాయుడు ఎస్.శ్యామసుందరరావుకు సమాజ సేవా భార్గవ ప్రశస్తిని అందించి సత్కరించారు.

విద్యా విలువలకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ రామనాథం నాయుడు

అనంతపురం: మైసూరులోని కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న అధ్యాపకులను అకడమిక్ పరంగా ఉత్తేజితులను చేయడానికి ఈ సంవత్సరం నుంచి అకాడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డు, బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డును వర్సిటీ తరఫున ప్రదానం చేయనున్నట్లు వీసీ ప్రొ.శరణప్ప వి.హలసె తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది అకడమిక్ పరంగా ప్రథమవరుసలో నిలిచిన తెలుగు విభాగాధిపతి ఆచార్య ఎం.రామనాథం నాయుడుకు అకాడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డును, అలాగే రూ. 25 వేల నగదు బహుమతిని అందజేశారు. అవార్డును అందుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో మొత్తం విద్యార్థులు 23,444 మంది
- వీరిలో బాలురు 11,634, బాలికలు 11,810
- ఈనెల 31 నుంచి ఎస్సెస్సెల్సీ పరీక్షలు షురూ



ఓ పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

సాక్షి, బళ్లారి: ఒక వైపు భగభగ మండే వేసవి ఎండలు ప్రారంభం కాగా మరో వైపు జిల్లాలో ఎన్నికల వేడి కూడా క్రమంగా పెరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి బళ్లారి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున ఆరుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించడంతో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ప్రతి విద్యార్థికి టెన్త్ పరీక్షలు కీలకమైన నేపథ్యంలో ఈ ఏడాది ఆ పరీక్షలను ఉత్సాహంగా రాసేందుకు విద్యార్థులు సిద్ధం అవుతున్నారు. గత రెండేళ్లుగా కరోనా వల్ల స్కూళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈఏడాది విద్యార్థులు రాత్రింబగళ్లు కష్టపడి చదివితే తమ బంగారు భవిష్యత్తుకు పునాది వేయనున్న టెన్త్ పరీక్షలు ఈనెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి.

మెరుగైన ఉత్తీర్ణత కోసం అధికారుల నిరీక్షణ

ఈ ఏడాది ముఖ్యంగా కరోనా తదితర సమస్యల ప్రభావం చూపనందున విద్యార్థులు పూర్తి సిలబస్‌ను చదువుకుని పరీక్షలకు సర్వసన్నద్ధం అవుతున్నారు. గత ఏడాది రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో బళ్లారి జిల్లా 28 స్థానానికి దిగజారి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా బళ్లారి జిల్లా పదో తరగతి పరీక్షల్లో తక్కువ ఉత్తీర్ణత సాధించడంతో విద్యాశాఖ అధికారులపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు అధికారులు, ఉపాధ్యాయ బృందం తీవ్రంగా కృషి చేసి విద్యార్థులను తీర్చిదిద్దడంలో కొంత మేర సఫలీకృతమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు బాలురు 11,634 మంది, బాలికలు 11,810 మంది హాజరు కానున్నారు.

71 పరీక్ష కేంద్రాలు సిద్ధం

పరీక్షల కోసం తూర్పు బ్లాక్‌లో 19, కురుగోడు, కంప్లిలో 27, సిరుగుప్పలో 14, సండూరు బ్లాక్‌లో 11 కేంద్రాలు కలిపి మొత్తం 71 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణకు 1048 తరగతి గదులు, 11,772 డెస్క్‌లు సిద్ధం చేశామని, ఒక్కో తరగతి గదిలో 24 మంది విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. గత రెండేళ్ల నుంచి కరోనా నేపథ్యంలో మాస్క్ తప్పనిసరి నిబంధన విధించామని, ఈసారి అలాంటి నిబంధనలు ఏమీ లేవన్నారు. వారి ఇష్ట ప్రకారం మాస్క్ వేసుకోవచ్చు లేకపోయినా పరీక్షలకు హాజరు కావచ్చని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాసే 1616 కేంద్రాల వద్ద పర్యవేక్షణ చేపట్టేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఈసారి 10వ స్థానం ఆశిస్తున్నాం

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆందానప్ప సాక్షితో మాట్లాడుతూ ఈనెల 31 నుంచి ప్రారంభమవుతున్న టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో 10 స్థానంలో ఉండేందుకు విద్యార్థులను తీర్చిదిద్దామన్నారు. ఏడాది నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు బాగా చదివిన వారిని గుర్తించి వారిని వివిధ రకాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం వల్ల ఆశించిన మేరకు ఉత్తీర్ణత శాతం మెరుగుపడుతుందనే నమ్మకం ఉందని అన్నారు.

పరీక్షల నిర్వహణపై సమీక్ష

రాయచూరు రూరల్ : ఈనెల 31 నుంచి టెన్త్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని దేవదుర్గ తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పరీక్ష కేంద్రాల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలూకాలో 16 కేంద్రాల్లో పరీక్ష రాసే 4233 మంది విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్భయంగా పరీక్షలు రాసే వీలు కల్పించాలన్నారు. సమావేశంలో బీఈఓ సుఖదేవ్, పురసభ ముఖ్యాధికారి సాబణ్ణ, శివరాజ్, శ్రీనివాస్‌లున్నారు.

ఆర్డీఏ పనుల కేటాయింపు తగదు



మాట్లాడుతున్న బషీరుద్దీన్

రాయచూరు రూరల్: ఆర్డీఏ పనులను నిర్మితి, క్యాషుటెక్ కంపెనీలకు అప్పగించడం తగదని బషీరుద్దీన్ ఆరోపించారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర ప్రాధికార రూ.10.20 కోట్లతో చేపట్టనున్న ఆలయాలకు కమానుల(ఆర్కిటెక్) నిర్మాణ పనులను జెడ్పీ, నగరసభ, పీడబ్ల్యూడీ, ఇతర ఏజెన్సీలకు కేటాయించకుండా భవనాల నిర్మాణాలు చేపట్టే నిర్మితి, క్యాషుటెక్ కంపెనీలకు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిర్మాణాలు చేయడానికి అవకాశం లేకున్నా నిధుల దుర్వినియోగానికి, కమీషన్లకు ఆశపడి ఎమ్మెల్యే పనులు చేయించారని ఆరోపించారు. నగరసభ, జెడ్పీ, టీపీ, పీడబ్ల్యూడీ శాఖల అనుమతి లేకుండా కమానులను నిర్మించడాన్ని ఖండించారు. ఈ విషయంలో జిల్లాధికారి నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు.

కేఆర్‌పీపీ విజయానికి 101 డోళ్లు అందజేస్తా



కేఆర్‌పీపీకి ఇచ్చే డోలును కొడుతున్న అభిమాని యమనూరప్ప పుండేగౌడ

బళ్లారిఅర్బన్: వచ్చే ఎన్నికల్లో కేఆర్‌పీపీ విజయం సాధించాలని 101 డోళ్లను అందజేస్తానని గంగావతి కురుబ సమాజానికి చెందిన యమనూరప్ప పుండేగౌడ తెలిపారు. ఆయన మంగళవారం పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. కేఆర్‌పీపీ సంస్థాపకుడు గాలి జనార్దన్‌రెడ్డికి ఇటీవల 101 గొర్రెను ఇచ్చానన్నారు. వాటిని గొర్రెల శాలలో పెంచుతున్నారన్నారు. బళ్లారి నగర కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణ గెలుపు కోసం మొదట ఒక డోలు అందించి నామినేషన్ వేసేలోపు మిగిలిన 100 డోళ్లను జనార్దన్‌రెడ్డికి అప్పగిస్తానన్నారు. బీరలింగేశ్వర స్వామి వారికి ఆశీర్వాద పూజలు నిర్వహించి ఈ బీరప్ప డోలును అందిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పార్టీ అభిమానులు విరుపాక్షి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

31 వరకు ఎడమ కాలువకు నీరివ్వండి



నీటి సమస్యపై అధికారులకు వివరిస్తున్న రెడ్డి శ్రీనివాస్

గంగావతి రూరల్: తుంగభద్ర ఎడమ కాలువకు ఈనెల 31 వరకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని ఏపీఎంసీ సభ్యులు, కనకగిరి బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ బోర్డు అధికారులకు మనవి చేశారు. వివిధ కంపెనీలకు నీరు అందించడానికి తుంగభద్ర నదికి ఏప్రిల్ 1 నుంచి 10 వరకు 1200 నుంచి 1800 క్యూసెక్కుల నీటి విడుదలపై రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అప్పుడే వేసవి ఎండలకు డ్యాంలో నీటి నిల్వ తగ్గుతుండగా ఇలాంటి చర్యలు అశాస్త్రీయం అని తెలిపారు. మాజీ జెడ్పీ సభ్యులు అమరేశప్ప, టీపీ మాజీ అధ్యక్షులు సిద్దనగౌడ, కె.నాగేశ్వరరావు, ఆలపాటి సూర్యారావు, గోవిందు పాల్గొన్నారు.

నివాసులకు హక్కుపత్రాల పంపిణీ



హక్కుపత్రాలను అందించిన తహసీల్దార్ గౌసియాబేగం

కంప్లి: చాలా ఏళ్లుగా నివాసముంటున్న వారిదే నేల యోజన ద్వారా రెవెన్యూ గ్రామంగా పరివర్తించిన చిన్నాపుర గ్రామంలో 1.7 ఎకరాల ప్రైవేట్ భూమిలో గత 50 ఏళ్లుగా ఉంటున్న 30 కుటుంబాలకు హక్కుపత్రాలను తహసీల్దార్ గౌసియాబేగం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హక్కుపత్రాలు పొందిన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో రిజిస్టర్ చేసుకొని 9/11 దాఖలాలు పొందాలన్నారు. అనేక ఏళ్లుగా నివాసముంటున్నా స్థలం హక్కుపత్రాలు దొరకడం లేదని, ప్రభుత్వం చొరవ తీసుకొని హక్కుపత్రాలు అందించిందన్నారు. ఈ సందర్భంగా మెట్రి జీపీ అధ్యక్షులు తిమ్మప్ప, ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి జడేగౌడ, సభ్యురాలు నాగమ్మ కుశాలప్ప, పీడీఓ శ్రీశైలగౌడ, ఆర్ఐ గణేష్, వీఏ శివరుద్రయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గాలి' ముమ్మర ప్రచారం



పార్టీ గుర్తును చూపుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: తాలూకాలోని పలు గ్రామాల్లో మంగళవారం కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి తమ పార్టీ గుర్తును ప్రజలకు పరిచయం చేస్తూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వెళ్లిన ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు ప్రజలు పూల వర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ప్రచార సభను ఏర్పాటు చేసి తమ పార్టీ ప్రణాళికను, చేపట్టే అభివృద్ధి పనుల గురించి వివరించారు. తమ పార్టీకి ఫుట్‌బాల్ గుర్తు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఈ గుర్తుకు ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి సమక్షంలో పలు పార్టీలకు చెందిన వారు వందలాది మంది కేఆర్‌పీపీలో చేరారు.

రాళ్లదాడి రాజకీయ ప్రేరితం

హుబ్లీ: మాజీ సీఎం యడియూరప్ప ఇంటిపై రాళ్లదాడి ఘటన రాజకీయ ప్రేరేపితం అని హుబ్లీ ధార్వాడ పశ్చిమ ఎమ్మెల్యే అరవింద బెల్లద తెలిపారు. నగరంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్‌కు సంబంధించి బంజార వర్గాల్లో నెలకొన్న ఆందోళనతో ఈ రాళ్లదాడి చేశారన్నారు. తనపై ఎవరు పోటీ చేసినా ఈసారి ఎక్కువ ఓట్ల తేడాతో తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

అగ్ని బన్ని రాయ జయంతి



చిత్రపటానికి పూజ చేస్తున్న అధికారులు

కంప్లి: తిగళ సముదాయ మూలపురుషుడు అగ్ని బన్నిరాయస్వామి సిద్ధాంతాలు, ఆదర్శాలను అలవరుచుకోవాలని తహసీల్దార్ గౌసియాబేగం తెలిపారు. ఆమె తాలూకా కార్యాలయంలో అగ్ని బన్నిరాయస్వామి జయంత్యుత్సవంలో పాల్గొని మాట్లాడుతూ దార్శనికుల జీవన సందేశాలు సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. ఉపతహసీల్దార్, ఆహార నిరీక్షకులు విరుపాక్షిగౌడ, ఆర్ఐ గణేష్, శిరస్తిదార్ పంపాపతి, ఎస్‌డీ రమేష్, వీఏ గిరీష్‌కుమార్, విజయకుమార్, శివరుద్రయ్య, వనిత, రాధ, రోహిణి, సురేష్, హొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు రూరల్: నగరంలో అగ్ని బన్నిరాయ ఉత్సవాలను మంగళవారం అంబేడ్కర్ సర్కిల్‌లో కన్నడ సంస్కృతి శాఖాధికారిణి మంగళ నాయక్ ప్రారంభించారు. అనంతరం కన్నడ భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆచార విచారాలను భావి తరాలకు కొనసాగించాలన్నారు.

కోలారు: నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో మంగళవారం అగ్ని బన్నిరాయ జయంతిని వైభవంగా నిర్వహించారు. తహసీల్దార్ హర్షవర్ధన్, కన్నడ సంస్కృతి శాఖ ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ తర్వాతే బీజేపీ తొలిజాబితా

- మాజీ సీఎం జగదీష్ శెట్టర్



మాట్లాడుతున్న జగదీష్ శెట్టర్

హుబ్లీ: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత బీజేపీ అభ్యర్థుల తొలిజాబితా వెల్లడి అవుతుందని మాజీ సీఎం జగదీష్ శెట్టర్ తెలిపారు. హుబ్లీలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందే పార్టీ టికెట్ల జాబితా ప్రకటించబోమన్న ఆయన ప్రతి ఎన్నికల్లోను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇచ్చిన ఉదంతాలు ఉన్నాయన్నారు. ఈసారి సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వబోమన్న వ్యాఖ్యలు ఎవరు, ఎందుకు సృష్టించారో తెలియదన్నారు. వయస్సు, గెలిచే సత్తా తదితర కారణాలతో కొందరికి టికెట్ రాకపోవచ్చన్నారు. మరికొందరు పోటీ నుంచి స్వచ్ఛందంగా విరమించుకోవచ్చన్నారు. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ విషయంలో తప్పుగా అర్థం చేసుకున్న వారే యడియూరప్ప ఇంటిపై దాడికి పాల్పడ్డారన్నారు. దీనిపై మంత్రివర్గ ఉప సమితిని ఏర్పాటు చేశారన్నారు. అందరి విశ్వాసాన్ని పరిగణలోకి తీసుకొని రిజర్వేషన్లపై ఆ నిర్ణయం తీసుకున్నారన్నారు. చాలా కాలం నుంచి ఈ రిజర్వేషన్‌పై డిమాండ్ ఉందన్నారు. వర్గీకరణపై గందరగోళం వల్ల రాళ్ల దాడి జరిగిందన్నారు. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ కూడా రాజకీయం చేస్తోందన్నారు. రాహుల్‌గాంధీ వల్ల కాంగ్రెస్‌కు తీరని నష్టం అన్నారు. రాహుల్‌గాంధీ ఎక్కడెక్కడ పర్యటిస్తారో అక్కడ ఆ పార్టీకి నష్టమే తప్ప బీజేపీకి ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

కోలారు వార్తలు...

ప్రభుత్వ దాఖలాల్లోకి రెవిన్యూ గ్రామాలు




హక్కుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీనివాసపురం: కొత్త రెవిన్యూ గ్రామాల పేర్లను మార్చి ప్రభుత్వ దాఖలాల్లోకి చేర్చుతున్నట్లు ఎమ్మెల్యే కెఆర్ రమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని తాలూకా కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు హక్కుపత్రాలను అందించి మాట్లాడారు. పూర్వం భూమి రాజ మహారాజుల ఆధీనంలో ఉండేది. అనంతరం జమీందారుల చేతుల్లోకి వచ్చిందన్నారు. పూర్వం కొంత మందిని గ్రామం నుంచి బయట ఉంచేవారు. ఇలాంటి జనవసతి ప్రదేశాలకు పేర్లు ఉండేవి కాదు. ఇలాంటి గ్రామాలను గుర్తించి కొత్త పేర్లు పెట్టి ప్రభుత్వ దాఖలాల్లో చేర్చిన తరువాత హక్కుపత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శిరీన్‌తాజ్, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం

బాగేపల్లి: నియోజకవర్గంలో ఉన్న చేలూరును ప్రత్యేక తాలూకాగా ప్రకటించింది కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చేలూరులో నూతన తాలూకా ఆఫీసు భవనాన్ని ప్రారంభించారు. బాగేపల్లికి, చింతామణికి సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉండగా, మధ్యలో అనుకూలం కోసం చేలూరులో తాలూకా కోసం ప్రజలు పోరాటం చేశారని చెప్పారు.

నేత్రపర్వంగా బ్రహ్మరథోత్సవం



పాల్గొన్న భక్తజనం

మాలూరు : లక్కూరులో కోదండరామస్వామి బ్రహ్మరథోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకం, హోమం, హవనం, వేదమంత్ర పారాయణం తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఉత్సవ మూర్తిని అలంకరించిన రథంలో ప్రతిష్టించి గ్రామంలోని ప్రముఖ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాన్న కాదు.. నర హంతకుడు

- కత్తితో పొడిచి చిన్నారి కొడుకు హత్య
- కోలారు జిల్లా నంగలిలో దారుణం
- ఏడాది కిందటే తల్లి ఆత్మహత్య



హత్యకు గురైన బాలుడు భువన్‌తేజ



భువన్‌తేజ(ఫైల్)



కిరాతక తండ్రి సుబ్రమణి

శ్రీనివాసపురం: కన్న తండ్రే కాలయముడై కొడుకును కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా నంగలి గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. భువన్ తేజ(8) తండ్రి చేతిలో హత్యకు గురైన బాలుడు. వివరాలు...బెంగళూరు యలహంకలో ఉంటున్న సుబ్రమణి నంగలికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరు కూలి పనులు చేసుకునేవారు. ఈ జంటకు కొడుకు భువన్ తేజ జన్మించాడు. అయితే యేడాది క్రితం భువన్ తల్లి ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. అప్పటి నుంచి భువన్‌తేజ తండ్రి దగ్గరే యలహంకలో ఉంటూ అక్కడి ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. అయితే రెండు రోజుల క్రితం ఇంట్లో తండ్రికి చెప్పకుండా బస్సులో నంగలిలోని తన అవ్వ ఇంటికి బయలుదేరి వచ్చాడు. మధ్యలో దారితప్పగా స్థానికులు, పోలీసులు అతని వివరాలడిగి అవ్వ ఇంటికి చేర్చారు.

నీ వెంట బెంగళూరుకు రాననడంతో..

అదే రోజు రాత్రి నంగలికి తన కొడుకును వెతుక్కుంటూ వచ్చిన తండ్రి సుబ్రమణి రాత్రికి తనతో బెంగళూరుకు రావాలని భువన్‌తేజను ఒత్తిడి చేయగా బాలుడు రానని చెప్పాడు. చివరికి తెల్లవారు జామున తాను బెంగళూరు వెళుతూ తనతో పాటు తీసుకు వెళ్లడానికి కొడుకు భువన్‌తేజను నిద్ర లేపాడు. తాను అవ్వతోనే ఉంటానని తెలిపాడు. దీంతో ఆగ్రహం కట్టలు తెంచుకున్న సుబ్రమణి కత్తి తీసుకుని భువన్ గొంతుపై పొడవడంతో తీవ్ర రక్తస్రావమై పసివాడి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. అవ్వ గట్టిగా కేకలు వేయగా స్థానికులు చేరుకున్నారు. సమాచారం అందుకున్న నంగలి పోలీసులు సుబ్రమణిని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని నెలల కిందట కూతురును, ఇప్పుడు మనవన్ని తీసుకుపోయావా దేవుడా అని వృద్ధురాలు విలపించడం చూసి అందరి కళ్లు చెమర్చాయి.

రాజకీయ లబ్ధి కోసమే రిజర్వేషన్ సౌకర్యం

- సీఎం ఇబ్రహీం ఆరోపణ

మాలూరు : రాష్ట్రంలో చట్టాలపై అవగాహన లేకుండా పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం వివిధ సముదాయాలను ప్రలోభ పెట్టే ఉద్దేశంతో రాజకీయ లబ్ధి కోసం రిజర్వేషన్ సౌకర్యాన్ని అందించిందని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం ఇబ్రహీం ఎద్దేవా చేశారు. మంగళవారం పట్టణంలోని మాలూరు-కోలారు మెయిన్ రోడ్డులోని సర్కస్ మైదానంలో నిర్వహించిన తాలూకా జేడీఎస్ యువ మహిళా సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ సౌకర్యంలో బంజారా, ముస్లిం సముదాయానికి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా జేడీఎస్ యువ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి, ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, మాలూరు జేడీఎస్ అభ్యర్థి జీఈ రామేగౌడ తదితరులు పాల్గొన్నారు.

మా ఎమ్మెల్యేలకు డీకేశి ఫోన్లు

యశవంతపుర: బీజేపీ ఎమ్మెల్యేలకు కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఫోన్ చేసి కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానిస్తున్నట్లు సీఎం బసవరాజ బొమ్మై ఆరోపించారు. ఆయన మంగళవారం బెళగావిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో టికెట్ ఇస్తాం రమ్మని అనేక మందికి డీకేశి ఫోన్ చేస్తున్నారని అన్నారు.

సీసీ రోడ్ల పనులకు భూమిపూజ



పాల్గొన్న ఎమ్మెల్యే బసవరాజ్, గ్రామ ప్రముఖులు

గంగావతి: కనకగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బసవరాజ్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెసరట్టి హంచనాళ, బట్ర హంచనాళ క్యాంప్, మరకుంబి తదితర పలు గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రముఖులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆప్ జాగృతి అభియాన్



నిర్వహిస్తున్న ఆప్ నాయకులు, కార్యకర్తలు

కంప్లి: రాష్ట్రంలో అవినీతిని తరిమికొట్టడంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)దే అంతిమ విజయమని క్షేత్ర ఆప్ కార్యదర్శి హెచ్.ప్రహ్లాద్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఉద్భవ గణపతి ఆలయం నుంచి ప్రారంభించిన పార్టీ జాగృతి అభియాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటర్లు అవినీతిపరుల బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు. అన్ని పార్టీలకు అధికారం ఇచ్చిన ఓటర్లు రాష్ట్రంలో ఒకసారి ఆప్‌కు కూడా అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం ఆప్ జిల్లా సంపర్క అధికారి మహ్మద్ రషీద్ మాట్లాడుతూ త్వరలో కంప్లి క్షేత్ర అభ్యర్థి పేరును ప్రకటిస్తారన్నారు. ఆప్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉచిత విద్యుత్, తాగునీరుతో పాటు అనేక మౌలిక సౌకర్యాలు అందించి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం తగ్గిస్తామన్నారు. అభియాన్ ప్రధాన వీధుల గుండా సాగగా, డాక్టర్ పునీత్‌రాజకుమార్ సర్కిల్‌లో సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆప్ ప్రముఖులు మోదుపల్లి రామమూర్తి, కార్యకర్తలు ప్రవీణ్, కే.గురురాజ్, పరశురాం, వీరేష్, ఉమాదేవి, లక్ష్మీదేవి, కవిత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మండలికి డిమాండ్

బళ్లారిఅర్బన్: వెనుకబడిన ఉప్పార సమాజాభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని కర్ణాటక భగీరథ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు యూ.ఉరుకుందప్ప పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల జనాభా కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన తమ సమాజానికి రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ స్థానం కూడా కట్టబెట్టాలన్నారు. ఉప్పార సమాజాన్ని అన్ని వర్గాలతో సమానంగా ఆదరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ సమాజం వారికి రాజకీయ పరంగా అవకాశం కల్పించాలన్నారు. సమాజ ప్రముఖులు ఉప్పార మల్లప్ప, సన్నభీమన్న, రిటైర్డ్ ఉపన్యాసకులు నరసన్న, కాళింగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల నుంచి వలసలు

కేజీఎఫ్: నియోజకవర్గంలో పలువురు బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు ఆ పార్టీలను వీడి ఎమ్మెల్యే రూపాశశిధర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం తాలూకాలోని బూడిదమిట్ట గ్రామంలో ఆ గ్రామ ప్రముఖులు, మహిళలు ఎమ్మెల్యే నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఆ పార్టీలను వీడి కాంగ్రెస్‌లోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూపా శశిధర్ మాట్లాడుతూ నియోజ వర్గంలో తాను నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఎంతో మంది కాంగ్రెస్‌లోకి చేరుతున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.10 కోట్ల వ్యయంతో చెక్‌డ్యాంలను నిర్మించామన్నా రు. దీని వల్ల నియోజకవర్గంలో అంతర్జలాల స్థాయి పెరిగి రైతులకు ఎంతో అనుకూలమైందన్నారు. ఈ సందర్భంగా జీపీ అధ్యక్షుడు రాంబాబు, మాజీ అధ్యక్షుడు నాగరాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వేస్టేషన్ ముట్టడికి యత్నం



శివమొగ్గ: సీనియర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పెద్ద ఎత్తున మంగళవారం శివమొగ్గ నగరంలో రైల్వే స్టేషన్ ముట్టడించడానికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి చేయి దాటకుండా పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసి ఆపై స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: మైసూరు జిల్లా టి. నరిసిపుర తాలూకా నుగ్గళికొప్పలు గ్రామ ప్రజలకు కొన్ని రోజులుగా చెమటలు పట్టిస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. గత కొద్దిరోజుల క్రితం నుగ్గళికొప్పలు గ్రామంలో చిరుత ప్రత్యక్ష కావడంతో గ్రామస్తులు హడలిపోయారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ సిబ్బంది బోనులు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

హక్కు పత్రాల పంపిణీ

మైసూరు: మైసూరు జిల్లాలో కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ గ్రామాల్లో అర్హులైన పేదలకు హక్కు పత్రాలను పంపిణీ చేసినట్లు కలెక్టర్ కేవీ రాజేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా పంచాయతీ సమావేశం హాల్లో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. 52 రెవెన్యూ గ్రామాల్లో 2,364 మంది పేదలకు హక్కులు పత్రాలను అందజేసినట్లు చెప్పారు.

రిజర్వేషన్ల రగడ

- జాతీయ రహదారిలో టైర్లకు నిప్పు



శివమొగ్గ: రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ మంగళవారం శివమొగ్గ తాలూకా కుంచెనహళ్లి గ్రామస్తులు శివమొగ్గ–శికారిపుర జాతీయ రహదారిలో ఒక్కసారిగా ధర్నాకు దిగారు. మంగళవారం ఉదయం 6 గంటలకే రోడ్డుపైకి చేరుకున్న గ్రామస్తులు జాతీయ రహదారిలో టైర్లకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఈ ఘటనలో జాతీయ రహదారిలో వందల వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి వారిని అక్కడి నుంచి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

మైసూరు: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మడికేరి నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని హోస లేఔట్‌లో అటవీ శాఖ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న భూమిక (28) ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు రెండేళ్ల క్రితం వివాహం కాగా, భర్త, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోకి దూకి వృద్ధురాలు...

మైసూరు: అనారోగ్యంగా ఉన్న మహిళ ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. చామరాజనగర జిల్లా కొళ్ళేగాల తాలూకాలోని కుణహళ్ళి గ్రామానికి చెందిన దివంగత సోమణ్ణ భార్య గౌరమ్మ (60) అనే వృద్ధురాలు మృతురాలు. ఆమె కుమార్తె ఇంటికి వెళ్ళి వస్తానని చెప్పి కుమారుని ఇంటి నుంచి బయల్దేరింది. మళ్లీ ఇంటికి తిరిగిరాలేదు. కొడుకు గాలిస్తూ వెళ్లగా హంపాపుర గ్రామంలో ఉన్న చెరువులో తల్లి మృతదేహం పడి ఉంది. అనారోగ్యం వల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు కొడుకు చెప్పాడు. కొళ్లేగాల పోలీసులు కేసు నమోదు చేశారు.

రౌడీలపై దాడులు

బనశంకరి: పట్టపగలు నడిరోడ్డుపై రౌడీలపై దాడులకు తెగబడ్డారు. రెండురోజుల క్రితం చామరాజపేటే దోబీఘాట్ వద్ద రౌడీషీటర్లు లొడ్డే ప్రవీణ్, స్వామిపై దుండగులు మరణాయుధాలతో దాడి చేసి ఉడాయించారు. డబ్బు లావాదేవీల విషయంలో దాడికి పాల్పడగా తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు దాడికి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దీనికి సంబంధించి కెంపేగౌడనగర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనపై దక్షిణ విభాగ డీసీపీ కృష్ణకాంత్ మాట్లాడుతూ... రౌడీషీటర్ ప్రవీణ్, స్వామిపై దాడికి పాల్పడిన నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

నీటిట్యాంక్‌లో మృతదేహం

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు తాలూకా మాడ్నూరు గ్రామానికి నీటిని సరఫరా చేసే ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో మృతదేహం బయటపడింది. మృతుడిని తోటదమూలెకు చెందిన దినేశ్ (18)గా గుర్తించారు. మద్యానికి బానిసైన దినేశ్ మూడు రోజుల నుంచి అదృశ్యమయ్యాడు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సిబ్బంది ట్యాంక్‌కు నీటిని వదలలేదు. మంగళవారం ట్యాంక్‌లో శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బెంగళూరులో ప్రతి ఒక్కరూ ఓటేయాలి

- ఎన్నికల ప్రచారానికి ఐదుగురు ఐకాన్స్



ఐకాన్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బనశంకరి: సిలికాన్ నగరంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల కార్యక్రమాలపై ప్రజలను జాగృతం చేయడానికి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్ అనుప్ శ్రీధర్‌తో పాటు ఐదుగురు ప్రముఖులను నమ్మ బెంగళూరు ఐకాన్స్‌గా నియమించినట్లు నగర జిల్లా ఎన్నికల అధికారి, పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. మంగళవారం నగరంలోని టౌన్ హాల్‌లో ఐకాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు వేసేలా నగర ప్రజల్లో ఆసక్తి పెంపొందించాలన్నారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని విధాలా సౌలభ్యాలు కల్పించినప్పటికీ కూడా ఓటుహక్కు వినియోగించుకునే వారి సంఖ్య తక్కువగా ఉంది. మీకు ఓటు వేయడం ఇష్టం లేకపోతే నోటాకు వేయవచ్చు, కానీ అందరూ ఓటేయాలని కోరారు.

ఐకాన్స్ వీరే

పోలీస్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధిక సంఖ్యలో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనాలని మనవిచేశారు. బెంగళూరు నగరం శరవేగంగా పెరుగుతోందని, కానీ ఓటు విషయంలో చాలా వెనుకబడి ఉందన్నారు. దీనిపై ప్రజల్లో జాగృతం చేసి అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపారు. బెంగళూరు ఐకాన్స్‌గా అనుప్ శ్రీధర్, క్రీడాకారులు శరత్ ఎం.గైక్వాడ్, తేజస్విని బాయ్, మోహన్‌కుమార్, బుడకట్టు గాయకుడు ఆనంద్ హెచ్ ఎంపికయ్యారు. ఐకాన్స్‌ను సన్మానించారు.

వీవీ పురంలో హత్య

బనశంకరి: యువకున్ని దుండగులు హత్య చేసిన ఘటన వీవీ పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. తావరకెరెకు చెందిన రమేశ్ (25) అనే యువకుడు బార్ బెండర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితుడు ఇంద్రేశ్‌తో న్యూ తరుగుపేటేకి వెళ్లగా దుండగులు చాకుతో దాడి చేశారు. ఇంద్రేశ్ తప్పించుకుని పారిపోయాడు. రమేశ్‌ను విచక్షణా రహితంగా పొడవడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాలిస్తున్నారు.

కర్ణాటక బ్యాంకు శాఖ ప్రారంభం

తుమకూరు: తుమకూరు నగరంలోని 29వ వార్డు మరళూరు లేఔట్ సదాశివ నగరలో కర్ణాటక బ్యాంక్ నూతన శాఖను సిద్ధగంగ మఠాధ్యక్షుడు శ్రీ సిద్ధలింగ స్వామి ప్రారంభించారు. ఖాతాదారులకు విస్తృతంగా సేవలు అందించాలని, కర్ణాటక బ్యాంకు మరిన్ని శాఖలు తెరచి అభివృద్ధి చెందాలని స్వామీజీ ఆకాంక్షించారు.

ఘాటి హుండీ ఆదాయం రూ. 92 లక్షలు



హుండీ నగదు లెక్కిస్తున్న సిబ్బంది

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో ప్రసిద్ధి శ్రీసుబ్రమణ్యఘాటి దేవాలయంలో హుండీ కానుకలు లెక్కించారు. ఈసారి అత్యధికంగా రూ.92 లక్షల ఆదాయం రావడం విశేషం. హుండీలో 57 గ్రాముల వెండి కానుకలు లభించాయి. రూ.92,15,526 నగదు లభించింది. ఇటీవలే దేవాలయంలో సప్తపది పేరున సామూహిక వివాహాలు జరిగినందున హుండీ ఆదాయం పెరిగింది. ఈ సందర్భంగా దేవాలయం ఈఓ కృష్ణప్ప, మేనేజర్ నంజప్ప సిబ్బంది హాజరయ్యారు.

బైక్ ట్యాక్సీలను ఆపకపోతే ఎన్నికలు బహిష్కరిస్తాం

శివాజీనగర: బెంగళూరు నగరంలో బైక్ ట్యాక్సీలను ఆపాలని ఆటో డ్రైవర్లు చేస్తున్న ఆందోళనలకు పరిష్కారం కనిపించడం లేదు. తాజాగా వారు ప్రభుత్వానికి మరో అల్టిమేటం ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఈనెల 20న ఒకరోజు ఆటో సమ్మె చేశారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. కుటుంబ సభ్యులతో కూడా వీడియోలు చేసి తమ కష్టాలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా ఎన్నికలను బహిష్కరించం తప్ప మాకు మరో మార్గం లేదని, ర్యాపిడో‌ల కారణంగా కనీసం పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని స్థితిలో ఉన్నామని ఆ వీడియోలు డ్రైవర్లు వాపోయారు. ఇదే వీడియోను రవాణా మంత్రి శ్రీరాములకు కూడా పంపి బైక్ ట్యాక్సీలను బ్యాన్ చేయాలని విన్నవించారు.

ఐస్‌క్రీమ్ గోడౌన్లో అగ్ని ప్రమాదం

యశవంతపుర: మంగళూరులో ఐస్‌క్రీం గోడౌన్లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రూ. కోట్ల విలువైన ఆస్తి నష్టం జరిగింది. నగర సమీపంలోని అడ్యార్‌లో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఎలాంటి ప్రాణహాని జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. గోడౌన్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలుడి అపహరణకు యత్నం

యశవంతపుర: రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారిని అపహరించడానికి యత్నించిన ఘటన చిక్కమగళూరు నగరంలో జరిగింది. త్రుటిలో బాలుడు తప్పించుకున్నాడు. ఆదివారం సాయంత్రం పొద్దుపోయిన తరువాత ఇక్కడి ఎంజీ రోడ్ ఫుట్‌పాత్‌పై కొందరు బాలురు ఆడుకుంటున్నారు. అటుగా వచ్చిన ఓ వ్యక్తి ఆడుకుంటున్న ఓ బాలుడిని ఎత్తుకోవడానికి యత్నించాడు. బాలుడు భయపడకుండా చాకచక్యంగా తప్పించుకున్నారు. బాలుడి సాహసం, తెగువను చిక్కమగళూరు ప్రజలు ప్రశంసిస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు నాలుగేళ్ల జైలు

మైసూరు: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారంటూ నమోదైన కేసులో మైసూరు ఉత్తర విభాగం సబ్ రిజిస్ట్రార్ గిరీశ్‌కు ఇక్కడి కోర్టు నాలుగేళ్ల జైలు, రూ. 2 లక్షల జరిమానా విధించింది. గురుమంటిస్వామి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు సబ్ రిజిస్ట్రార్‌పై 2014 ఏప్రిల్‌లో కేసు నమోదైంది. లోకాయుక్త పోలీసులు దర్యాప్తు చేసి 77 పేజీలతో నివేదికను లోకాయుక్త కోర్టుకు సమర్పించారు. విచారణలో భాగంగా 13 మంది సాక్షులను కూడా విచారణ చేశారు. ఆధారాలు రుజుకావడంతో లోకాయుక్త ప్రత్యేక న్యాయమూర్తి భాగ్య దోషికి నాలుగేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అరవింద లింబావళిని గెలిపించాలి



కృష్ణరాజపురం: మహాదేవపుర ఎమ్మెల్యే, మాజీ మంత్రి అరవింద లింబావళి ఆధ్వర్యంలో 2018 నుంచి 2023 వరకు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను పుస్తకంగా ముద్రించి కార్యకర్తలు ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి అరవింద లింబావళిని గెలిపించాలని కోరుతున్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



మండ్య: మండ్య జిల్లాలోని మద్దూరు పట్టణంలో వెలసిన ప్రఖ్యాత హోళె ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో హుండీలను లెక్కించారు. గత ఆరు నెలల్లో వచ్చిన నగదు రూ. 5.93 లక్షలుగా తేలింది. తహసీల్దార్ టి.ఎన్. నరసింహమూర్తి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కృష్ణరాజపురం: మహాదేవపుర నియోజకవర్గం పరిధిలోని మారతహళ్లి బీజేపీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు ఆకాశ్, ఎమ్మెల్యే అరవింద లింబావళి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే అరవింద లింబావళి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురసభ నూతన అధ్యక్షురాలికి సన్మానం



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని శ్రీ నగరేశ్వర స్వామి దేవాలయం ఆవరణంలో ఉన్న ప్రార్థనా మందిరంలో శరణ సాహిత్య పరిషత్ కదళి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పురసభ అధ్యక్షురాలు విమలా బసవరాజు, విజయపుర రోటరీ అధ్యక్షుడు హెచ్.ఎస్.రుద్రమూర్తి, జేసీఐ అధ్యక్షుడు ఎన్.సి మునివెంకటరమణప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాహిత్య పరిషత్ అధ్యక్షుడు అప్పారావు, అక్కొణి, ఉపాధ్యాయురాలు గిరిజాంబ, రుద్రేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివబాలయోగి ఆరాధనోత్సవం

బనశంకరి: శ్రీ శివబాలయోగి మహారాజ్ మహాసమాధి 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. జేపీ.నగర మూడోఫేజ్‌లోని శ్రీశివబాలయోగి మహారాజ్ ట్రస్ట్ ఆశ్రమంలో మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పూజలు, హోమాలు నిర్వహించారు. 12 గంటలకు ట్రస్ట్ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు దంపతులు, ట్రస్ట్ సభ్యులు, ఆలయ అర్చకులు బృందం పూర్ణాహుతి చేపట్టారు. 12.30 కుంభాభిషేకం, 1.30 భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ధ్యానం, 6.30 నుంచి 8 గంటల వరకు భజనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆరాధన మహోత్సవంలో పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న రాంబాబు దంపతులు

అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలి

బాగేపల్లి: అభివృద్ధి విషయంలో బాగేపల్లి ఎమ్మెల్యే ప్రజలకు నమ్మక ద్రోహం చేశారని, వచ్చే ఎన్నికల్లో బాగేపల్లి ప్రజలు బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఆరోగ్య వైద్య శాఖ మంత్రి సుధాకర్ అన్నారు. మంగళవారం చేలూరులో తాలూకా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తాలూకా ఏర్పాటు చేసింది సంకీర్ణ ప్రభుత్వమైనా, తాలూకాలకు కార్యాలయాలు నిర్మాణం చేసింది బీజేపీ అని గుర్తు చేసుకోవాలన్నారు. చేలూరు తాలూకాలో ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలని అన్నారు. అభివృద్ధి మంత్రం పఠించే ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్యకు చేలూరు కనిపించలేదని అన్నారు.



నలపాడ్‌పై మరో వివాదం

యశవంతపుర: యువ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ నలపాడ్ పుట్టిన రోజు సందర్భంగా అతని సహచరులు పార్టీ కోసం ఓ మేకను కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నలపాడ్ సహచరుడు రామచంద్ర అలియాస్ రామ నాయక్, శరత్‌కుమార్ అనే వ్యాపారి వద్ద నాలుగన్నర లక్షల విలువైన మేకను కొనుగోలు చేశాడు. ఏడాది కాలం నుంచి డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఈ విషయం నలపాడ్ దృష్టికి తెచ్చిన ఎలాంటి ప్రయోజనం లేదని శరత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు తీసుకోవటంలేదన్నారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మొబైల్ దుకాణంలో అగ్ని ప్రమాదం

బనశంకరి: విజయనగరలో ఓ మొబైల్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణంలో రాత్రంతా ఓ మొబైల్‌ను చార్జింగ్ పెట్టాడు. దీంతో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. మంగళవారం తెల్లారుజాము సమయంలో దుకాణం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనపై విజయనగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

కట్టకు మరమ్మతులు చేపట్టండి



తెగిపోయిన చెరువుకట్ట

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీలోని జంబుగాన్ చెరువు కట్ట తెగిపోయి చెరువుకు చేరే వర్షపునీరు పూర్తిగా బయటకెళ్లిపోయిందని, సంబంధిత శాఖాధికారులు చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ స్థానికులు విజ్ఞప్తి చేశారు. చెరువులో వర్షపునీరు నిల్వ ఉంచడం ద్వారా భూగర్భ జలవనరులు పెరిగి చుట్టుపక్కల బోరుబావుల్లో నీరు సంవృద్ధిగా ఉంటుందని, దీంతో పాటు తాగునీటి ఎద్దడి నివారించవచ్చునని, గతంలో చెరువు కట్ట తెగిపోవడంతో స్థానికులే మరమ్మతులు చేపట్టారని, గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మళ్లీ తెగిపోయిందని, అధికారులు వెంటనే చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలని ఆ వినతిపత్రంలో కోరారు.

యువకుడి ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరు పారిశ్రామికవాడ ఉప్కర్ రాయల్ గార్డెన్ ప్రాంతానికి చెందిన మనో (24) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చాడు. ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. బంధువులు చికిత్స కోసం బెంగళూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఓటింగ్ యంత్రాలు అప్పగింత



ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాన్ని తెరుస్తున్న దృశ్యం

హోసూరు: గత 15 ఏళ్లుగా వినియోగంలో ఉన్న ఓటింగ్ యంత్రాలను మంగళవారం అఖిలపక్ష పార్టీ నాయకుల సమక్షంలో బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్ సంస్థకు అప్పగించారు. జిల్లా ఎన్నికల అధికారి దీపక్ జేకబ్ సమక్షంలో జిల్లా కేంద్రం క్రిష్ణగిరి బీడీవో కార్యాలయంలో భద్రపరిచిన ఈవీఎంలను బయటకు తీసి 15 ఏళ్లకు పైబడిన యంత్రాలను భారత్ ఎలక్ట్రానిక్ సంస్థకు అప్పగించారు. కార్యక్రమంలో అధికారులు రాజగోపాల్, జయశంకర్, సంపత్, మురుగన్, రాజేష్, సెందిల్‌కుమార్, అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని భారతి దాసన్ నగర్ ప్రాంతంలో శ్రీ కల్యాణ కామాక్షి ఆలయ వార్షికోత్సవాలను రెండు రోజులుగా ఘనంగా జరిపించారు. ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం మంగళ హారతి, అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, పున్యాహవచనం, వేదపారాయణం, మహాపూర్ణాహుతి, 10 గంటలకు వర్షాభిషేకం, మహాదీపారాధన, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అంకరించి ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

పెనుభూతమైన అనుమానం

- భార్య దారుణహత్య

క్రిష్ణగిరి: భార్య నడతపై అనుమానించిన భర్త ఆమెను దారుణంగా హతమార్చిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... సూళగిరి తాలూకా మాదరసనపల్లి సమీపంలోని సెమ్మనగుళి గ్రామానికి చెందిన కార్మికుడు రంజిత్ (30), రోజా (29) దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యపై ఇటీవల అనుమానం పెంచుకున్న రంజిత్ తరచూ ఆమెతో గొడవపడేవాడు. అతని ప్రవర్తనతో విసిగిపోయిన రోజా కొద్ది రోజుల క్రితం తన పుట్టినింటికి వెళ్లిపోయింది. సోమవారం భార్య ఇంటికి వచ్చిన రంజిత్ ఆమెను సముదాయించి మరుసటిరోజు ఇంటికి తీసుకువచ్చాడు. అదే రోజు రాత్రి మళ్లీ గొడవ జరిగింది. తీవ్ర ఆవేశంతో రంజిత్ సుత్తితో భార్య తలపై బాదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

హోసూరు: రెండు ద్విచక్ర వాహనాలు నేరుగా ఢీకొన్న ప్రమాదంలో జౌళి వ్యాపారి మృతి చెందిన ఘటన మత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...క్రిష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలోని మాదరహళ్లి గ్రామానికి చెందిన జౌళి వ్యాపారి క్రిష్ణమూర్తి (45) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గాయపడిన క్రిష్ణమూర్తిని స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

అన్నాడీఎంకే సంబరాలు



హోసూరులో నాయకుల సంబరాలు

హోసూరు, కెలమంగలం: అన్నాడీఎంకే పార్టీ ప్రధాన కార్యదర్శిగా యడపాడి పళనీస్వామి కొనసాగవచ్చని కోర్టు తీర్పునివ్వడంతో అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. హోసూరు పట్టణంలోని అన్నాడీఎంకే పార్టీ కార్యాలయం వద్ద క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షతన టపాకాయలు పేల్చి అందరికీ స్వీట్లు పంచి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకార్యదర్శి మదన్, చిట్టిజగదీష్, రాము, నారాయణన్, శ్రీనివాసన్, హరీష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మంజు, రాజు, వాసుదేవన్, శ్రీధర్, లక్ష్మీహేమకుమార్, కుబేరన్, శంకర్, శిల్పశివకుమార్, దిల్‌షాత్ రహమాన్, శివరామ్, నవీన్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకొన్నారు. బాగలూరులో జిల్లా కౌన్సిలర్ ఆర్.కే. రవికుమార్ అధ్యక్షతన టపాకాయలు పేల్చి అందరికీ స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకొన్నారు. డెంకణీకోటలో మాజీ పట్టణ పంచాయతీ అధ్యక్షుడు నాగేష్ అధ్యక్షతన అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

పోటీ నుంచి తప్పుకునే ప్రసక్తే లేదు

- దేవనహళ్లి మాజీ ఎమ్మెల్యే పిళ్ల మునిశ్యామప్ప

దొడ్డబళ్లాపురం: దేవనహళ్లి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా తాను పోటీ చేయాలనుకుంటున్నానని, ఎట్టి పరిస్థితుల్లోనూ తన అభిప్రాయం మార్చుకోనని, పుకార్లను నమ్మవద్దని దేవనహళ్లి మాజీ ఎమ్మెల్యే పిళ్ల మునిశ్యామప్ప స్పష్టం చేశారు. దేవనహళ్లి నియోజకవర్గం నుంచి మాజీ కేంద్రమంత్రి కేహెచ్ మునియప్పను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంతో ఒకే సామాజిక వర్గానికి చెందినవారైన కారణంగా పిళ్ల మునిశ్యామప్ప పోటీ చేయరని తాలూకాలో చర్చ జరుగుతోంది. ఈ కారణంగా మంగళవారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మునిశ్యామప్ప క్లారిటీ ఇచ్చారు. తాను బీజేపీలోకి చేరే ముందు టిక్కెట్ ఇచ్చేలా ఒప్పందం చేసుకునే చేరానన్నారు. మునియప్పపై తనకు అపారమైన గౌరవం ఉందని ఇద్దరం ఒకటే సామాజికవర్గం వారమని, అయితే రాజకీయాలు వేరన్నారు. బీజేపీ నుంచి టిక్కెట్ ఇస్తారని ఆశిస్తున్నానని, ఇస్తే ఖచ్చితంగా పోటీ చేస్తానన్నారు. ఇప్పటికే తాలూకాలో పర్యటిస్తూ ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకున్నానన్నారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న పిళ్ల మునిశ్యామప్ప

విద్యార్థులకు లేఖన సామగ్రి వితరణ

బనశంకరి: బెంగళూరు శివాజీనగర ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ లేఖన సామగ్రిని ఉచితంగా అందజేశారు. దాత హరిబాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదరికం చదువుకు ఆటంకం కారాదని, ఒకవేళ విద్యార్థులు ఎవరైనా ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే తప్పకుండా ఆదుకుంటామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. టాపర్లుగా నిలిచే విద్యార్థులకు మంచి బహుమతులు ఇస్తానని ప్రకటించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంగస్వామినాయుడు మాట్లాడుతూ... దాతలు, తెలుగు పత్రికల అండతోనే ప్రభుత్వ తెలుగు పాఠశాలలు రాణిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థులతో దాత హరిబాబు, రంగస్వామి నాయుడు, ఉపాధ్యాయ బృందం

వైభవంగా గాదిరి పాలనాయక ఉత్సవం

పావగడ: తాలూకాలోని కరియమ్మన పాళ్య గ్రామంలో వెలసిన గాదిరి పాలనాయక, మారికాంబదేవి, జాజూరు పాల నాయక, కరియమ్మ దేవి జలధి ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటల సమయంలో గొడశాను భోగ, గొంచిగాళ్లు, తళవారి నాయక తదితర 12 మంది దేవుని అన్నదమ్ములు, పూజారులు దేవతలను ఆలయం నుంచి పూజారి బోరమ్మ భూమి వరకు భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా తరలించి జలధి పూజలు చేశారు. అనంతరం గ్రామ రైతులు గొర్రెలు, మేకలు, పశువులను పాము గూడు చుట్టూ ప్రదక్షిణలు మొక్కలు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పూజలు నిర్వహించారు.



దేవతల ఊరేగింపు దృశ్యం

క్లుప్తంగా...

రాజ్యసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సభ్యుడిగా విజయసాయిరెడ్డి

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా డాక్టర్ కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు ఉండే ఈ రెండు కమిటీల్లో ఇద్దరు తెలుగు ఎంపీలకు అవకాశం దక్కింది. పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వి.విజయసాయిరెడ్డి, పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో డాక్టర్ కె.లక్ష్మణ్ చోటు దక్కించుకున్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ పనుల కోసం రూ.13,112 కోట్లు ఖర్చు

- నూరు శాతం నిధులు ఎస్సీలకు చేరేలా అధికారులు పని చేయాలి
- నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కాంపొనెంట్ (సబ్‌ప్లాన్)కు కేటాయించిన నిధుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.13,112.36 కోట్లు(70.81శాతం) నిధులు ఖర్చు చేసినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. సబ్‌ప్లాన్ నిధుల వినియోగం మరింతగా పెరగాలని, ఎస్సీల కోసం కేటాయించిన నిధులన్నీ వారి సంక్షేమానికే ఉపయోగపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఎస్సీ సబ్‌ప్లాన్‌కు చెందిన 30వ నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సమావేశంలో 43 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని తమ శాఖల ద్వారా ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వ్యయాన్ని వివరించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రధానమైన శాఖలకు ప్రభుత్వం రూ.18,518.29 కోట్లను ఎస్సీ సబ్‌ప్లాన్ కోసం కేటాయించిందని తెలిపారు. అయితే, కొన్ని శాఖలు సబ్‌ప్లాన్ ద్వారా ప్రతిపాదించిన పనుల కోసం ప్రభుత్వం అదనపు బడ్జెట్‌ను కేటాయించడంతో మొత్తం రూ.20,605.44 కోట్లకు చేరిందన్నారు. సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో కొన్ని శాఖలు అంచనాలకు మించి ప్రగతిని సాధిస్తుండగా, మరి కొన్ని శాఖలు మాత్రం వెనుకబడి ఉన్నాయన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, డైరెక్టర్ కె.హర్షవర్ధన్, అడిషనల్ డైరెక్టర్ రఘురామ్, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుధ పాల్గొన్నారు.

కాపులకు 5 శాతం రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం


సాక్షి, అమరావతి: విద్య, ఉపాధి అవకాశాల్లో ఉన్నత వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టానికి అనుగుణంగా రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన చట్టాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 26కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి రావు రఘునందన్‌రావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య దాఖలు చేసిన ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. జోగయ్య తరఫున సీనియర్ న్యాయవాది పి.గంగయ్య నాయుడు వాదనలు వినిపిస్తూ.. కాపులకు 5 శాతం రిజర్వేషన్‌ను సుప్రీం కోర్టు సమర్థించిందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కోటాపై నిర్ణయాధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే కేంద్రం వదిలేసిందన్నారు. ప్రభుత్వ న్యాయవాది (జీపీ) బి. సత్య శివాజీ వాదనలు వినిపిస్తూ.. ఈ అంశంపై ఇప్పటికే పలు వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. దీంతో కౌంటర్ దాఖలుకు ధర్మాసనం గడువునిచ్చింది. ఈ వ్యాజ్యాన్ని ఇప్పటికే దాఖలైన వ్యాజ్యాలతో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

బలహీనవర్గాల రక్షణ కోసం చట్టం చేస్తాం : లోకేశ్

గోరంట్ల: టీడీపీ అధికారంలోకి వస్తే బలహీనవర్గాల రక్షణ కోసం చట్టం చేస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. 'యువగళం' పాదయాత్రలో భాగంగా లోకేశ్ మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో బడుగు, బలహీనవర్గాలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. ఆ రిజర్వేషన్‌ను చంద్రబాబు 34 శాతానికి పెంచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీల రిజర్వేషన్‌ను 10 శాతానికి కుదించారని పేర్కొన్నారు.

రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమ వ్యవహారాలకు సంబంధించిన కేసులో విచారించేందుకు సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఎండీ చెరుకూరి శైలజకు సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దర్యాప్తులో భాగంగా రామోజీరావు, శైలజను విచారించాల్సిన అవసరం ఉందని నిర్ధారించిన సీఐడీ వారిద్దరిని ఈ నెల 29న గానీ 31న గానీ లేదా ఏప్రిల్ 3న గానీ 6న గానీ విచారించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముందుగా సమాచారం అందజేస్తూ వారికి అనువైన తేదీని తెలియచేయాలని సూచించింది. రామోజీరావు, శైలజ వారి నివాసంలోగానీ కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసుల్లో పేర్కొంది. చిట్‌ఫండ్ చట్టం నిబంధనలను ఉల్లంఘించి నిధులు మళ్లించడంపై ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లపై సీఐడీ అధికారులు ఇప్పటికే కేసులు నమోదుచేసిన విషయం తెలిసిందే.



మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు విస్తృతంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులుగా పెట్టడం, ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరిస్తున్నట్లు ఆధారాలతో సహా వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఐపీసీ సెక్షన్లు 420, 409, 120 బి, 477 రెడ్‌విత్ 34, కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం–1982, ఆర్థిక సంస్థల రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో సీఐడీ అధికారులు నలుగురు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లను అరెస్టు చేశారు.

అదో ఆర్థిక నేర సామ్రాజ్యం...

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును చట్ట విరుద్ధంగా మళ్లించడం ద్వారా రామోజీరావు యథేచ్ఛగా ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. కేంద్ర ప్రభుత్వ చిట్‌ఫండ్స్ చట్టం–1982, రిజర్వ్‌బ్యాంకు చట్టం, ఏపీ ఆర్థిక సంస్థల డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టాలను ఉల్లంఘించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ బ్రాంచి కార్యాలయాల్లో స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో డిసెంబరులో నిర్వహించిన సోదాలతో ఈ అక్రమాల బాగోతం బట్టబయలైంది. సొమ్ములు రాష్ట్రంలోని చందాదారులవి కాగా ఆర్థిక ప్రయోజనాలు మాత్రం పొరుగు రాష్ట్రంలో మకాం వేసిన రామోజీరావువని వెల్లడైంది. రాష్ట్ర చందాదారుల కష్టార్జితానికి రక్షణ లేదని గుర్తించిన స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ దీనిపై సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ నిర్వహించిన సోదాల్లో మరిన్ని అక్రమాలు బయటపడ్డాయి. మరోవైపు స్టాంపులు– రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా ఓ చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా మార్గదర్శి చిట్ ఫండ్స్ ఆర్థిక నివేదిక (ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్)లను పరిశీలించగా పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఎంతోమంది చందాదారులు తాము మోసపోయినట్లు సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో ఈ అంశంపై దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు సీఐడీ నివేదించింది.

మార్గదర్శిలో గుర్తించిన అక్రమాలు ఇవీ..

అక్రమ డిపాజిట్లు..

రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ డిపాజిట్లను సేకరిస్తోంది. చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 శాతం నుంచి 5 శాతం వరకు చందాదారుడికి వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తున్నట్టే. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడాన్ని చట్టం నిషేధించింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ' ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరించింది. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రూ.15 వేల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించిన చరిత్ర రామోజీరావుది. అదే తరహాలో ప్రస్తుతం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో అక్రమ డిపాజిట్లు సేకరిస్తున్నారు.

నిధుల మళ్లింపు.. అక్రమ పెట్టుబడులు

చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా రామోజీరావు చందాదారుల సొమ్మును అక్రమ పెట్టుబడులకు మళ్లించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టింది. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్– హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపిస్తూ నిధులను అక్రమంగా మళ్లించారు. ఆ మూడు అనుబంధ కంపెనీల్లో రూ.1,05,80,000 పెట్టుబడి పెట్టినట్టు బ్యాలెన్స్ షీట్‌లో చూపించారు. అయితే ఆ కంపెనీల షేర్ హోల్డర్స్ జాబితా పరిశీలించగా ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాతో రూ.2 కోట్లు పెయిడ్ అప్ క్యాపిటల్‌గా పెట్టుబడి పెట్టినట్లు నిర్ధారణ అయ్యింది. బ్యాలన్స్ షీట్‌లో నోట్ నంబర్ 7 కింద రూ.459.98 కోట్లు చూపించారు. అయితే ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్టు పరిశీలనలో వెల్లడైంది. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైసీస్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది.

పోంజీ తరహా మోసం..

రామోజీరావు పోంజీ (గొలుసుకట్టు) తరహా మోసాలకు పాల్పడుతున్నారు. మార్గదర్శి సంస్థ చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యాజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

చందాదారుల హక్కులకు విఘాతం

రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తాలను నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ మేనేజర్లకు (ఫోర్‌మేన్) చట్టప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. రాష్ట్రంలో చందాదారులు చెల్లించిన మొత్తానికి బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు.

ఎగుమతుల వ్యాపారానికి ఏపీ కీలక మార్కెట్

- అమెజాన్ ఇండియా గ్లోబల్‌ట్రేడ్ డైరెక్టర్ భూపేన్ వాకంకర్
- అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రొపెల్ స్టార్టప్ యాక్సిలరేటర్–3 సీజన్ ప్రారంభం



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రాష్ట్రంలోని ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల వద్దకు చేర్చడానికి అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రొపెల్ స్టార్టప్ యాక్సిలరేటర్ మూడో సీజన్‌ను ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా గ్లోబల్‌ట్రేడ్ డైరెక్టర్ భూపేన్ వాకంకర్ చెప్పారు. విశాఖపట్నంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీజన్–3 వివరాలను తెలిపారు. అమెజాన్ ఈ–కామర్స్ ద్వారా ఎగుమతుల వ్యాపారానికి ఏపీ కీలక మార్కెట్ అని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి కొత్త విక్రేతలు, స్టార్టప్‌లు వచ్చి తమ ఎగుమతులను అమెజాన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరించవచ్చని పిలుపునిచ్చారు. ఈ సీజన్‌లో పాల్గొనే టాప్ 3 విజేతలకు ఈక్విటీ ఫ్రీ గ్రాంట్ కింద 1.5 మిలియన్ డాలర్లకుపైగా రివార్డు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఏపీలో ప్రపంచ స్థాయి ఎగుమతిదారులు రెండువేల మంది ఉన్నారని తెలిపారు. ఏపీ నుంచి ఎక్కువగా హస్తకళలు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, పట్టుచీరలు, చేనేత ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారని చెప్పారు. ఈ సీజన్ ద్వారా మరింతమంది ప్రపంచ స్థాయి ఎగుమతిదారులుగా గుర్తింపు పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. 2025 నాటికి భారత్ నుంచి 20 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయాలనే ధ్యేయంతో ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సీజన్‌లో ప్రవేశాలకు ఏప్రిల్ 30 చివరి తేదీ అని వెల్లడించారు. మరిన్ని వివరాలకు అమెజాన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

'ఆసరా'తో కొండంత భరోసా

- మరో 83 మండలాల్లో కొనసాగిన వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు
- సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేసిన పొదుపు సంఘాల మహిళలు



ఆలూరు నియోజకవర్గం ఆస్పరిలో 'థ్యాంక్యూ జగనన్న' అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు



బొబ్బిలి నియోజకవర్గం తెర్లాంలో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు రాష్ట్రమంతటా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఎక్కడికక్కడ పొదుపు సంఘాల మహిళలు సభలు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మరో 83 మండలాల్లో లబ్ధిదారులు సమావేశమై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళల పేరిట పొదుపు సంఘాల్లో ఉన్న రుణాన్ని నాలుగు దఫాలుగా మహిళల చేతికే అందిస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ హామీని నెరవేర్చారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,758 కోట్ల మొత్తాన్ని మహిళల ఖాతాల్లో జమ చేశారు. తాజాగా మూడో విడత కింద 7,98,395 స్వయం సహాయక సంఘాల్లోని 78,94,169మంది అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం రూ.6,419.89 కోట్లను అందజేస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సభల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొని పొదుపు సంఘాల మహిళలకు మంజూరైన డబ్బుల వివరాలను, సీఎం జగన్ సందేశాన్ని లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో లబ్ధిదారులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరాతో తమకు కొండంత భరోసా లభించిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

వ్యవసాయ విద్యార్థులకు ఉపకార వేతనాల విడుదల

సాక్షి, న్యూఢిల్లీ : స్ట్రెంగ్తెనింగ్, డెవలప్‌మెంట్ ఆఫ్ హయ్యర్ అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా (ఎస్‌డీహెచ్ఏఈఐ), నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ (ఎన్ఏహెచ్ఈపీ)లో భాగంగా 2021–22లో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో డిజిటల్ లైబ్రరీ, వర్చువల్ క్లాస్‌రూమ్స్ సహా పలు సదుపాయాలు సమకూర్చినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు పోచ బ్రహ్మానందరెడ్డి అడిగిన ప్రశ్నకు మంగళవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో సమాధానమిస్తూ.. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలోని 1013 యూజీ, పీజీ విద్యార్థులకు రూ.2.13 కోట్లు, వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీలో 306 యూజీ, పీజీ విద్యార్థులకు రూ.73 లక్షలు, వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో 204 యూజీ, పీజీ విద్యార్థులకు రూ.58 లక్షలను ఉపకార వేతనాలుగా విడుదల చేసినట్టు వెల్లడించారు.

ఏపీలో 83.27 కోట్లతో అభివృద్ధి

మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హారికల్చర్ (ఎంఐడీహెచ్) పథకంలో 2020–21 సంవత్సరంలో రూ.83.27 కోట్లు వెచ్చించినట్టు ఏపీ ప్రభుత్వం తెలిపిందని వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. ఈ మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యురాలు బీవీ సత్యవతి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లోక్‌సభ

వసతి గృహాల నిర్మాణానికి ప్రతిపాదనలు రాలేదు

ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ విద్యార్థుల నిమిత్తం 2007–2008 నుంచి 8 వసతి గృహాల నిర్మాణానికి అనుమతించామని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యురాలు గొడ్డేటి మాధవి ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఎస్టీ విద్యార్థుల నిమిత్తం 2002–03 నుంచి 2016–17 వరకు 30 వసతి గృహాలు అనుమతించామన్నారు. ఈ నిమిత్తం రూ.9.89 కోట్లు, రూ.8.87 కోట్లు ఏపీ ప్రభుత్వానికి విడుదల చేశామన్నారు. 2022–23లో ఎస్టీ విద్యార్థుల వసతి గృహాల నిర్మాణం నిమిత్తం ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదన్నారు.

విభజన హామీలు అమలు చేశాం

ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో పలు హామీలను అమలు చేశామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థలకు సంబంధించి చట్టంలో పదేళ్ల కాల పరిమితి ఉందన్నారు. హామీల అమలుపై కేంద్ర హోం శాఖ ఆయా మంత్రిత్వ శాఖలు, విభాగాలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని, సదరు సమావేశాలు 30 వరకు జరిగాయని తెలిపారు.

ఏపీలో 222 ఈవీ చార్జింగ్ స్టేషన్లు

ఆంధ్రప్రదేశ్‌లో 222 ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి క్రిషన్‌పాల్ గుర్జర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యురాలు చింతా అనూరాధ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పన్నుల వాటాగా ఏపీకి ఆరేళ్లలో 1.88 లక్షల కోట్లు

రాజ్యసభ

విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి పంకజ్ చౌదరి సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: జీఎస్టీ సహా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన పన్నుల మొత్తంలో ఏపీ వాటా కింద గడచిన ఆరేళ్లలో (2017 నుంచి 2023 మార్చి 10 వరకు) రూ.1,88,053.83 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాల వాటా కింద విడుదల చేస్తున్న పన్నుల ఆదాయం ఐదేళ్లుగా తగ్గుతూ వస్తోందా అని రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. 2017–18లో రూ.29,001.25 కోట్లు, 2018–19లో రూ.32,787.03 కోట్లు, 2019–20లో రూ.28,242.39 కోట్లు, 2020–21లో రూ.24,460.59 కోట్లు, 2021–22లో రూ.35,385.83 కోట్లు, 2022–23 మార్చి 10 నాటికి రూ.38,176.74 కోట్లు విడుదల చేసినట్టు వివరించారు.

మార్గదర్శి అక్రమాల డొంక కదలడంతో
రామోజీరావు బెంబేలు

- అందుకే 'దళితులపై దమనకాండ' అంటూ ఈనాడు అడ్డగోలు రాతలు
- ముసుగు దొంగలు బాబు, రామోజీకి ఇబ్బంది వస్తే దళితులే గుర్తొస్తారు
- దళితులపై దమనకాండ జరిగింది బాబు హయాంలోనే
- వాటన్నిటిపై రామోజీ ఎందుకు రాయలేదు?
- దళితుల భూములను కొట్టేసిన రామోజీ ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్నాడు
- జగన్ పాలనలో దళితులకు జరుగుతున్న మేలు అట్రాసిటీగా కనిపిస్తుందా?
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: మార్గదర్శి అక్రమాల డొంక కదిలి ప్రధాన ముద్దాయిగా నిరూపణ అయ్యే పరిస్థితి రావడంతో రామోజీరావు బెంబేలెత్తుతున్నాడని, అందుకే 'దళితులపై దమనకాండ' అంటూ 'ఈనాడు'లో అడ్డగోలు రాతలు రాస్తున్నాడని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున నిప్పులు చెరిగారు. ఆయన మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'దొంగ బాబుకు మద్దతుగా గజదొంగ రామోజీ తన రాతలతో వెర్రి కూతలు కూస్తున్నాడు. ముసుగు దొంగలైన వీరిద్దరికీ ఇబ్బంది వస్తే దళితులు గుర్తొస్తారు. గతంలో కాల్‌మనీ సెక్స్ రాకెట్‌ను పక్కదారి పట్టించేందుకు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటును చంద్రబాబు తెరమీదకు తెచ్చారు. ఇప్పుడు మార్గదర్శి కేసును మళ్లించేందుకు దళితులపై దమనకాండ అంటూ రామోజీ రాస్తున్నారు. రామోజీకి ఈనాడు పేపర్ పెట్టుకున్న ఇన్నేళ్లకు దళితులు గుర్తుకొచ్చారా? చంద్రబాబు హయాంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వెలివేతలు జరిగితే ఈనాడుకు ముచ్చటగా అనిపించాయా? జెర్రిపోతులపాలెంలో దళిత మహిళను వివస్త్రను చేసినా ఎందుకు రాయలేదు? అచ్చెన్నాయుడు మహిళను కాలితో తంతే ఏం చేశారు? గరగపర్రులో దళితుల వెలివేత, కారంచేడులో దళితులపై మారణహోమం జరిగినప్పుడు ఎందుకు రాయలేదు? నాడు దళితులపై జరిగిన దమనకాండకు కారకులైన నీ సొంత సామాజికవర్గం గురించి ఇప్పుడు రాయొచ్చు కదా రామోజీ' అంటూ ప్రశ్నించారు. 'ఫిల్మ్ సిటీ కోసం దళితుల భూముల్ని కబ్జా చేసినట్లు రామోజీపై ఇప్పటికీ కోర్టుల్లో కేసులు ఉన్నాయి. దళితులను మోసం చేసిన రామోజీ ఇప్పుడు చంద్రబాబుకు రాజకీయ పట్టం కట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవు. బాబు హయాంలో ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రూ.33,625.49 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపితే దానిలో దేనికోసం ఖర్చుచేశారో? అవినీతి ఎంత జరిగిందో రాసే దమ్ము రామోజీకి ఉందా? అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో దళితుల సంక్షేమానికి రూ.51,293 కోట్లు ఖర్చు చేసింది. డీబీటీ ద్వారా పైసా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమయ్యాయి. ఈ మంచిపై రాయడానికి రామోజీకి చేతులు కదలడం లేదు. బాబు హయాంలో దళితులకు జరిగిన అన్యాయం, సీఎం జగన్ పాలనలో జరుగుతున్న న్యాయంపై చర్చకు మేము సిద్ధం' అని మంత్రి సవాల్ విసిరారు.

తప్పు చేసింది కాబట్టే ఎమ్మెల్యే శ్రీదేవికి భయం

రాజకీయాల్లో అవకాశం కల్పించిన సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీని మోసం చేసింది కాబట్టే తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి భయపడుతోందని మంత్రి అన్నారు. చంద్రబాబు ఉచ్చులో చిక్కుకున్న ఆమె హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబు స్క్రిప్టు చదువుతోందన్నారు.

అన్ని వర్గాలను ఆకర్షించేలా మేనిఫెస్టో

- మే నెలలో రాజమహేంద్రవరంలో మహానాడు
- ప్రధాని మోదీని అభినందిస్తూ తీర్మానం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని వర్గాలను ఆకర్షించేలా వచ్చే ఎన్నికలకు మేనిఫెస్టో రూపకల్పన చేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించినట్లు ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందుకోసం మేనిఫెస్టో కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, కాల్వ శ్రీనివాసులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాకు వివరించారు. మహానాడు నిర్వహణ, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు, మేనిఫెస్టో రూపకల్పన కోసం కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేనిఫెస్టో కమిటీ ఏపీలోని అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రజల అభిప్రాయాలు, ఆలోచనల ప్రకారం మేనిఫెస్టో రూపొందిస్తుందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాల్ని భారీస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ చరిత్రను ప్రతి వ్యక్తికి, ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 30వ తేదీ నుంచి మే 28 వరకు ప్రపంచవ్యాప్తంగా వంద సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మే నెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో మహానాడు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ ముఖచిత్రంతో ఉన్న వంద రూపాయల నాణేన్ని విడుదల చేసినందుకు కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని అభినందిస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పూర్తిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి రెండేళ్లకు రూ.వందకు పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు చేపడుతున్నామని, ఇకపై రూ.5వేలకు పార్టీ శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి విరాళాలు ఇవ్వాలని ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందుకోసం ఒక వాట్సాప్ గ్రూపును సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో టీడీపీ ఎవరితో పొత్తు పెట్టుకోవాలనే దానిపై చంద్రబాబు నిర్ణయిస్తారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 40 శాతం స్థానాలు యువతకు కేటాయించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణలో నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకు పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కోరారు. ఆత్మప్రబోధానుసారం ఓటేయాలని చంద్రబాబు కోరారని, ఆ పిలుపుతోనే కొందరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఓటేశారని తెలిపారు. దానిపై మంత్రులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న ఏపీ రైతులను ఆదుకోవాలని కోరారు.

ప్రధాని మోదీకి చంద్రబాబు లేఖ

ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ చంద్రబాబు మంగళవారం లేఖ రాశారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఆయన పేరుతో ప్రత్యేక నాణెం విడుదల చేయడాన్ని తమ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో కృతజ్ఞతలు తెలిపినట్లు లేఖలో పేర్కొన్నారు. నాణెం విడుదల చేస్తున్నందుకు తెలుగు ప్రజలు, టీడీపీ తరఫున, వ్యక్తిగతంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

రెండు ప్రయత్నాల్లో ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షలు పూర్తి చేయొచ్చు

ఉక్రెయిన్, చైనా, ఫిలిప్పీన్ నుంచి వచ్చిన విద్యార్థులకు 'సుప్రీం' శుభవార్త

సాక్షి, న్యూఢిల్లీ: ఉక్రెయిన్ తదితర దేశాల నుంచి భీతావహ పరిస్థితుల్లో ప్రాణాలు అరచేత పట్టుకొని దేశానికి వచ్చిన ఫైనల్ ఇయర్ వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు సుప్రీంకోర్టు ఊపిరిపోసింది. దేశీయంగా ఏ కళాశాలలోనూ చేరకుండానే రెండు ప్రయత్నాల్లో ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షలు పూర్తి చేసేందుకు అవకాశం ఇచ్చింది. ఏడాదికాలంగా ఆందోళన చెందుతున్న విద్యార్థుల సమస్యకు సుప్రీంకోర్టు పరిష్కారం చూపింది. చైనా, ఫిలిప్పీన్స్‌లో కరోనా ఆంక్షలు, ఉక్రెయిన్–రష్యా యుద్ధం కారణంగా విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేయలేకపోయిన వైద్య విద్యార్థుల పిటిషన్లను మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విద్యార్థుల అభ్యర్థన దృష్టిలో పెట్టుకుని నిపుణుల కమిటీ కొన్ని సూచనలు చేసిందని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ధర్మాసనానికి తెలిపారు. 'ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాల ప్రకారం భారతీయ కళాశాలల్లో నమోదు చేసుకోకుండా ఎంబీబీఎస్ ఫైనల్ పార్టు–1, పార్టు–2 పరీక్షలు (థియరీ, ప్రాక్టికల్) ఒక ఏడాదిలో పూర్తి చేయడానికి అవకాశం ఇస్తాం. అంటే, పార్టు–2 పరీక్ష రాయాలంటే పార్టు–1 పూర్తి చేసి ఒక ఏడాది పూర్తి కావాలి. దేశీయంగా ఎంబీబీఎస్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారో అదేవిధంగా థియరీ పరీక్షలు, నిర్ణయించిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. పార్టు–1, పార్టు–2 పూర్తి చేసిన తర్వాత రెండు సంవత్సరాల నిర్బంధ రొటేషనల్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. జాతీయ వైద్య కమిషన్ నిర్ణయించిన విధంగా చెల్లింపులు ఉంటాయి. ఈ సిఫార్సులు అత్యవసర చర్యగా భావించాలి.' అని ఐశ్వర్య భాటి వివరించారు. జాతీయ వైద్య కమిషన్, విదేశీ వైద్య విద్య సంస్థలు అనుసరించే సిలబస్ వేరుగా ఉంటుందని విద్యార్థుల తరఫు సీనియర్ న్యాయవాదులు గోపాల శంకర్‌నారాయణ్, నాగముత్తు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పరీక్ష పూర్తి చేయడానికి ఒక ప్రయత్నంలో సాధ్యం కాకపోవచ్చని పేర్కొన్నారు. 'ఇదేమీ అఖిల భారత బార్ ఎగ్జామినేషన్ కాదు. ఉత్తీర్ణత సాధించకపోతే కనీసం అప్పటికే పూర్తి చేసిన ఎల్ఎల్‌బీ డిగ్రీ ఉంటుంది. విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోతే భవిష్యత్తు ఉండదు' అని గోపాల శంకర్‌నారాయణ్ తెలిపారు. నిపుణుల కమిటీ నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని, అయితే ఒకే ప్రయత్నంలో పరీక్ష పూర్తిచేయాలన్న సూచన ఆందోళన కలిగించే విషయమని ధర్మాసనం అభిప్రాయపడింది. రెండు ప్రయత్నాలు అవకాశం ఇవ్వాలన్న సవరణ చేయాలని కమిటీని ఆదేశించింది. 'కమిటీ నివేదికను చిన్న మార్పుతో పరిగణనలోకి తీసుకుంటాం. పార్టు–1, పార్టు–2 (థియరీ, ప్రాక్టికల్స్) పరీక్షలు పూర్తి చేయడానికి రెండు అవకాశాలు ఇవ్వాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొంది.

కొడుకు ఫోటోను చూపెడుతున్న తల్లి నాగమణి



● అమ్మ ప్రేమకు సజీవ సాక్ష్యం

నిలువెత్తు జ్ఞాపకం

బిడ్డల భవిష్యత్తు కోసం కలలు కంటూ వాళ్ల కోసం ఎన్నో త్యాగాలు చేస్తుంది అమ్మ. రెక్కలొచ్చి పిల్లలు ఎగిరెళ్లినా వారి జ్ఞాపకాలు మాత్రం ఆమె మెడ చుట్టూ చిట్టి చేతుల్లా అల్లుకుపోతూనే ఉంటాయి. తెలంగాణలోని కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన కంది నాగమణి పాతికేళ్ల క్రితం దేశసేవలో కానరాని దూరాలకు వెళ్లిన కొడుకును మళ్లీ కళ్లారా చూడాలనుకుంది. కొడుకు గొప్పతనాన్ని ఆ ఊరి ప్రజల ముందుకు తేవాలనుకుంది తనలాంటి కొడుకు వీధికొక్కరు పుట్టాలని నడివీధిలో విగ్రహాన్ని నిలబెట్టింది.

కంది నాగమణి, శంకరయ్య దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. సాగునీటి వసతులు లేక వర్షాధారంపై ఆధారపడి సేద్యం చేస్తుండే వాళ్లు. నాగమణి ఇల్లు, వ్యవసాయపనులే కాదు బీడీలు చుట్టే పని కూడా చేస్తుండేది. పెద్ద కొడుకు సిద్దరాములు ఏడో తరగతి వరకు చిట్యాలలో చదువుకున్నాడు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు తాడ్వాయి మండల కేంద్రానికి వెళ్లి చదువుకున్నాడు. 1990 లో సీఆర్‌పీఎఫ్ జవానుగా సెలెక్టయ్యాడు. అప్పట్లో వాళ్ల గ్రామంలో నక్సల్స్ ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. పోలీస్ డిపార్టుమెంటులో చేరుతానని ముందుకెళ్లాడు. వద్దని వారించినా వెనకడుగువేయలేదు. ఇంకో అడుగు ముందుకేసి దేశం కోసం సేవ చేస్తానంటూ వెళ్లాడు. అప్పటికే ఆయనకు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

గుండెలో పేలిన బాంబు

1997 డిసెంబర్ 14న అస్సాంలోని కొక్రా జిల్లాలో బోడో తీవ్రవాదులు పేల్చిన మందుపాతరలో పది మంది వరకు జవాన్లు చనిపోయారు. అందులో సిద్దరాములు ఒకరు. ఇంటికి కబురందింది. తల్లి గుండె చెరువయ్యింది. సీఆర్‌పీఎఫ్ అధికారులు శవాన్ని తీసుకుని తాడ్వాయికి వచ్చారు.

ఆ జ్ఞాపకాల్లోనే..

కొడుకు చనిపోయి పాతికేళ్లు దాటింది. అయినా, ఆ తల్లి మాత్రం కొడుకు జ్ఞాపకాల్లోనే కాలం గడుపుతోంది. చిన్నతనంలో చేసిన అల్లరి, పెద్దయ్యాక చూపిన గుండెధైర్యం ఆమెను రోజూ వెంటాడుతూనే ఉన్నాయి. ఆమె ఆలనా పాలనా చిన్న కొడుకు విఠల్ చూసుకుంటున్నాడు. బీపీ, షుగర్ సమస్యలకు మందులు వాడుతోంది. నిత్యం కొడుకు గురించిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వచ్చింది. బీడీ కార్మికురాలిగా రిటైర్ అయ్యాక పీఎఫ్‌లో జమ అయిన డబ్బులపై నెలనెలా పెన్షన్ వస్తోంది. ఆ డబ్బులతో కొడుకు విగ్రహం ఏర్పాటు చేయాలని పూనుకుంది. విగ్రహం తయారీకి, ఏర్పాటుకు ఎంతోమందిని కలిసి, తన కల గురించి చెబుతుండేది. దాదాపు రూ.లక్షా 60 వేలు ఖర్చు చేసి సిద్దరాములు నిలువెత్తు విగ్రహాన్ని తయారు చేయించింది.

కండ్ల ముందే తిరుగుతున్నట్టుంది





సిద్దరాములు విగ్రహం

చిన్నప్పటి నుంచి నా కొడుకులు ఎంతో కష్టపడి చదువుకున్నరు. తాడ్వాయికి నడుచుకుంటూ వెళ్లేవాళ్లు. పెద్దోడు ఉద్యోగంలో చేరిన తరువాత మా కష్టాలు తీరినయి. ఆరేడేండ్లు ఉద్యోగం చేసిండో లేదో చనిపోయిండు. వాడు కనుమరుగై ఇరవై ఐదేండ్లవుతున్నా నా కండ్ల ముందర ఇంకా తిరుగున్నట్లే ఉంటది. యాది జేసుకోని రోజు ఉండది. ఊళ్లో అందరితో ఎంతో ప్రేమగా ఉండేటోడు. రోజూ వాని ఫొటో చూసుకుంటూ ఇన్నేళ్లు గడిపినా. నా కొడుకు లెక్కనే ఉండే విగ్రహం అందరికీ తెలిసేలా పెట్టించాలనుకున్నా. అది ఇన్నాళ్లకి తీరింది. సైనికుడైన నా కొడుకు నాకే కాదు మా ఊరికి కూడా గొప్ప పేరు తెచ్చిపెట్టిండు.

- కంది నాగమణి,
అమర జవాన్ సిద్దరాములు తల్లి

జై జవాన్..

గ్రామంలో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఈ నెల 27న జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసింది నాగమణి. కొడుకు జ్ఞాపకాలతో విగ్రహం ఏర్పాటు చేసిన తల్లిని అందరూ అభినందించారు. నాగమణి మాత్రం నాడు తన కొడుకుతో పాటు మరో పది మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేసుకుంది. దేశసేవలో జవాన్ల త్యాగం గురించి ఈ సందర్భంగా అందరూ గుర్తుచేసుకున్నారు. పిల్లలు సైతం జై జవాన్ అంటూ దేశసేవలో జవాన్ గొప్పతనాన్ని తెలుసుకుంటున్నారు.

– ఎస్.వేణుగోపాలచారి,
సాక్షి, కామారెడ్డి

జీవిత చిత్రాలు

'అంతఃసౌందర్యమే అసలైన అందం... ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం లేదు'. 'కష్టాన్ని తలుచుకుంటూ కుంగిపోవద్దు... ధైర్యంగా ఎదుర్కోవడమే జీవితం...' అని... సమాజానికి చాటి చెప్తోంది వినీల. యాసిడ్ దాడి బాధితుల పక్షాన నిలుస్తోంది. చిత్రలేఖనంతో సున్నితత్వాన్ని నిద్రలేపుతోంది.



పెయింట్ వేస్తున్న వినీల

పాముల వినీల ఈతరంలో రంగులు తొడిగిన చిత్రకారిణి. చిత్రలేఖనంతో ఆమె సమాజాన్ని చైతన్యవంతం చేస్తోంది. చిత్రలేఖనంతోనే ఆమె బండబారిపోయిన మనసు పొరల్ని తట్టి లేపుతోంది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన వినీల తన చిత్రకళ గురించి 'సాక్షి'తో పంచుకున్న వివరాలివి.

"మా నాన్న (శేషగిరి) చిత్రకారుడు కావడంతో నా బాల్యంలో... రంగులున్నాయి, కుంచె ఉంది, కాన్వాసూ ఉంది. ఇంట్లో ఒక గదిలో నాన్న బొమ్మలేస్తుండేవారు. నేను సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు మా నాన్న జేఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్‌లో చేరారు. అప్పటివరకు ఆయన సొంతంగా సాధన చేస్తూ వచ్చిన చిత్రలేఖనాన్ని మరింత శాస్త్రబద్ధంగా నేర్చుకున్నారు. అలా నాకు నాన్నే తొలి గురువు, ఇల్లే యూనివర్సిటీ. ఇంటర్ తర్వాత నాన్న చదివిన జేఎన్‌టీయూలోనే ఫైన్ ఆర్ట్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసి ఆర్టిస్ట్‌గా ఆత్మవిశ్వాసంతో కుంచె పట్టుకున్నాను. ఆ తర్వాత పెళ్లి, ఆ తర్వాత పెయింటింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. ఫస్ట్ పీజీలో ఉన్నప్పుడు నాకు ఎదురైన ఓ సంఘటన నన్ను సామాజిక చిత్రకారిణిగా మార్చింది.



వినీల





పక్క సీటు మహిళ

యూనివర్సిటీకి వెళ్లడానికి సిటీ బస్ ఎక్కాను. నా పక్కన ఒకామె వచ్చి కూర్చుంది. ఆమెను నేను పెద్దగా గమనించలేదు, కానీ మరొకావిడ నా పక్కనున్నావిడను చూసి దూరం జరగడం నా దృష్టిలో పడింది. అప్పుడు నా పక్కనున్నామె వైపు చూశాను. ఆమె యాసిడ్ దాడి బాధితురాలు. చూడగానే నేను కంగారు పడ్డాను. కానీ దూరం జరగలేదు, ఆమె బాధపడుతుందేమోననే సంస్కారం నన్ను ఆపింది. నేను మాసాబ్ ట్యాంక్ బస్టాపులో దిగాను. ఆమె కూడా అదే బస్టాప్‌లో దిగింది. అప్పుడు మాటలు కలిపాను. ఆమె జీవితంలో ఎదురైన విషాదం నన్ను కలిచివేసింది. 'ఒకతడు ఆమె వెంటపడుతూ ఉండేవాడు. ఒకసారి గట్టిగా మాట్లాడింది. అతడి ప్రతిపాదనకు ఆమె అంగీకరించలేదు. గట్టిగా నో చెప్పింది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే ఆమె మీద యాసిడ్ దాడి జరిగింది'... ఇవీ ఆమె తన గురించి క్లుప్తంగా చెప్పిన వివరాలు. ఆ తర్వాత దాదాపు వారం– పది రోజులు నన్ను ఆమె జ్ఞాపకాలు వెంటాడాయి. ఏవేవో ప్రశ్నలు, సమాధానాల కోసం గూగుల్ సెర్చ్ చేస్తే ఆవేదన కలిగించే విషయాలు తెలిశాయి. యాసిడ్ బాధితుల గురించి దాదాపుగా అధ్యయనం చేశాను. కొంతమంది ధైర్యంగా జీవితాన్ని కొనసాగిస్తున్నారు. కొంతమంది ఆవేదనతో కుంగిపోతూ సమాజానికి ముఖం చూపించడానికి బిడియపడుతున్నారు. ఎవరో చేసిన నేరానికి వాళ్లు సమాజానికి భయపడడం ఎందుకు అనిపించేది. 'సౌందర్యం అనేది భౌతికం కాదు, అంతః సౌందర్యమే అసలైన అందం' అని ధైర్యం చెప్తాయి నా బొమ్మలు. విజయపథాన రాణించడానికి ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం మరొకటి ఉండదని మార్గదర్శనం చేస్తాయి. అంతకంటే ముందు... యాసిడ్ బాధితులను సమాజం స్వీకరించాలి. స్వీకరించాలంటే... సమాజంలో సున్నితత్వాన్ని మేల్కొలపాలి. మనిషిలో స్వతహాగా సున్నితత్వం ఉంటుంది. కానీ ఆ సున్నితత్వం సమాజం నిర్దేశించిన చట్రాల పొరలతో కప్పబడి పోయి ఉంది. ఆ పొరలను తొలగించగలిగే మాధ్యమంగా నా చేతిలో ఉన్న కళనే ఎంచుకున్నాను. అలా చిత్రలేఖనంలో ఇప్పటివరకు ఇరవైకి పైగా యాసిడ్ బాధితుల థీమ్‌తో చిత్రాలు వేశాను. ఒక్కొక్క చిత్రం ఒక్కో జీవితానికి ప్రతీకలు. వాటికి మంచి ప్రశంసలు వస్తున్నప్పుడు మన జీవితాలు ఎంత యాంత్రికంగా మారిపోయినప్పటికీ మనసుల్లో సున్నితత్వం నిలిచి ఉందని సంతోషం వేస్తుంటుంది. ఈ సెన్సిటివిటీని మరింతగా చైతన్యవంతం చేయగలిగితే యాసిడ్ బాధితులు సమాజంలో ఎటువంటి బెరుకు లేకుండా జీవించగలుగుతారు. సగటు మనుషులు యాసిడ్ బాధితులకు మద్దతుగా వారి పక్షాన చేరడానికి ధైర్యంగా ముందుకు వస్తారనేది నా ఆకాంక్ష.

చార్‌కోల్ బొమ్మ

యాసిడ్ బాధితుల చిత్రాలను చార్‌కోల్‌తో వేస్తున్నాను. ఎందుకంటే కాలిపోయినప్పటికీ తన ఉనికిని నిలబెట్టుకోగలిగిన వస్తువు చార్‌కోల్. ఎన్ని కష్టాలెదురైనా జీవితేచ్ఛను కోల్పోకూడదనే ధైర్యాన్ని నెలకొల్పాలనేది నా ఆలోచన. చిత్రలేఖనంలో నా వంతు సామాజిక బాధ్యత ఇది. ఇక నా కోసం నేను టీఎమ్ఆర్ఈఐఎస్ (తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ సొసైటీ)లో డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. నాలుగు వందల మంది పిల్లల నుంచి నాలుగు వందల ఐడియాలు వస్తుంటాయి. దాంతో నాకు ఉద్యోగం ప్రతి రోజూ కొత్తగా ఉంటుంది. మా వారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగి. ఇద్దరబ్బాయిలు. ఇదీ నా రంగుల ప్రపంచం" అని వివరించారు వినీల.

– వాకా మంజులారెడ్డి

ఆహా ఆర్థిక పాఠం!

యూత్ పల్స్

యూత్ అంటే 'ఓన్లీ వినోదం' అనేది ఒకప్పటి మాట. అయితే కోవిడ్ సంక్షోభ కాలం వారికి పైసా విలువను తెలియజేసింది. 'ఆర్ట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్' గురించి ఆలోచించేలా చేసింది. కలలు వెదుక్కునే యువతరానికి 'ఆర్థిక కళ' ఒంటపట్టింది. ఈ నేపథ్యం నుంచే యువ ఫిన్‌ఫ్లూయెన్సర్‌ల ప్రయాణం మొదలైంది...



నేహా నగర్

దిల్లీకి చెందిన ప్రియాంక భాటియాకు ఇన్వెస్ట్‌మెంట్‌పై ఆసక్తి మొదలైంది. అయితే ఒక బ్రోకర్ ఇచ్చిన తెలివి తక్కువ సలహాతో ఆమె ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ తలకిందులైంది. నష్టం చవి చూడాల్సి వచ్చింది.

'ఇక సెలవు. ఎందుకొచ్చిన రిస్క్' అని ఆమె అనుకోలేదు.

సెకండ్ ఇన్నింగ్స్‌లో...

స్టాక్ ఇన్వెస్టర్, ప్రాపర్టీ ఇన్వెస్టర్, ఎంటర్‌ప్రెన్యూర్, బిజినెస్ కోచ్‌లతో మాట్లాడింది. బుక్స్ చదివింది. వర్క్‌షాప్‌లకు హాజరైంది. ఫలితంగా ప్రియాంకకు ఎన్నో విషయాలపై లోతైన అవగాహన వచ్చింది.

ఫస్ట్ ఇండిపెండెంట్ ఇన్వెస్ట్‌మెంట్‌తో లాభం సంపాదించింది.

స్టాక్‌మార్కెట్‌లో సక్సెస్ అయిన తరువాత చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి వావ్(ఉమెన్ ఆన్ వెల్త్) పేరుతో మహిళల కోసం ఫైనాన్షియల్ కోర్సు ప్రారంభించింది. ఈతరం అమ్మాయిలకు ఈ కోర్సు ఎంతో దగ్గరైంది.

27 సంవత్సరాల నేహా నగర్ (దిల్లీ) పాపులర్ ఫిన్‌ఫ్లూయెన్సర్. టాక్స్ కన్సల్టెన్సీ సంస్థ టాక్సెజేషన్.ఇన్ వ్యవస్థాపకురాలైన నేహాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 748,000 ఫాలోవర్స్, యూట్యూబ్‌లో రెండు లక్షలమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన నేహా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. చార్టెడ్ ఎకౌంటెన్సీని కెరీర్‌గా ఎంచుకోవాలనే ఆమె కల నెరవేరలేదు.

సీఏ ఫైనల్స్‌లో ఉత్తీర్ణత సాధించకపోయినా ఫైనాన్స్ విషయాలపై ఆసక్తి మాత్రం రెట్టింపు అయింది. ఆ ఉత్సాహంతోనే ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరిటీస్‌లో వెల్త్ మేనేజర్‌గా పనిచేసింది. ఆ తరువాత సొంతంగా ట్యాక్స్ ఫర్మ్ మొదలుపెట్టి విజయం సాధించింది. లాక్‌డౌన్ టైమ్‌లో క్రిప్టో కరెన్సీ, స్టాక్స్, పర్సనల్ ఫైనాన్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ... మొదలైన వాటి గురించి నేహా క్రియేట్ చేసిన కంటెంట్ యువతను ఆకట్టుకుంది.

సంక్లిష్టమైన ఆర్థిక పరిభాషను సులభతరం చేసి యువతకు దగ్గర చేసిన ఫిన్‌ఫ్లూయెన్సర్‌గా పేరు తెచ్చుకుంది పుణె(మహారాష్ట్ర)కు చెందిన రచన రనడే. సీఏ చేసిన రచన చిన్న వయసులోనే టీచింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుంది. లైవ్, ఆన్‌లైన్‌లలో వేలాదిమందికి పాఠాలు చెప్పింది. నేహాకు 3.7 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

తన మాతృభాష మరాఠీలో సోషల్ మీడియా వేదికగా ఫైనాన్షియల్ లిటరసీ గురించి పనిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది నేహ.

సీఏలో ఉత్తీర్ణత సాధించిన తరువాత ఫైనాన్స్ ప్రొఫెషన్‌ను ఎంచుకుంది ట్వింకిల్ జైన్. యువతకు ఆర్థిక విషయాలపై అవగాహన కలిగించడానికి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు చేస్తుంటుంది. ఆమెకు మూడు లక్షల వరకు సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.



ట్వింకిల్ జైన్

26 సంవత్సరాల ట్వింకిల్ రకరకాల బ్రాండ్స్‌కు మోడలింగ్ చేస్తోంది. ఫిన్‌ఫ్లూయెర్స్‌గా కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే వారు ట్వింకిల్ దగ్గరకు వచ్చి సలహాలు తీసుకుంటూ ఉంటారు.

'సీఏ పరీక్షలు క్లీయర్ చేయడం అంత సులభం కాదు. నీవల్ల ఏమవుతుంది! ... ఇలాంటి మాటలు ఎన్నోసార్లు విన్నాను. ఈ మాటలు మనమీద మనకు సందేహం రేకెత్తించేలా, ఒత్తిడి పెంచేలా, చివరికి ఓటమికి దగ్గర చేసేలా చేస్తుంటాయి. ఎగ్జామ్స్ నుంచి కెరీర్ వరకు ఇలాంటి నెగెటివ్ కామెంట్స్ వినిపిస్తూనే ఉంటాయి. అవి చెవి దాటి మనసు దారి పట్టకుండా, ఎత్తిన తల దించకుండా, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చూస్తూ ముందుకు వెళ్లాలి'... ట్వింకిల్ జైన్ చెప్పే ఇలాంటి మాటలు యూత్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంటాయి.

బ్యూటిప్స్

పపాయా ఫేస్ ప్యాక్



బొప్పాయి మాస్క్‌తో కూడా చర్మానికి చాలా మేలు కలుగుతుంది. ఇది చర్మాన్ని అందంగా మారుస్తుంది. ఇందులో విటమిన్ సి ఉంటుంది. దీని వల్ల ముఖానికి మరింత బెనిఫిట్ కలుగుతుంది. మీరు బొప్పాయి మాస్క్ తయారు చేసుకోవాలంటే... బొప్పాయి తొక్కను తీసేసి ముక్కల కింద కోసి వాటిని మిక్సీలో వేసి పేస్ట్ లాగా చేయండి తర్వాత ఈ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే వదిలేసి ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని కడిగేసుకోండి. అప్పుడప్పుడు మీకు సమయం ఉన్నప్పుడు ఈ మాస్క్ ని వేస్తూ ఉండండి. చర్మం కాంతి బాగుంటుంది.

టీ పొడిని పడేయకండి..



టీ పెట్టిన తర్వాత వడపోసిన టీ పొడిని పారేయకుండా పక్కన పెట్టి దాంతో అద్దాలు, చెక్కతో చేసిన వస్తువులు శుభ్రం చేయడం వల్ల అవి శుభ్రపడి అందంగా మెరుస్తాయి.

ఆత్మసాక్షి

బంగారం లాంటి స్నేహ గాథ

తయ్యబున్నీసా గొప్ప అథ్లెట్. ఒకప్పుడు అస్సాం నుంచి ఆసియా క్రీడల్లో పాల్గొన్న తొలి మహిళ. డిస్కస్ త్రోలో రికార్డ్ హోల్డర్. రైల్వేలో పని చేసి రిటైరయ్యింది. కాని ఆమె మనసులో ఒక వెలితి. అశాంతి. ఒక స్నేహితురాలికి ఆమె బాకీ ఉంది. అది కూడా బంగారం బాకీ. 55 ఏళ్ల తర్వాత ఆ స్నేహితురాలిని వెతికి ఆ బాకీ చెల్లించింది. కాని ఇందులో ఉన్న అసలు ఫ్లాష్ బ్యాక్ తెలిస్తే మనిషిని ఆత్మ సాక్షి ఎలా వేధిస్తుందో అర్థమవుతుంది. స్నేహానికి ఉన్న విలువ కూడా.



తయ్యబున్నీసా, జులేఖా

మిత్ర ధర్మం, మిత్ర ద్రోహం రెండూ కలగలిసిన కథ ఇది. నిజానికి ఎవరైనా రచయిత మంచి కథగా రాయదగ్గ అంశం. పశ్చాత్తాపం, అపరాధ భావం ఒక మనిషిని ఎలా వెంటాడుతాయో ఈ ఉదంతం చెబుతుంది.

ఇదీ జరిగింది

అనగనగా అస్సాంలోని శివ నగర్. 1967వ సంవత్సరం. అక్కడి ధాయ్ అలీ గర్ల్స్ హైస్కూల్‌లో 7వ క్లాసులో ఇద్దరు అమ్మాయిలు కలిసి చదువుకుంటున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు ఒకమ్మాయి పేరు తయ్యబున్నీసా. ఇంకొక అమ్మాయి పేరు జులేఖా. తయ్యబున్నీసా కడు పేదరాలు. జులేఖా స్థితిమంతురాలు. ఆ తేడా వారి స్నేహానికి అడ్డు కాలేదు. జులేఖా రోజూ వేళ్లకు ఉంగరాలు పెట్టుకుని బడికి వచ్చేది. బంగారు ఉంగరాలు అవి. ఒకరోజు ఒక ఉంగరం పోగొట్టుకుంది. ఇంట్లో చెప్తే తిట్టి, ఇక మీదట జాగ్రత్త అన్నారు. తయ్యబున్నీసాకు రోజూ అందరి కంటే ముందే స్కూల్‌కి రావడం అలవాటు. మరునటి రోజు ఉదయాన్నే స్కూల్‌కు వచ్చి క్లాస్‌లో అడుగు పెడితే ఉంగరం దొరికింది. అది తన ఫ్రెండ్ జులేఖాది అని తెలుసు. తిరిగి ఇస్తే నువ్వే దొంగతనం చేశావా అంటారేమోనని భయపడి ఇంట్లో ఇచ్చింది. ఇంటికి వెళ్లిన ఉంగరం తిరిగి స్నేహితురాలికి చేరలేదు. ఉంగరం దొరికిన సంగతి తయ్యబున్నీసా జులేఖాకి చెప్పలేదు. అదే సంవత్సరం తయ్యబున్నీసా తండ్రి మరణించాడు. ఆ కష్టాల్లో ఇంట్లో వాళ్లు ఆ ఉంగరాన్ని అమ్మేశారు. రోజులు గడిచిపోయాయి.

> తప్పును అంగీకరించడం, క్షమించి ముందుకుపోవడం... వీటి వల్లే బంధాలు ముందుకు సాగుతాయి. స్నేహం కలకాలం నిలుస్తుంది అని ఈ ఇద్దరు స్నేహితురాళ్లు రుజువు చేశారు.

ఆ తర్వాత?

తయ్యబున్నీసా అథ్లెట్ అయ్యింది. డిస్కస్ త్రో లో చాలా ప్రతిభ చూపింది. 1974లో నేషనల్ రికార్డు స్థాపించి 1982లో జరిగిన ఆసియా క్రీడల్లో అస్సాం నుంచి పాల్గొన్న మొదటి మహిళా అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. ఆ క్రీడా ప్రతిభకు ఆమెకు రైల్వేలో ఉద్యోగం ఇచ్చారు. రైల్వేలో పని చేస్తూ, అథ్లెట్‌గా రాణిస్తూ రిటైర్ అయ్యింది. ఇంత జీవితం గడిచినా ఆమెకు ఏదో అశాంతి. అపరాధభావం. పశ్చాత్తాపం. చిన్నప్పుడు స్నేహితురాలి ఉంగరం దాదాపు దొంగిలించిన భావన. ఈలోపు తయ్యబున్నీసా 'హజ్'కు వెళ్లి వచ్చింది. అప్పటినుంచి ఆ చిన్నప్పటి 'స్నేహద్రోహం' ఇంకా బాధించసాగింది. దీనినుంచి బయటపడాలని నిశ్చయించుకుంది. జులేఖా ఎక్కడ ఉందో కనుక్కోమని సోదరికి చెప్తే జులేఖాను వెతకడం చాలా కష్టమైంది. కాని మొత్తం మీద ఆమె జీవించే ఉంది. శివ నగర్‌లోనే ఉంది.

55 ఏళ్ల తర్వాత

ఇన్నాళ్ల తర్వాత తయ్యబున్నీసా తన స్నేహితురాలు జులేఖాను కలిసింది. అప్పటికి జులేఖా దాదాపు తయ్యబున్నీసాను మర్చిపోయింది. తయ్యబున్నీసా గుర్తు చేశాక ఆత్మీయంగా హత్తుకుంది. అప్పుడు మెల్లగా... ఉంగరం గురించి గుర్తు చేసింది. ఆ సంగతి కూడా జులేఖా మర్చిపోయింది. ఆ ఉంగరం తనను పెట్టిన బాధ స్నేహితురాలికి చెప్పుకుంది. ఆ ఉంగరాన్ని తిరిగి ఇవ్వలేకపోయినా పరిహారం చెల్లించడానికి వచ్చానని చెప్పింది. 12 వేల రూపాయల కవర్ స్నేహితురాలి చేతిలో పెట్టింది. జులేఖా ఆ డబ్బు వద్దంటే వద్దు అంది. కాని స్నేహితురాలిని తెరిపిన పడేయడానికి తీసుకుంది.

'ఇప్పుడు నాకు ప్రశాంతంగా ఉంది' అని కళ్ల తడి చేసుకుంది తయ్యబున్నీసా.

'ఈ డబ్బు సంగతి ఏమిటో గాని ఇన్నాళ్లకు మేమిద్దరం కలిశాం. అది బాగుంది' అని సంతోష పడింది జులేఖా.

తప్పును అంగీకరించడం, క్షమించి ముందుకుపోవడం... వీటి వల్లే బంధాలు ముందుకు సాగుతాయి. స్నేహం కలకాలం నిలుస్తుంది అని ఈ ఇద్దరు స్నేహితురాళ్లు రుజువు చేశారు.



క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మైసూర్ ఓపెన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ, ఆంధ్రప్రదేశ్ ఆటగాడు నిక్కీ పునాచా ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడ్ రిత్విక్–నిక్కీ జోడీ 6–7 (3/7), 7–6 (8/6), 10–7తో ప్రజ్వల్ దేవ్–గంటా సాయికార్తీక్ రెడ్డి (భారత్) జంటను ఓడించింది. గంటా 58 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్ జోడీ ఐదు ఏస్‌లు సంధించింది.



వైదొలగనున్న హైదరాబాద్ ఎఫ్‌సీ హెడ్ కోచ్

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫ్రాంచైజీ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) హెడ్ కోచ్ మనోలో మార్కెజ్ (స్పెయిన్) ఈ సీజన్ ముగిశాక జట్టును వీడనున్నారు. మనోలో మార్కెజ్ శిక్షణలో హైదరాబాద్ గత ఏడాది ఐఎస్‌ఎల్ చాంపియన్‌గా నిలిచి, ఈ ఏడాది సెమీఫైనల్ చేరింది. ఆగస్టులో జరిగే సూపర్ కప్ టోర్నీ తర్వాత మార్కెజ్ తప్పుకుంటారు. గత మూడు సీజన్‌లలో మార్కెజ్ శిక్షణలో హైదరాబాద్ ఎంతో ఎత్తుకు ఎదిగిందని ఫ్రాంచైజీ యజమాని వరుణ్ త్రిపురనేని తెలిపారు.

హంపి, హారిక గేమ్‌లు 'డ్రా'





న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసుకున్నారు. మంగళవారం జరిగిన మూడో రౌండ్‌లో కాటరీనా లాగ్నో (రష్యా)తో గేమ్‌ను హంపి 32 ఎత్తుల్లో... నానా జాగ్‌నిడ్జె (జార్జియా)తో గేమ్‌ను హారిక 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. మూడో రౌండ్ తర్వాత 1.5 పాయింట్లతో హారిక, హంపి మరో ముగ్గురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

సిక్కి రెడ్డి జోడీ గెలుపు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి–ఆరతి (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సిక్కి–ఆరతి ద్వయం 16–21, 21–18, 21–11తో ఆనీ జు–కెర్రీ జు (అమెరికా) జోడీపై విజయం సాధించింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మాత్రం సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్), సుమీత్ రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జోడీలు మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాయి. క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో సిక్కి–రోహన్ 12–21, 22–20, 19–21తో అమ్రి స్యాన వి–వినీ ఒక్తావినా (ఇండోనేసియా) చేతిలో... సుమీత్–అశ్విని 17–21, 21–19, 13–21తో హీ జి టింగ్–డూ యె (చైనా) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్ క్వాలిఫయింగ్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు.

కివీస్, లంక రెండో వన్డే రద్దు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్, శ్రీలంక జట్ల మధ్య మంగళవారం జరగాల్సిన రెండో వన్డే భారీ వర్షం కారణంగా రద్దయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ తొలి వన్డేలో 198 పరుగులతో గెలిచి 1–0తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన మూడో వన్డే శుక్రవారం జరుగుతుంది.

సన్‌రైజర్స్ సరికొత్తగా...

పలు కీలక మార్పులతో ఐపీఎల్ సీజన్‌కు సిద్ధం


కొత్త కెప్టెన్, కొత్త కోచ్‌తో హైదరాబాద్ జట్టు

రెండేళ్ల క్రితం ఎనిమిది జట్లు పాల్గొన్న ఐపీఎల్‌లో ఎనిమిదో స్థానం... గత ఏడాది పది జట్లు పాల్గొన్న ఐపీఎల్‌లోనూ ఎనిమిదో స్థానం... ఆట మెరుగుపడలేదని అనుకోవాలా లేక తమకంటే రెండు జట్లు కింద ఉన్నాయి కాబట్టి బాగానే ఆడినట్లా! 2016లో చాంపియన్‌గా నిలిచాక తర్వాతి నాలుగు సీజన్లలో టాప్–4లో ఉంటూ నిలకడ ప్రదర్శించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట గత రెండేళ్లు పూర్తిగా గతి తప్పింది. సమష్టి వైఫల్యంతో పాటు వార్నర్ వివాదం టీమ్‌ను బాగా ఇబ్బంది పెట్టాయి. 2019 ఐపీఎల్ తర్వాత మళ్లీ ఇప్పుడే రైజర్స్ తమ సొంత మైదానం హైదరాబాద్‌లో మ్యాచ్‌లు ఆడబోతోంది. పలువురు ఆటగాళ్ల మార్పులతో పాటు సహాయక సిబ్బందిలోనూ స్వల్ప మార్పుచేర్పులతో కొత్త సీజన్‌కు సిద్ధమైంది. ఇలాంటి నేపథ్యంలో జట్టు ఎలాంటి ప్రదర్శన ఇస్తుందని అభిమానులంతా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. దక్షిణాఫ్రికా టి20 కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ కొత్త కెప్టెన్‌గా ముందు నిలబడగా, ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్లలో ఒకడైన బ్రియాన్ లారా ఈసారి పూర్తి స్థాయిలో జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం విశేషం.

-సాక్షి క్రీడా విభాగం

కొత్త సీజన్ వేలానికి ముందు హైదరాబాద్ 2022లో ఆడిన వారి నుంచి 12 మంది ఆటగాళ్లను వదిలేసుకుంది. వీరిలో 'కేన్ మామా' అంటూ అభిమానులు పిలుచుకున్న విలియమ్సన్‌తో పాటు నికోలస్ పూరన్ తదితరులు ఉన్నారు. మరో 12 మందిని కొనసాగించగా అందులోంచే దక్షిణాఫ్రికా క్రికెటర్ మార్క్‌రమ్‌ను కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇటీవలే దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో సన్‌రైజర్స్ యాజమాన్యానికే చెందిన ఈస్టర్న్ కేప్ టీమ్ మార్క్‌రమ్ సారథ్యంలోనే విజేతగా నిలిచింది. కాబట్టి నాయకత్వం విషయంలో ఫ్రాంచైజీ అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకుందని భావించవచ్చు. సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అందుబాటులో ఉన్నా... మార్క్‌రమ్‌పైనే యాజమాన్యం విశ్వాసం ఉంచింది. జట్టు తరఫున గత ఒక్క సీజన్ మాత్రమే ఆడిన అతను 12 ఇన్నింగ్స్‌లలో 139.05 స్ట్రయిక్‌రేట్‌తో 381 పరుగులు చేసి మెరుగైన ప్రదర్శనే కనబర్చాడు. ఈసారి అతడి బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్సీ బాధ్యతలు కూడా జట్టుకు కీలకం కానున్నాయి. ముఖ్యంగా 'హోం గ్రౌండ్' ఉప్పల్ స్టేడియంలో జరిగే 7 మ్యాచ్‌ల కోసం జట్టులో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోగలిగి విజయాలు సాధిస్తే 'ప్లే ఆఫ్స్' అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.

బ్రూక్ చెలరేగుతాడా...


హ్యారీ బ్రూక్


మయాంక్

సన్‌రైజర్స్ బ్యాటింగ్ లైనప్ లో ఈసారి అందరినీ ఆకర్షిస్తున్న ఆటగాడు ఇంగ్లండ్‌కు చెందిన 24 ఏళ్ల హ్యారీ బ్రూక్. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటికే 'ఆల్ ఫార్మాట్' ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న అతను 99 టి20ల్లో విధ్వంసకర స్ట్రయిక్‌రేట్ 148.32తో 2432 పరుగులు చేశాడు. మిడిలార్డర్‌లో బ్రూక్ బ్యాటింగ్ రైజర్స్‌కు 'బూస్ట్' ఇవ్వగలదు. అయితే భారత గడ్డపై తొలిసారి ఆడనున్న అతను పరిస్థితులను ఎలా వాడుకుంటాడనేది చూడాలి. మిడిలార్డర్‌లో అతనితో పాటు మార్క్‌రమ్, వికెట్ కీపర్లు ఫిలిప్స్, క్లాసెన్ (ఇద్దరిలో ఒకరు), ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్ జట్టుకు మంచి స్కోరు అందించగలరు. గత ఏడాది పంజాబ్ కింగ్స్ తరఫున పేలవ ప్రదర్శన కనబర్చిన మయాంక్ అగర్వాల్ ఇప్పుడు సన్‌రైజర్స్‌కు ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. గత సీజన్ టీమ్ టాప్ స్కోరర్ అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠిలు టాపార్డర్‌లో వేగంగా పరుగులు సాధించాల్సి ఉంటుంది. అయితే ఇతర జట్లతో పోలిస్తే తొలి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడే విధ్వంసక ఓపెనర్ హైదరాబాద్ వద్ద లేడనేది స్పష్టం.


మార్క్‌రమ్

సన్‌రైజర్స్ జట్టు వివరాలు

మార్క్‌రమ్ (కెప్టెన్), గ్లెన్ ఫిలిప్స్, మార్కో జాన్సెన్, ఫజల్ హఖ్ ఫారుఖీ, హ్యారీ బ్రూక్, క్లాసెన్, ఆదిల్ రషీద్, అకీల్ హొసీన్ (విదేశీ ఆటగాళ్లు). అబ్దుల్ సమద్, రాహుల్ త్రిపాఠి, అభిషేక్ శర్మ, వాషింగ్టన్ సుందర్, భువనేశ్వర్, కార్తీక్ త్యాగి, నటరాజన్, ఉమ్రాన్ మలిక్, మయాంక్ అగర్వాల్, అన్‌మోల్ ప్రీత్ సింగ్, మయాంక్ మర్కండే, వివ్రాంత్ శర్మ, మయాంక్ డాగర్, సమర్థ్ వ్యాస్, సన్వీర్, ఉపేంద్ర సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి.

సహాయక సిబ్బంది

బ్రియాన్ లారా (హెడ్ కోచ్), డేల్ స్టెయిన్ (పేస్ బౌలింగ్ కోచ్), ముత్తయ్య మురళీధరన్ (స్పిన్ బౌలింగ్ కోచ్), ర్యాన్ కుక్ (ఫీల్డింగ్ కోచ్), సైమన్ హెల్మెట్ (అసిస్టెంట్ కోచ్).

పేసర్ల బృందం...


భువనేశ్వర్

బ్యాటింగ్‌తో పోలిస్తే మరోసారి హైదరాబాద్ బౌలింగ్ కాస్త పదునుగా కనిపిస్తోంది. గత సీజన్‌లో ఆడిన 14 మ్యాచ్‌ల్లోనూ 'ఫాస్టెస్ట్ బాల్' విసిరిన ఉమ్రాన్ మలిక్ ఇప్పుడు కూడా కీలక బాధ్యత పోషించాల్సి ఉంది. పైగా ఈ ఏడాది కాలంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో అతని ఆట మెరుగవడంతో పాటు బాధ్యత కూడా పెరిగింది. బౌలింగ్‌లో మునుపటి వాడి లోపించడంతో భారత జట్టు చోటుతో పాటు బోర్డు కాంట్రాక్ట్ కూడా కోల్పోయిన భువనేశ్వర్ ఈసారి ఏమాత్రం ప్రభావం చూపిస్తాడనేది చెప్పలేం. అయితే నటరాజన్, కార్తీక్ త్యాగి, జాన్సెన్, ఫజల్ హఖ్‌లతో పేస్ బృందం పెద్దదిగానే ఉంది. ఆల్‌రౌండర్ సుందర్ ఆఫ్ స్పిన్ జట్టుకు సానుకూలాంశం కాగా, రెగ్యులర్ స్పిన్నర్‌గా ఆదిల్ రషీద్ కనిపిస్తున్నాడు. ఇంగ్లండ్ తరఫున గత కొన్నేళ్లుగా వన్డేలు, టి20ల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న రషీద్ అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటే గతంలో రషీద్ ఖాన్ తరహాలో లెగ్ స్పిన్‌తో ప్రత్యర్థిపై పైచేయి సాధించవచ్చు. దేశవాళీ లెగ్‌స్పిన్నర్ మయాంక్ మర్కండే కూడా టీమ్‌లో ఉన్నాడు కానీ గత రెండు సీజన్లుగా అతను రాణించలేకపోయాడు. అయితే ఓవరాల్‌గా చూస్తే ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న క్రికెటర్లు మినహా కొత్తగా జట్టులోకి వచ్చిన యువ ఆటగాళ్లలో మరీ చెప్పుకోదగ్గ ప్లేయర్లు ఎవరూ లేరు. 20 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడినా ఇప్పటి వరకు కీలక దశలో సమద్‌పై పూర్తి నమ్మకం ఉంచలేని పరిస్థితి. కాబట్టి తుది జట్టులో వీరిలో ఎవరికి స్థానం దక్కుతుందనేది సందేహమే.

టాప్-10 నుంచి సింధు అవుట్

ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు 2016 నవంబర్ తర్వాత తొలిసారి ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో టాప్–10లో చోటు కోల్పోయింది. గతవారం ముగిసిన స్విస్ ఓపెన్‌లో సింధు మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. ఈ ఫలితం ఆమె ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సింధు మహిళల సింగిల్స్ విభాగంలో రెండు స్థానాలు పడిపోయి 11వ ర్యాంక్‌కు చేరుకుంది. ఈ ఏడాది సింధు నాలుగు టోర్నీలలో పాల్గొని మూడింటిలో తొలి రౌండ్‌లో ఓడిపోయి, మరో టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. ప్రస్తుతం మాడ్రిడ్‌లో జరుగుతున్న స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో సింధు బరిలో ఉంది. భారత్‌కే చెందిన మరో స్టార్ ప్లేయర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ ఒక స్థానం ఎగబాకి 31వ ర్యాంక్‌లో నిలిచింది. జనవరిలో ఇండోనేసియా ఓపెన్ తర్వాత సైనా మరో టోర్నీలో ఆడలేదు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ తొమ్మిదో ర్యాంక్‌ను నిలబెట్టుకోగా... కిడాంబి శ్రీకాంత్ 21వ ర్యాంక్‌లో, లక్ష్య సేన్ 25వ ర్యాంక్‌లో నిలిచారు.

చాంపియన్ భారత్



ఇంఫాల్: ముక్కోణపు అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు విజేతగా నిలిచింది. మణిపూర్‌లో మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–0 గోల్స్ తేడాతో కిర్గిజ్ రిపబ్లిక్ జట్టుపై గెలిచింది. భారత్ తరఫున సందేశ్ జింగాన్ (34వ ని.లో), సునీల్ ఛెత్రి (84వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. సునీల్ ఛెత్రి కెరీర్‌లో ఇది 85వ గోల్ కావడం విశేషం. ఈ టోర్నీలో ఆడిన మరో జట్టు మయన్మార్‌పై తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1–0తో విజయం సాధించింది.

సినిమా


● రవితేజ

నన్ను ఆపగలిగేది నేనే!

'అరే బాజ్జీ.. లైఫ్‌లో వైలెన్స్ ఎక్కువైపోయి బొత్తిగా రొమాన్స్ లేకుండా పోతోంది రా..' అంటూ రవితేజ చెప్పే డైలాగ్‌తో 'రావణాసుర' ట్రైలర్ విడుదలైంది. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేశారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు మేకర్స్. 'ఈ భూమ్మీద నన్ను ఆపగలిగేవాడు ఎవడైనా ఉన్నాడంటే అది నేనే..' అనే రవితేజ డైలాగ్‌తో ట్రైలర్ ముగుస్తుంది. రవితేజ క్రిమినల్ లాయర్ పాత్రలో కనిపించనున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్.


ఆ ఘనత చరిత్రలో నిలిచిపోతుంది

- చిరంజీవి


● సురేఖ, చిరంజీవి, రాజమౌళి, రమా రాజమౌళి, రామ్‌చరణ్

రామ్‌చరణ్ బర్త్ డే (మార్చి 27) వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. చిరంజీవి స్వగృహంలో ఈ వేడుక జరిగింది. ఇటీవల ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు..' పాటకు ఆస్కార్ వరించినందుకు 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ సభ్యులు రాజమౌళి, కీరవాణి, డీవీవీ దానయ్య, సెంథిల్‌కుమార్, ఎస్.ఎస్. కార్తికేయ, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ తదితరులను ఈ వేడుకలో సత్కరించారు చిరంజీవి. ''రామ్‌చరణ్ బర్త్‌డే సందర్భంగా ఆత్మీయులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆస్కార్ విజేతలను సత్కరించడం నాకు నిజమైన వేడుకలాంటిది. తెలుగువారు సాధించిన ఆస్కార్ ఘనత భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది'' అని పేర్కొన్నారు చిరంజీవి. హీరోలు నాగార్జున, వెంకటేశ్, నాగచైతన్య, రానా, విజయ్ దేవరకొండ, అఖిల్, సాయిధరమ్, వైష్ణవ్ తేజ్, దర్శకులు సుకుమార్, కృష్ణవంశీ, ప్రశాంత్ నీల్, నార్తన్, నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌కి రెడీ



● అజయ్ దేవగన్

మైదానంలో ఫుట్‌బాల్ కోచ్‌గా కనిపించనున్నారు బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్. భారత జాతీయ ఫుట్‌బాల్ జట్టు కోచ్, మేనేజర్ (1950 –1963 సమయంలో...) సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'మైదాన్'. ఈ చిత్రంలో సయ్యద్ అబ్దుల్ పాత్రలో అజయ్ దేవగన్ నటించారు. అమిత్ రవీంద్రనాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియమణి కీలక పాత్ర పోషించారు. జీ స్టూడియోస్, బోనీ కపూర్, ఆకాష్ చావ్లా, అరుణవ జోయ్ గుప్తా నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా రెండేళ్ల క్రితమే విడుదల కావాల్సింది. అయితే పలుమార్లు రిలీజ్ వాయిదా పడింది. తాజాగా జూన్ 23న విడుదల చేయనున్నట్లు మంగళవారం చిత్ర యూనిట్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

శాకుంతలం నా మొదటి అడుగు!

- 'దిల్' రాజు


● చైతన్యప్రసాద్, 'దిల్' రాజు, గుణశేఖర్, నీలిమ గుణ, సాయిమాధవ్, ప్రవీణ్

''రాజమౌళి 'బాహుబలి'ని పాన్ ఇండియాకి, 'ఆర్‌ఆర్‌ఆర్'ని మొత్తం ప్రపంచానికి చూపించారు. మన తెలుగు సినిమాలు ప్రపంచానికి చూపిస్తూనే ఉండాలి.. దాని కోసం నా మొదటి అడుగు 'శాకుంతలం'. ఇది మన ఇండియన్ సినిమా అని తర్వాతి తరానికి తెలియాలి. ఈ మూవీ ప్రేక్షకులను నిరుత్సాహపరచదు'' అని 'దిల్' రాజు అన్నారు. సమంత లీడ్ రోల్‌లో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది. మంగళవారం ఈ చిత్రం త్రీడీ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''గుణశేఖర్‌గారికి సాయం చేయడానికి నేను ఈ మూవీలో భాగమయ్యాను' అని అందరూ అనుకుంటారు. కానీ, గుణశేఖర్‌గారు మోసపోయారు.. నేను స్వార్థంతో ఈ మూవీలో జాయిన్ అయ్యాను. ఎందుకంటే తెలుగు సినిమా గ్లోబల్ వరకూ వెళ్లింది. భవిష్యత్‌లో నేను కూడా ఇలాంటి విజువల్ ఎఫెక్ట్స్ ఉన్న గొప్ప సినిమాలు తీయాలంటే పని నేర్చుకోవాలి. అందుకే 'శాకుంతలం'లో చేరాను'' అన్నారు. గుణశేఖర్ మాట్లాడుతూ– ''ఇది సమంతగారి 'శాకుంతలం'. శకుంతల పాత్రకి ఆమె ప్రాణ ప్రతిష్ఠ చేశారు'' అన్నారు. ''మైథాలజీలో త్రీడీలో వస్తున్న తొలి చిత్రం 'శాకుంతలం'. ప్రేక్షకులందరూ ఈ మూవీని త్రీడీలో ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు నీలిమ గుణ. ఈ కార్యక్రమంలో మాటల రచయిత సాయిమాధవ్ బుర్రా, పాటల రచయిత చైతన్య ప్రసాద్, ఎడిటర్ ప్రవీణ్ పూడి మాట్లాడారు.

సినిమా రాజకీయాలను తట్టుకోలేక పోయాను


● ప్రియాంకా చోప్రా

హిందీ పరిశ్రమలో కొందరు చేసిన రాజకీయాలను తట్టుకోలేకపోయానని, అందుకే ఇటీవల హిందీ చిత్రాల సంఖ్య తగ్గించానని అంటున్నారు ప్రియాంకా చోప్రా. నటిగా ఇరవై సంవత్సరాల సుదీర్ఘమైన కెరీర్ ఉన్న ప్రియాంకా చోప్రా ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాలీవుడ్‌లో ఓ హాట్ టాపిక్‌గా మారింది. బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు తాను షిఫ్ట్ కావడం గురించి ప్రియాంకా చోప్రా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. ''బాలీవుడ్ ఇండస్ట్రీలో కొందరు నన్ను ఒక మూలకు నెట్టివేయడానికి ప్రయత్నించారు. నాకు అవకాశాలు రాకుండా చేయడానికి ఓ గ్రూప్ ఏర్పాటైందని నాకు అర్థమైంది. ఈ క్రమంలో నాకు కొందరితో విభేదాలు తలెత్తాయి. ఈ పాలిటికల్ గేమ్స్ ఆడటం నావల్ల కాదనిపించింది. ఇక లాభం లేదని నేను బాలీవుడ్‌కు బిగ్ బ్రేక్ ఇవ్వాలనుకున్నాను. ఇప్పటి నా మేనేజర్ అంజులా ఆచార్య ఓ మ్యూజిక్‌లో నన్ను చూసి మ్యూజిక్ ప్రపంచంలో నీకు ఆసక్తి ఉందా? అని అడిగారు. ఓకే చెప్పి, యూఎస్ వెళ్లాను. అలా ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్లగలిగాను. కొత్త అవకాశాలు కూడా వచ్చాయి'' అని చెప్పుకొచ్చారు ప్రియాంకా చోప్రా. ఇక హాలీవుడ్‌లో 'క్వాంటికో', 'బేవాచ్' వంటి ప్రాజెక్ట్స్ చేశారు ప్రియాంక. ప్రస్తుతం ప్రియాంక నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్, ఇంగ్లిష్ చిత్రం 'లవ్ ఎగైన్' రిలీజ్‌కు రెడీగా ఉన్నాయి. అలాగే హిందీలో 'జీలే జరా' సినిమాలో ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్ చేయనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే ప్రియాంక చేసిన వ్యాఖ్యలకు కంగనా స్పందిస్తూ.. ''బాలీవుడ్ మాఫియా గ్యాంగ్ ప్రియాంకా చోప్రాను ఇండియా నుంచి అమెరికాకు పంపేసింది. ఇందుకు కారణం దర్శక–నిర్మాత కరణ్ జోహార్'' అని ఆరోపిస్తూ ట్వీట్స్ చేశారు.

ఇంత అభిమానం ఊహించలేదు

- అతుల్యా రవి



''మీటర్' పక్కా కమర్షియల్ మూవీ. పాటలు, డ్యాన్సులు, మాస్ ఫైట్స్, రొమాన్స్, లవ్.. ఇలా అన్ని అంశాలుంటాయి. తండ్రి సెంటిమెంట్ కీలకంగా ఉంటుంది'' అని హీరోయిన్ అతుల్యా రవి అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా రమేష్ కడూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీటర్'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా అతుల్యా రవి మాట్లాడుతూ– ''తమిళంలో చాలా సినిమాల్లో నటించాను. తెలుగు పరిశ్రమలోకి రావాలని కోరుకున్నాను. దేవుడి దయ వల్ల మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌లాంటి ప్రముఖ సంస్థలు నిర్మించిన 'మీటర్'లో అవకాశం వచ్చింది. ఈ సినిమాలో అబ్బాయిలంటే ఇష్టం లేని పాత్రలో కనిపిస్తాను. అయితే నా పాత్ర ఫస్ట్ హాఫ్‌లో కామెడీగా ఉంటుంది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఎక్కడికి వెళ్లినా ప్రేక్షకులు చూపిస్తున్న అభిమానానికి హ్యాపీగా ఉంది.. ఇంత అభిమానం ఊహించలేదు. ప్రస్తుతం తమిళ్‌లో 'డీజిల్' సినిమా చేస్తున్నాను'' అన్నారు.


టాలీవుడ్‌కి హాలీవుడ్ టెక్నీషియన్


● బ్రాడ్ మిన్నిచ్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభోత్సవం ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బెట్స్ వర్క్స్ చేస్తుండగా, తాజాగా ఈ సినిమాకు మరో హాలీవుడ్ సాంకేతిక నిపుణుడు బ్రాడ్ మిన్నిచ్ వీఎఫ్‌ఎక్స్ సూపర్ వైజర్‌గా వర్క్ చేస్తున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. హాలీవుడ్ చిత్రాలు '300', 'ఆక్వామేన్', 'ది బ్యాట్‌మేన్' వంటి వాటికి వర్క్ చేశారు బ్రాడ్ మిన్నిచ్.

సీరియస్ పాయింట్‌ని వినోదంగా చెప్పాం

- పాపారావు బియ్యాల


● పాపారావు, 'దిల్' రాజు

''చదువు వల్ల నేటి తరం పిల్లలపై ఎంత ఒత్తిడి పడుతోందో తెలియజేసే చిత్రమే 'మ్యూజిక్ స్కూల్'. ఇదొక సీరియస్ పాయింట్. కానీ వినోదాత్మకంగా, మ్యూజికల్ ఫిల్మ్‌గా చేశారు పాపారావుగారు. ఈ సినిమాని అందరూ ఆదరించాలి'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. శ్రియ మెయిన్ లీడ్‌లో నటించిన చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. పాపారావు బియ్యాల దర్శకత్వంలో యామినీ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన చిత్రమిది. తమిళంలో డబ్బింగ్ చేశారు. మే 12న ఈ సినిమాని హిందీలో పీవీఆర్, తెలుగులో 'దిల్' రాజు రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'మ్యూజిక్ స్కూల్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. దర్శకుడు పాపారావు బియ్యాల (ఐఏఎస్ ఆఫీసర్) మాట్లాడుతూ– ''ప్రస్తుతం తల్లిదండ్రులు, టీచర్స్, సమాజం.. పిల్లలపై చదువు పేరుతో ఒత్తిడిని పెంచేస్తున్నారు. ఇలాంటివి విద్యార్థుల ఎదుగుదలకు సమస్యగా మారుతున్నాయి. ఈ విషయాన్ని సంగీతం రూపంలో వినోదాత్మకంగా చెప్పాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, కెమెరా: కిరణ్ డియోహన్స్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
40	34
57,614	16,952

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,650	▽	118
డోజోన్స్	32,348	▽	84
ఎఫ్‌టీఎస్ఈ 100	7,484	△	12
డాక్స్	15,142	△	14
షాంఘై	3,245	△	6
నికాయ్	27,518	△	41

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)
ముంబై
బంగారం (24 క్యారట్) 58,956 ▽ 131
బంగారం (22 క్యారట్) 58,729 ▽ 72
వెండి (కేజీ) 69,500 ▽ 73

పాన్-ఆధార్ అనుసంధానానికి గడువు పెంపు

జూన్ 30 వరకూ అవకాశం

న్యూఢిల్లీ: పాన్, ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు నిర్దేశించిన గడువును ప్రభుత్వం మరో మూడు నెలల పాటు జూన్ 30 వరకూ పొడిగించింది. వాస్తవానికి ఇది మార్చి 31తో ముగియాల్సి ఉంది. అయితే, ఆధార్‌తో పాన్‌ను అనుసంధానం చేసుకునేందుకు ప్రజలకు మరింత సమయం ఇవ్వాలంటూ రాజకీయ పార్టీలు సహా పలు వర్గాల నుంచి డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్యాక్స్‌పేయర్లకు మరికాస్త సమయం ఇచ్చే క్రమంలో పాన్, ఆధార్‌ను లింక్ చేసుకునేందుకు గడువు తేదీని 2023 జూన్ 30 వరకు పెంచినట్లు ఆర్థిక శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిర్దేశిత గడువులోగా వీటిని లింకు చేసుకోని వారి పాన్ నంబర్లు జూలై 1 నుంచి పనిచేయవు. దీని వల్ల ట్యాక్స్‌పేయర్లు ట్యాక్స్ రీఫండ్‌లను గానీ వాటిపై వడ్డీలను గానీ క్లెయిమ్ చేసుకోవడానికి వీలుండదు. అలాగే వారికి టీడీఎస్, టీసీఎస్ భారం కూడా ఎక్కువగా ఉంటుంది. పాన్, ఆధార్ అనుసంధానానికి ప్రభుత్వం డెడ్‌లైన్‌ను పలు దఫాలు పొడిగిస్తూ వస్తోంది. వాస్తవానికి గతేడాది (2022) మార్చి ఆఖరు నాటికే పాన్‌ను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని తొలుత గడువు విధించారు. అది దాటాకా 2022 ఏప్రిల్ 1 నుంచి రూ. 500 జరిమానా ప్రతిపాదించారు. దాన్ని గతేడాది జూలై 1 నుంచి రూ. 1,000కి పెంచారు. ప్రస్తుతం ఇదే పెనాల్టీ అమలవుతోంది. ఇప్పటివరకు 51 కోట్ల పాన్‌లు (పర్మనెంట్ అకౌంటు నంబర్) ఆధార్‌తో అనుసంధానమయ్యాయి.



నామినీ అప్‌డేట్ గడువు పొడిగింపు: సెబీ



న్యూఢిల్లీ: ప్రస్తుత డీమ్యాట్ ఖాతాదారులు, మ్యూచువల్ ఫండ్(ఎంఎఫ్) ఇన్వెస్టర్లకు నామినీ వివరాలు అప్‌డేట్ చేయడం లేదా తొలగించేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గడువును ఆరు నెలలు పొడిగించింది. ప్రస్తుత గడువు మార్చి 31తో ముగియనుండగా.. ఈ ఏడాది సెప్టెంబర్ 30వరకూ అనుమతిస్తూ తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. 2021 జూలైలో తొలుత అర్హతగల ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాదారులంతా 2022 మార్చి31లోగా నామినీ వివరాలు దాఖలు చేయవలసిందిగా సెబీ ఆదేశించింది. ఇలా చేయని ఖాతాలను డెబిట్‌లు చేపట్టేందుకు వీలు లేకుండా నిలిపివేయనున్నట్లు తెలియజేసింది. తదుపరి 2023 మార్చి31లోగా డీమ్యాట్ ఖాతాలు, ఎంఎఫ్ ఫోలియోలకు నామినీ వివరాలు జత చేయడం తప్పనిసరి చేసింది. వెరసి నామినీ వివరాలు అందించడం లేదా నామినేషన్‌ను ఉపసంహరించేందుకు మరో ఆరు నెలల గడువు లభించింది. 2022 ఆగస్ట్1 లోగాఎంఎఫ్ సబ్‌స్క్రయిబర్లకు నామినీ వివరాలివ్వడం లేదా నామినేషన్ నుంచి తప్పుకునేందుకు 2022 జూన్‌లో సెబీ తప్పనిసరి చేసింది. ఆపై 2022 అక్టోబర్ 1వరకూ గడువు పెంచింది. తదుపరి 2023 మార్చి31వరకూ మరోసారి గడువు పొడిగించింది. 2021 అక్టోబర్ తదుపరి డీమ్యాట్ ఖాతాలు తెరిచే ఇన్వెస్టర్లకు డిక్లరేషన్ ఫామ్ ద్వారా నామినీ వివరాలిచ్చేందుకు వీలు కల్పించింది. ఇదేవిధంగా నామినేషన్‌ను తప్పించేందుకూ వీలుంది.

క్యూ1లో హైరింగ్ అప్

- 10 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా
- టీమ్‌లీజ్ నివేదిక



ముంబై: అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు నెలకొన్నప్పటికీ సర్వీసులు, తయారీ రంగాల కంపెనీలు మాత్రం నియామకాలపై ఆసక్తి చూపుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోలిస్తే 2023-24 క్యూ1లో ఇది 10 శాతం అధికంగా ఉండగలదని అంచనాలు నెలకొన్నాయి. అయితే, 2022-23 నాలుగో త్రైమాసికంతో పోలిస్తే మాత్రం 4 శాతం తక్కువగా ఉండనున్నట్లు తెలుస్తోంది. టీమ్‌లీజ్ సర్వీసెస్‌కి చెందిన ఉపాధి అంచనాల నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 14 రంగాలకు చెందిన 809 చిన్న, మధ్య తరహా, భారీ సంస్థలపై చేసిన సర్వే ఆధారంగా టీమ్‌లీజ్ దీన్ని రూపొందించింది. ఇందులో పాల్గొన్న 64 శాతం మంది యజమానులు తమ సిబ్బంది సంఖ్యను పెంచుకోవాలని ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. నివేదిక ప్రకారం సర్వీస్, తయారీ రంగాల్లో క్యూ1లో ప్రధానంగా ఎంట్రీ, జూనియర్ స్థాయి నియామకాలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సర్వీసుల్లో ఇవి వరుసగా 73 శాతం, 71 శాతంగా ఉండగా .. తయారీలో 49 శాతం, 55 శాతంగా ఉన్నాయి. మధ్య స్థాయి ఉద్యోగాలకు సంబంధించి సర్వీసుల్లో 54 శాతంగాను, తయారీలో 32 శాతంగాను ఉన్నాయి.

అత్యధికంగా సర్వీస్ రంగంలో..

తయారీ విభాగంతో పోలిస్తే సర్వీసుల రంగంలో హైరింగ్‌కు ఎక్కువగా ఆస్కారం ఉంది. సేవా రంగం విషయానికొస్తే ఇది టెలికమ్యూనికేషన్స్‌లో 96%, ఆర్థిక సర్వీసులు (93%), ఈ-కామర్స్.. అనుబంధ స్టార్టప్‌లు (89%), రిటైల్ (87%), విద్యా సర్వీసుల్లో 83%గా ఉంది. తయారీ రంగంలో హెల్త్‌కేర్ .. ఫార్మాలో 91 శాతంగా, ఎఫ్‌ఎంసీజీలో 89 శాతంగా, ఎలక్ట్రిక్ వాహనాలు.. మౌలిక సదుపాయాల కల్పనలో 73 శాతంగా ఉంది.

స్మార్ట్ కీతో యాక్టివా 125

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా తాజాగా ఆధునీకరించిన ఇంజన్‌తో యాక్టివా 125 స్కూటర్‌ను నాలుగు వర్షన్స్‌లో విడుదల చేసింది. డ్రమ్, డ్రమ్ అలాయ్, డిస్క్, హెచ్-స్మార్ట్ వీటిలో ఉన్నాయి. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.81,342 నుంచి రూ.90,515 వరకు ఉంది. అయిదు రంగుల్లో లభిస్తుంది. స్టార్ట్/స్టాప్ ఫీచర్, సైడ్ స్టాండ్ కట్ ఆఫ్ స్విచ్, ఎక్స్‌టర్నల్ ఫ్యూయల్ ఫిల్లర్ క్యాప్, ఓపెన్ గ్లోవ్ బాక్స్, ఎల్‌ఈడీ పొజిషన్ ల్యాంప్‌తో ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్ ఉంది. రియల్ టైమ్ మైలేజ్, ట్యాంకులో ఉన్న ఇంధనంతో ప్రయాణించే దూరం, ఇంధనం ఎంత ఉంది, సగటు మైలేజ్, సమయం వంటి వివరాలను చూపే చిన్న డిజిటల్ స్క్రీన్ పొందుపరిచారు. ఇంధన సమర్థవంతమైన టైర్లను జోడించారు. స్మార్ట్ ఫైండ్, సేఫ్, అన్‌లాక్, స్టార్ట్ ఫీచర్లు గల స్మార్ట్ కీతో టాప్ ఎండ్ వేరియంట్ లభిస్తుంది. వాహనాల మధ్య ఈ స్కూటర్ ఎక్కడ ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు.



కమీషన్లపై బీమా కంపెనీలకు స్వేచ్ఛ

- కమీషన్లపై పరిమితి ఎత్తివేత
- పాలసీదారుల ప్రయోజనాలకు విఘాతం కలగొద్దు
- ఐఆర్‌డీఏఐ ఆదేశాలు



న్యూఢిల్లీ: కమీషన్ల పరంగా పరిమితులను బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) తొలగించింది. బీమా కంపెనీలు తమ పాలసీలను విక్రయించే మధ్యవర్తులకు కమీషన్లు చెల్లిస్తుంటాయి. ఈ భారం పరోక్షంగా పాలసీదారులపైనే పడుతుంది. అందుకే లోగడ ఈ విషయంలో ఐఆర్‌డీఏఐ పరిమితులు పెట్టింది. తాజాగా వీటిని ఎత్తివేస్తున్నట్టు తెలిపింది. మధ్యవర్తులకు ఎంత కమీషన్ చెల్లించాలన్నది బీమా కంపెనీలే నిర్ణయించుకోవచ్చని పేర్కొంది. కాకపోతే పాలసీదారుల ప్రయోజనాలకు భంగం కలగకుండా ఇది ఉండాలని స్పష్టం చేసింది. పాలసీదారులు, ఏజెంట్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కమీషన్ పాలసీని ఇన్సూరెన్స్ కంపెనీ బోర్డ్ రూపొందించుకోవాలంటూ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. కమీషన్లలో సౌలభ్యం ఉంటే అది దేశంలో బీమా కవరేజీ వ్యాప్తికి దోహదపడుతుందని, వ్యయాల పరంగా సామర్థ్యాలను పెంచుతుందని పేర్కొంది. బోర్డు స్థాయిలో నిర్ణయించే కమీషన్ అనేది తాజా నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిర్వహణ వ్యయ పరిమితుల పరిధిలోనే ఉండాలని స్పష్టంగా నిర్దేశించింది. నూతన నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. నోటిఫికేషన్ తేదీ నుంచి ప్రతి మూడేళ్లకోసారి నిబంధనలను సమీక్షిస్తామని ఐఆర్‌డీఏఐ ప్రకటించింది. ఇప్పటి వరకు బీమా కంపెనీలు చెల్లించే కమీషన్లను ఉత్పత్తుల వారీగా ఐఆర్‌డీఏఐ నిర్ణయిస్తోంది. తాజా సవరణలు ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయనే అభిప్రాయాన్ని ఐఆర్‌డీఏఐ వ్యక్తం చేసింది. నూతన వ్యాపార నమూనాలు, ఉత్పత్తులు, వ్యూహాల అభివృద్ధికి వీలు కల్పిస్తాయని పేర్కొంది. సవరించిన నిర్వహణ వ్యయ పరిమితులు, కమీషన్ పరిమితులు అనేవి సరైన మార్గంలో ఉన్నాయని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ తపన్ సింఘాల్ తెలిపారు.

ఎవలాన్ టెక్ @ 415-436

- ఏప్రిల్ 3-6 మధ్య ఐపీవో

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ తయారీ సర్వీసుల కంపెనీ ఎవలాన్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 415-436 ధరల శ్రేణి ప్రకటించింది. ఏప్రిల్ 3న ప్రారంభంకానున్న ఇష్యూ 6న ముగియనుంది. తద్వారా కంపెనీ రూ. 865 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఈ నెల 31న షేర్లను విక్రయించనుంది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 545 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. షేర్ల జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 34 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఏప్రిల్ 18న షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానున్నాయి. ఎండ్‌టుఎండ్ ఎలక్ట్రానిక్ మ్యాన్యుఫాక్చరింగ్ సర్వీస్ సొల్యూషన్లు అందిస్తున్న ఎవలాన్ టెక్ 1999లో ఏర్పాటైంది. యూఎస్‌తోపాటు దేశీయంగా 12 తయారీ ప్లాంట్లను నిర్వహిస్తోంది. 2021-22లో రూ. 840 కోట్ల ఆదాయం సాధించింది.



పరిమిత శ్రేణిలో ట్రేడింగ్

- ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ ముందు అప్రమత్తత
- స్వల్పంగా నష్టపోయిన సూచీలు



ముంబై: ట్రేడింగ్‌లో లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. మార్చి నెలవారీ ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ(నేడు)కి ముందురోజు ట్రేడర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు దేశీయ ట్రేడింగ్ ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఉదయం సెన్సెక్స్ 98 పాయింట్ల లాభంతో 57,752 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 455 పాయింట్ల పరిధిలో 57,495 వద్ద కనిష్టాన్ని, 57,949 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 40 పాయింట్ల నష్టంతో 57,614 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44 పాయింట్లు పెరిగి 17,032 వద్ద మొదలైంది.ఇంట్రాడేలో 16,914 -17,062 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 34 పాయింట్లు పతనమై 16,952 వద్ద ముగిసింది. ప్రైవేట్ రంగ బ్యాంక్స్ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్ల భారీ నష్టాలను చవిచూశాయి. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.79%, 0.42 శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1531 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.156 కోట్ల షేర్లను విక్రయించారు. కాగా, డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 82.16 స్థాయి వద్ద స్థిరపడింది.

వేదాంతా డివిడెండ్ రూ. 20.5

వేదాంతా లిమిటెడ్ వాటాదారులకు ఐదో మధ్యంతర డివిడెండు ప్రకటించింది. రూ. 1 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 20.5 చొప్పున చెల్లించనుంది. ఇందుకు ఏప్రిల్ 7 రికార్డ్ డేట్‌కాగా.. మొత్తం రూ. 7,621 కోట్లు వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

జాబ్ పాయింట్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబైలో 5000 అప్రెంటిస్‌లు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా సీబీ శాఖల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 5000 (తెలంగాణలో 106, ఆంధ్రప్రదేశ్‌లో 141).
» **కేటగిరీ వారీగా ఖాళీలు:** ఎస్సీ-763, ఎస్టీ-416, ఓబీసీ-1162,ఈడబ్ల్యూఎస్-500,జనరల్- 2159. » **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.
» **వయసు:** 31.03.2023 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. » **స్టైపెండ్:** నెలకు రూ.10,000(రూరల్ బ్రాంచ్), రూ.12,000(అర్బన్ బ్రాంచ్), రూ.15,000(మెట్రో బ్రాంచ్) తోపాటు ఇతర అలవెన్సులు అందుతాయి.
» **ఎంపిక విధానం:**ఆన్‌లైన్ రాతపరీక్ష,ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన,రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ఎంపికచేస్తారు.
» **రాతపరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్,కంప్యూటర్ నాలెడ్జ్,బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్,బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్,బేసిక్ ఇన్‌వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్,బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 03.04.2023.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** ఏప్రిల్ 2వ వారం, 2023.
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఈపీఎఫ్‌వో, న్యూఢిల్లీలో 185 స్టెనోగ్రాఫర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో).. రెగ్యులర్ ప్రాతిపదికన స్టెనోగ్రాఫర్(గ్రూప్ సి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 185
» **అర్హత:** పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు స్టెనోగ్రఫీ నైపుణ్యం కలిగి ఉండాలి.
» **వయసు:** దరఖాస్తు చివరితేది నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 నుంచి 15 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3 నుంచి 8 ఏళ్ల సడలింపు ఉంటుంది. » **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్టెనోగ్రఫీ స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. 200 ప్రశ్నలకు-800 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం 130 నిమిషాలు. జనరల్ ఆప్టిట్యూడ్(50 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్(కంప్యూటర్ అవేర్‌నెస్‌తో సహా 50 ప్రశ్నలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(100 ప్రశ్నలు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు 4 మార్కులు ఉంటాయి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 27.03.2023 నుంచి 26.04.2023 వరకు. » **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.04.2023 నుంచి 28.04.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.epfindia.gov.in

ఎన్ఆర్ఎస్‌సీ, హైదరాబాద్‌లో 34 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ).. తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 34
» **ఖాళీల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)-20, ప్రాజెక్ట్ అసోసియేట్1 -07, ప్రాజెక్ట్ సైంటిస్ట్-03, రీసెర్చ్ సైంటిస్ట్-04.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, గేట్/నెట్ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 07.04.2023 నాటికి జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు, ఆర్ఎస్‌కు 30 ఏళ్లు, పీఏ, పీఎస్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **పని ప్రదేశం:** ఎన్ఆర్ఎస్సీ-ఎర్త్ స్టేషన్, షాద్‌నగర్ క్యాంపస్, రంగారెడ్డి జిల్లా లేదా ఎన్ఆర్ఎస్సీ, బాలానగర్, హైదరాబాద్.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.04.2023.
» **వెబ్‌సైట్:** www.nrsc.gov.in

యూపీఎస్సీలో 40 ఉద్యోగాలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ సంస్థల్లో పనిచేసేందుకు పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **పోస్టుల వివరాలు:** జాయింట్ డైరెక్టర్, హార్టికల్చర్ స్పెషలిస్ట్, అసిస్టెంట్ హార్టికల్చర్ స్పెషలిస్ట్, మార్కెటింగ్ ఆఫీసర్, ఎకనమిక్ ఆఫసర్ తదితరాలు. » **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ/ఎంబీబీఎస్/ఇంజనీరింగ్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. » **పని అనుభవం:** కనీసం 2 నుంచి 10 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2023.
» **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

ఎంబీఏ, ఎంసీఏకు మార్గం.. ఐసెట్

» ఏపీ ఐసెట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» మే 24, 25 తేదీల్లో ఏపీ ఐసెట్ పరీక్ష
» ఈ ర్యాంకుతో ఎంబీఏ, ఎంసీఏల్లో ప్రవేశం
» మేనేజ్‌మెంట్, ఐటీ విభాగాల్లో కొలువులకు మార్గం

మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఎంబీఏ! మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్.. సంక్షిప్తంగా ఎంసీఏ! ఇవి డిగ్రీ చదువుతున్న విద్యార్థుల్లో.. ఎక్కువ మంది ఆసక్తి చూపే కోర్సులు! కారణం.. ఈ కోర్సులతో మేనేజ్‌మెంట్, ఐటీ రంగాల్లో కొలువు సొంతం చేసుకోవచ్చనే ధీమా! ఆంధ్రప్రదేశ్‌లో ఈ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే.. ఏపీ ఐసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఏపీ ఐసెట్-2023 వివరాలు, పరీక్ష విధానం, విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై విశ్లేషణ..

ఐసెట్‌గా సుపరిచితమైన ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్- 2023కు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు, సీట్లు; ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తున్న వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు అందరికీ సీట్లు లభించే అవకాశముంది. కాని టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు సొంతం చేసుకోవాలంటే మాత్రం వేయి లోపు ర్యాంకుతోనే సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అర్హతలు

- ఎంబీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఎంసీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్మీడియెట్ లేదా డిగ్రీ స్థాయిలో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు 45 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

200 మార్కులు.. మూడు విభాగాలు



- మొత్తం 200 మార్కులకు మూడు విభాగాల్లో ఏపీ ఐసెట్ ఉంటుంది. అభ్యర్థుల్లోని లాంగ్వేజ్, మ్యాథమెటికల్ స్కిల్స్, కాంప్రహెన్షన్ స్కిల్స్‌ను పరీక్షించే విధంగా ఆయా విభాగాలు, ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్‌ఏలో అనలిటికల్ ఎబిలిటీ(డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్) 75ప్రశ్నలు-75 మార్కులకు; సెక్షన్ బీలో కమ్యూనికేషన్ ఎబిలిటీ(వొకాబ్యులరీ, ఫంక్షనల్ గ్రామర్, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ, రీడింగ్ కాంప్రహెన్షన్) 70 ప్రశ్నలు-70 మార్కులకు; సెక్షన్ సీలో మ్యాథమెటికల్ ఎబిలిటీ(అర్థమెటికల్ ఎబిలిటీ, అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ) 55 ప్రశ్నలు-55 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.
- పరీక్షను రెండు సెషన్లుగా నిర్వహిస్తారు. రెండు సెషన్లలో హాజరైన అభ్యర్థులు పొందిన మార్కులను నిర్దిష్ట విధానంలో నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా గణించి ర్యాంకులు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 19, 2023
- రూ.వేయి ఆలస్య రుసుముతో ఏప్రిల్ 26 వరకు; రూ.2000 ఆలస్య రుసుముతో: మే 3 వరకు; రూ.3000 ఆలస్య రుసుముతో మే 10 వరకు; రూ.5,000 ఆలస్య రుసుముతో మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** మే 16, 17 తేదీల్లో
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** మే 20 నుంచి
- **ఏపీ ఐసెట్ పరీక్ష తేదీ:** మే 24, 25, 2023
- **వెబ్‌సైట్:**https://cets.apsche.ap.gov.in

విజయానికి అడుగులు ఇలా

ఐసెట్ పరీక్షలో విజయం సాధించాలంటే..అభ్యర్థులు విశ్లేషణాత్మక దృక్పథం, అన్వయ నైపుణ్యాలను అలవర్చుకోవాలి. పరీక్ష తీరు, సిలబస్ స్థాయిపై అవగాహన పొందాక విభాగాల వారీగా ప్రిపరేషన్‌తోపాటు ప్రతి రోజూ ప్రాక్టీస్ కొనసాగించాలి.

డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్

ఈ విభాగంలో ఉండే డేటా సఫిషియెన్సీ; ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాల్లో రాణించాలంటే.. అభ్యర్థులు తమ విశ్లేషణ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి.

ప్రశ్నలు డేటా ఇచ్చి దాని ఆధారంగా సమస్య సాధించేవిగా, స్టేట్‌మెంట్ ఆధారితంగా ఉంటాయి. బేసిక్ అర్థమెటిక్ అంశాల్లో పట్టు సాధించడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. గణితంపై ప్రాథమిక అవగాహన అవసరం. ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు కోడింగ్, డీ-కోడింగ్, బ్లడ్ రిలేషన్, సిరీస్, సిలాజిజమ్, సీటింగ్ ఎరేంజ్‌మెంట్ వంటి అంశాల్లో పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- కొంత సులభమైన విభాగంగా సెక్షన్-బి(కమ్యూనికేషన్ ఎబిలిటీ)ని పేర్కొనొచ్చు. కాసింత ప్రాక్టీస్, అనలిటికల్ ఎబిలిటీ, కంపేరిటివ్ అప్రోచ్ ఉంటే మొత్తం 70 ప్రశ్నల్లో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించొచ్చు.
- వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. వొకాబ్యులరీ పెంచుకునేందుకు ప్రతి రోజు కనీసం 20 కొత్త పదాలు నేర్చుకోవడంతోపాటు వాటిని వినియోగించే విధానాన్ని ప్రాక్టీస్ చేయాలి.
- ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం సినానిమ్స్, యాంటానిమ్స్, కొశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ గ్రామర్ బుక్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.
- బిజినెస్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీలో వ్యాపార-వాణిజ్య అంశాలు, తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. వీటిలో రాణించాలంటే.. బిజినెస్ టెర్మినాలజీ, కొత్త వ్యాపార విధానాలు, ఆయా సంస్థలు-వాటి క్యాప్షన్లు వంటివి తెలుసుకోవాలి. ఇక కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన ముఖ్య భాగాలు, వాటి పనితీరుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం కలిసొస్తుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో.. ప్యాసేజ్‌ల ఆధారంగా అడిగే 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులు అందులోని కీలక పదాలను, కీలక సారాంశాన్ని గ్రహించే నేర్పు అవసరం. ఇందుకోసం దినపత్రికల వ్యాసాలు, ఇంగ్లిష్ స్టోరీ బుక్స్ చదవడం మేలు చేస్తుంది.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

సెక్షన్-సిగా పేర్కొన్న మ్యాథమెటికల్ ఎబిలిటీలో రాణించేందుకు అర్థమెటిక్, జామెట్రికల్, స్టాటిస్టికల్ అంశాలపై పట్టు సాధించాలి. తొలుత మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలపై అవగాహన పొందాలి. ఇందుకోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నల శైలి కొంత క్లిష్టంగా ఉండే స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను ప్రిపేరవ్వాలి. ముఖ్యంగా ప్రాబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాల కోసం ఇంటర్ పుస్తకాలను చదవాలి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు శాతాలు, లాభ నష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని-కాలం, పని-సమయం వంటి వాటిని అధ్యయనం చేయాలి. అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ కోసం ట్రిగ్నోమెట్రీ,సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్‌లో నైపుణ్యం సాధించాలి.

ప్రాక్టీస్.. సక్సెస్‌కు సాధనం

ఐసెట్‌లో మంచి ర్యాంకు సొంతం చేసుకోవడానికి ప్రధాన సాధనం..ప్రాక్టీస్. ఆయా అంశాల రీడింగ్‌కే పరిమితం కాకుండా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. నిరంతరం మాక్ టెస్ట్‌లకు హాజరవుతూ.. తమ సామర్థ్యాలను విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా క్యాట్, మ్యాట్, ఐసెట్ గత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి. ఫలితంగా పరీక్షలో ప్రశ్నల శైలిపై అవగాహన ఏర్పడుతుంది.

కొల్లేరు పక్షుల లెక్క తేలింది

అభయారణ్యంలో ముగిసిన అటవీశాఖ పక్షుల గణన





సాక్షి ప్రతినిధి, ఏలూరు : పక్షి ప్రేమికుల స్వర్గధామమైన కొల్లేరు అభయారణ్యంలో ఏషియన్ వాటర్ బర్డ్స్ సెన్సస్–2023 ముగిసింది. అటవీశాఖ సిబ్బంది 12 బృందాలుగా ఏర్పడి ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఈ నెలాఖరు వరకు ఏలూరు జిల్లాలో విస్తరించిన కొల్లేరు సరస్సు పరీవాహక ప్రాంతాల్లో పక్షుల గణన చేశారు. అభయారణ్యం పరిధిలో వివిధ జాతులకు చెందిన 105 రకాల పక్షి జాతులను, 81,495 పక్షులను గుర్తించారు. వీటిలో మొదటి స్థానంలో కోయిలలు, రెండోస్థానంలో పెలికాన్ పక్షులు ఉండగా... అరుదైన పిన్‌టయిల్ స్నిప్ (సూది తోక పుర్రెది) పక్షి ఒకటి, సిట్రిన్ వాగ్‌టయిల్ (పసుపు తల జిట్టంగి) పక్షులు నాలుగు కనిపించాయి.

పక్షుల గణన ఎలా చేశారంటే...

పాడిసిపెడి ఫార్మ్స్ (గ్రేబ్స్, నీటి ప్రయాణ పక్షులు), అన్సెరి ఫార్మ్స్ (బాతులు), చరాద్రి ఫార్మ్స్ (నీటి దగ్గర నివసించే పక్షులు), సికోని ఫార్మ్స్ (కొంగ జాతి పక్షులు), చిత్తడి నేలలపై ఆధారపడే పక్షులు... ఇలా ఐదు కుటుంబ కేటగిరీలుగా తీసుకుని పక్షుల గణన చేశారు. పక్షి నిపుణుడు, రికార్డింగ్ చేసే వ్యక్తి, ఫొటోగ్రాఫర్, గైడ్‌తోపాటు మరో ముగ్గురు కలిసి మొత్తం ఏడుగురు సభ్యులతో కూడిన 12 బృందాలు ఈ సర్వే చేశాయి.

సర్వేలో గుర్తించిన ముఖ్యమైన పక్షుల వివరాలు...

పక్షి పేరు	సంఖ్య
సాధారణ కోయిలలు (స్వాలో)	7,875
గూడబాతు (పెలికాన్)	6,869
సూదితోక బాతు (నార్తరన్ పిన్‌టయిల్)	5,365
కంకణాల పిట్ట (గ్లోబీ ఐబీస్)	4,637
పెద్ద చిలువ బాతు (లార్జ్ విజ్లింగ్ డక్)	4,335
ఎర్ర కాళ్ల కొంగ (పెయింటెడ్ స్టార్క్)	4,233
నల్లరెక్కల ఉల్లంకి పిట్ట(బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్)	4,033
తొండు వల్లంకి (బ్లాక్ టయిల్డ్ గాట్‌విట్)	3,275
చిన్న నీటి కాకి (లిటిల్ కార్మోరెంట్)	2,944
చెరువు బాతు (గార్గనే)	2,642
తెడ్డుముక్కు కొంగ(ఏషియన్ ఓపెన్‌బిల్ స్టార్క్)	2,199
ఈల వేసే చిన్నచిలువ బాతు (లెస్సర్ విజిలింగ్ డెక్)	2,595,
తెల్ల కొంగ (మేడైన్ ఎగ్రెట్)	2,141
బ్రాహ్మణి బాతు (బ్రాహ్మణి షెల్‌డక్)	2,025
బంగారు ఉల్లంకి (పసిఫిక్ గోల్డెన్ ప్లోవర్)	1,215
చింత వాఖి (బ్లాక్ క్రౌన్డ్ నైట్ హెరాన్)	1,082

తక్కువగా కనిపించిన పక్షులు

ఈ సర్వేలో పిన్‌టయిల్ స్నిప్ (సూది తోక పుర్రెది) పక్షి ఒకటి, సిట్రిన్ వాగ్‌టయిల్ (పసుపు తల జిట్టంగి) పక్షులు నాలుగు, మరికొన్ని జాతుల పక్షులు చాలా తక్కువగా కనిపించాయి.

పక్షుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం



కొల్లేరులోని సహజసిద్ధ వాతావరణం పక్షులను ఆకర్షిస్తోంది. దేశ విదేశాల నుంచి ఏటా విడిది కోసం కొల్లేరుకు వేలాదిగా పక్షులు వస్తుంటాయి. వీటి సంరక్షణ కోసం అటవీశాఖ అన్ని చర్యలు తీసుకుంటోంది. కొల్లేరు అభయారణ్యంలో పక్షుల గణన వల్ల రానున్న రోజుల్లో పక్షుల సంరక్షణకు విధివిధానాలు రూపొందించే అవకాశం ఉంటుంది.

– ఎస్‌వీకే కుమార్, వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ రేంజర్, ఏలూరు

కొల్లేరు అభయారణ్యంలో గుర్తించిన పక్షిజాతులు	105
ప్రస్తుతం ఉన్న మొత్తం పక్షులు	81,495
అత్యధికంగా గుర్తించిన కోయిలల సంఖ్య	7,875
రెండోస్థానంలో ఉన్న పెలికాన్ పక్షుల సంఖ్య	6,869


కొల్లేరు అభయారణ్యంలో పరద బాతుల సంచారం

సర్వే ఎక్కడ చేశారంటే...

అంతర్జాతీయ సంస్థల సమన్వయంతో 1962 నుంచి అటవీశాఖ కొల్లేరు అభయారణ్యంలో పక్షుల గణన నిర్వహిస్తోంది. ఏలూరు జిల్లాలోని కైకలూరు, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. వాటి పరిధిలోని ఆటపాక–పల్లెవాడ, శృంగవరప్పాడు–పైడిచింతపాడు, మణుగునూరులంక–తక్కెళ్లపాడు, మాధవపురం–గుడివాకలంక, కొక్కిరాలలంక–పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక–యాగనమిల్లి, క్రొవ్విడిపాయ–అడవికొలను, నిడమర్రు–తోకలపల్లి, పెద ఎడ్లగాడి–శ్రీపర్రు, జయపురం–వడ్డిగూడెం, బొమ్మిడిలంక–పోతునూరు, ఆగడాలలంక–చెట్టున్నపాడు గ్రామాల మధ్య పక్షుల గణన చేశారు.

రాజధానిపై జూలై 11న విచారణ

- సుప్రీం కోర్టు ధర్మాసనం వెల్లడి
- ఉపసంహరించిన చట్టాలపై హైకోర్టు తీర్పు చెప్పింది
- కేసులో పూర్తిస్థాయి స్టే లేదు
- ఈ అంశాన్ని త్వరగా తేల్చాలి
- సుప్రీం కోర్టును కోరిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన పిటిషన్లు జూలై 11న విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. మూడు రాజధానుల ఏర్పాటుపై ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌తోపాటు మరికొన్ని వ్యాజ్యాలు మంగళవారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చాయి. ఇతర కేసుల విచారణతో కోర్టు సమయం ముగియడంతో ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు కేకే వేణుగోపాల్, నిరంజన్‌రెడ్డిలు పిటిషన్ విచారణ అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఇప్పటికిప్పుడు విచారణ సాధ్యం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. వీలైనంత త్వరగా విచారణ తేదీ ఖరారు చేయాలని, ఏప్రిల్ 11 జాబితాలో చేర్చాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాదులు కోరారు. అయితే, జూలై 11న జాబితాలో చేర్చాలని ఆదేశిస్తామని ధర్మాసనం తెలిపింది. అప్పటి వరకు కాకుండా ఏప్రిల్‌లో ఏదో ఒక తేదీ ఖరారు చేయాలని ఏపీ న్యాయవాదులు కోరారు. ఏప్రిల్ 11న ఇప్పటికే 13 అంశాలు జాబితా అయ్యాయని ఆ తర్వాత అంశంగా చేపడతామని జస్టిస్ జోసెఫ్ చెప్పారు. జాబితాలో తొలి అంశంగా చేర్చాలని, గతంలోనూ తొలి అంశంగా చేర్చారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. జూలైలో విచారణ చేపడతామని, ఈ మధ్య కాలంలో సుదీర్ఘ విచారణ సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. విచారణకు ఎంత సమయం తీసుకుంటారని అన్ని పక్షాల న్యాయవాదులను జస్టిస్ బీవీ నాగరత్న కోరారు. ప్రతివాదులుగా సుమారు 250 మంది ఉన్నారని ఓ న్యాయవాది తెలిపారు. ఏపీ తరఫు న్యాయవాది కేకే వేణుగోపాల్ స్పందిస్తూ.. 'రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్న చట్టాలపై హైకోర్టు తీర్పు ఇచ్చింది. అలాగని పూర్తిస్థాయి స్టే ఎక్కడా లేదు. పైగా ఈ అంశం కోర్టు పరిధిలోది కాదు. ఇది పూర్తిగా అకడమిక్ (థియరిటికల్ ఆసక్తి ఉంటుంది కానీ ప్రాక్టికల్ రిలవెన్స్ ఉండదు). వాదనలకు ఓ గంట చాలు. రాష్ట్ర ప్రభుత్వం చేతులు కట్టేశారు. అభివృద్ధి ముందుకు వెళ్లడంలేదు. మీరే త్వరగా విచారణ పూర్తి చేయాలి. ఈ అంశాన్ని తేల్చాలి'' అని ధర్మాసనానికి వివరించారు. దీనికి జస్టిస్ కేఎం జోసెఫ్ స్పందిస్తూ.. జూన్‌లో పదవీ విరమణ చేస్తున్నానని, ఈలోగా సుదీర్ఘంగా కేసు వినడం సాధ్యం కాదని చెప్పారు. జూలై 11న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

162 స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులు భర్తీ

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి చేపట్టిన వాక్–ఇన్ ఇంటర్వ్యూలు ముగిశాయి. ఈ నెల 23 నుంచి మంగళవారం వరకూ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 14 స్పెషాలిటీల్లో 162 పోస్టులను భర్తీ చేశారు. 14 స్పెషాలిటీల్లో 319 పోస్టులను నోటిఫై చేయగా 316 మంది వైద్యులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో 112 పోస్టులు శాశ్వత, 50 పోస్టులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేశారు. వీటిలో జనరల్ మెడిసిన్ 28, జనరల్ సర్జరీ 27, గైనకాలజీ 33, అనస్తీషియా 22, పాథాలజీ 12, పీడియాట్రిక్స్ 12, మిగిలిన స్పెషాలిటీల్లో ఇతర పోస్టులు ఉన్నాయి. మరోవైపు ఎప్పటి ఖాళీలను అప్పుడే భర్తీ చేపట్టేలా అత్యవసర అనుమతులను ప్రభుత్వం ఇచ్చింది.

టీటీడీకి ఎఫ్‌ఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరణ

తిరుమల: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సూచనల మేరకు టీటీడీకి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌ఆర్‌ఏ) లైసెన్స్ రెన్యువల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై విదేశీ కరెన్సీని ఎస్‌బీఐలో డిపాజిట్ చేసుకోవచ్చని పేర్కొంది. సదరు లైసెన్స్‌ను రెన్యువల్ చేయాలని 2019లో టీటీడీ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. 2020 నుంచి 5 సంవత్సరాల కాల పరిమితితో కేంద్రం లైసెన్స్ రెన్యువల్ చేసింది. అయితే, విదేశీ కరెన్సీ డిపాజిట్ సమయంలో దాతల వివరాలు తెలపాలని టీటీడీని కోరింది. హుండీలో కానుకలు సమర్పించే దాతల వివరాలు తమ వద్ద ఉండవని తెలిపిన టీటీడీ.. ఈ అంశంపై మినహాయింపు ఇవ్వాలని 2019 నుంచి కోరుతూ వస్తోంది. కేంద్రం టీటీడీకి లైసెన్స్‌ను పునరుద్ధరించడంతో టీటీడీ వద్ద నిల్వ ఉన్న రూ.30 కోట్ల విదేశీ కరెన్సీ టీటీడీ ఖాతాలో జమ కానుంది.

సీతమ్మకు చేయిస్తి.. చిత్రాల సారెను..

- భక్తులను ఆకట్టుకుంటున్న 'కోవా' కంత


కోవాతో చేసిన వివిధ రకాల స్వీట్లు

పి.గన్నవరం: 'సీతమ్మకు చేయిస్తి.. చింతాకు పతకము..' అంటూ అలనాడు భక్త రామదాసు పాడుకున్నాడు. అదేవిధంగా సీతమ్మ వారికి చిత్రమైన సారెను సమర్పిస్తున్నారు ఆ భక్త దంపతులు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరంలోని శ్రీ పట్టాభి రామాలయంలో ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతులు 20 రోజులుగా కోవాతో వివిధ రకాల స్వీట్లతో సారె తయారు చేయిస్తున్నారు. కల్యాణ మహోత్సవంలో శ్రీరాముని తరఫున సీతమ్మ వారికి ఈ సారె (కంత) సమర్పించి తమ భక్తిని చాటుకుంటున్నారు. వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, పంచె, చీర, పర్ణశాల తదితర ఆకృతుల్లో కోవాతో తయారు చేస్తున్న ఈ స్వీట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కోవా స్వీట్లతో పాటు ఇతర పిండి వంటలను సిద్ధం చేస్తున్నారు. 'ఇంటికో పువ్వు.. ఈశ్వరునికో మాల' అన్నట్టుగా.. సారె తయారీలో స్థానిక మహిళా భక్తులు కూడా తమవంతు సేవలు అందిస్తున్నారు.



తొమ్మిది నెలలు.. ఓ మహిళ జీవితంలో మరపురాని కాలం. ఒక్కో నెల ఒక మధురానుభూతి. కనిపించని లోకంలో కదలికలే ఆమె లోకం. వినిపించని అరుపులకు ఆ ముఖమే వికసించే నవ్వులు. వెన్ను విరిగే నొప్పులను భరిస్తుంది.. పురిట్లోని బిడ్డను చూసి ఆ బాధను దిగమింగుతుంది. అందరి జీవితం ఇలా ఉంటే.. ఆ తల్లి 'కడుపు కోత' మాటలకందని వెత. పెళ్లి చెడింది.. ప్రేమ అగాథమైంది. మోసానికి పుట్టిన పాప కళ్లు తెరవక మునుపే తల్లికి దూరమైంది.. కన్న పేగుకు దూరంగా 18 నెలల నుంచి అజ్ఞాతంలో పెరుగుతోంది. ఆ తల్లి ప్రేమించినోడి రాక్షసత్వానికి మౌనంగా రోదిస్తోంది.. ఊహకందని బిడ్డ రూపం మనసులో నిలుపుకొని న్యాయదేవత ఎదుట జీవచ్ఛవంగా మిగిలింది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

మోసం పేరు రాకేష్.. పాప పేరు 18 నెలలు!

ప్రేమపెళ్లి 'ముసుగు'

- ఓ యువతి జీవితంలో చీకటి
- నమ్మించి మోసగించిన జూనియర్ అసిస్టెంట్
- బిడ్డ పుట్టిన తర్వాత మరొకరితో వివాహం
- ప్రశ్నించడంతో దారుణంగా దాడి
- పురిట్లోనే పసికందు మాయం
- ఒంటరి పోరాటం చేస్తున్న గాయత్రి

హాలహర్వికి చెందిన గాయత్రి అదే మండలంలోని ఓ సచివాలయంలో ఉద్యోగం చేస్తోంది. చిన్న వయస్సులోనే జీవితంలో స్థిరపడే అవకాశం రావడంతో పెళ్లి చేసుకొని హాయిగా బతికేద్దాం అని అందరి అమ్మాయిల్లానే ఎన్నో కలలు కనింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు చెందిన ఓ యువకునితో సంబంధం కుదర్చగా.. నిశ్చితార్థం పూర్తయింది. అయితే విధి నిర్వహణలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాకేష్ ఈమెతో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే అతను ప్రేమిస్తున్నట్లు చెప్పడంతో తనకు అప్పటికే నిశ్చితార్థమైన విషయాన్ని బయటపెట్టి దాటవేసింది. ఇలా.. ఆమె మెడలో మూడు ముళ్లు పడినా, ఆ వివాహం ఊహించని గొడవలతో ఐదు రోజులకే పరిమితమైంది. తిరిగి కార్యాలయానికి చేరుకోగానే ఏం జరిగిందని రాకేష్ ఆమెను ఆరా తీయడంతో జరిగిన విషయాన్ని వివరించింది. ''నా ప్రేమ స్వచ్ఛమైంది.. దేవుడు నిన్ను నాతో కలిపేందుకే ఈ పెళ్లి పెటాకులు చేశాడు' అనే మాయ మాటలతో కన్నీరు కార్చడంతో పాటు పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చాడు. జీవితం ముళ్లబాటగా మారిన పరిస్థితుల్లో అతని నయవంచనను గుర్తించలేక సరేనంది. ఇరువురి కులాలు వేరు కావడం, కుటుంబ సభ్యులకు తెలిస్తే ఒప్పుకోరనే భావనతో కర్నూలు చిన్న పార్కు సమీపంలోని మేరిమాత చర్చి వద్ద గాయత్రి మెడలో తాళి కట్టి కాపురం పెట్టారు.



మరో యువతితో వివాహం

రాకేష్ స్వస్థలం ఆదోని. అక్కడ మరో ప్రభుత్వ ఉద్యోగిని లక్ష్మిని కూడా ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇంతలో విషయం తెలుసుకున్న గాయత్రి అక్కడికి వెళ్లి గొడవ చేసింది. అయినప్పటికీ నెల తిరక్కుండానే ఇరువురి కులాలు ఒక్కటి కావడంతో అతను లక్ష్మి పెళ్లి చేసుకోగా.. దిక్కుతోచని గాయత్రి కర్నూలు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎందుకు ఇలా చేశావని అతడిని ప్రశ్నించేందుకు ఆదోనికి వెళ్లగా తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు.

డీఎన్ఏ పరీక్షలతో..

కేసు నమోదు చేసిన పోలీసులు పనిచేస్తున్న ప్రాంతం.. కలిసి ఉన్న ఇల్లు.. డెలివరీ జరిగిన ఆసుపత్రి.. తదితర ప్రాంతాల్లో విచారించి కేసును ఓ కొలిక్కి తీసుకొచ్చారు. అప్పుడు రాకేష్ ఆ బిడ్డతో తనకు ఎలాంటి సంబంధం లేదని బుకాయించాడు. విధిలేని పరిస్థితుల్లో పోలీసులు డీఎన్ఏ పరీక్షలు చేయించగా.. వాస్తవం తేలింది. ఈ నేపథ్యంలో బిడ్డను తనకు అప్పగించాలని గాయత్రి కలెక్టర్, ఎస్పీ, డీజీపీ, మహిళా కమిషన్, దిశ పోలీసుస్టేషన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలతో పాటు ఎన్నో మెట్లు ఎక్కింది, దిగింది.

ఒంటరి పోరాటం

బిడ్డ కోసం గాయత్రి చివరి అస్త్రంగా హైకోర్టును ఆశ్రయించి 'హెబియస్ కార్పస్'(బిడ్డ కన్పించడం లేదు) పిటిషన్ వేసింది. దీంతో సీడబ్ల్యూసీ అధికారులు రాయదుర్గంలోని అన్నపూర్ణ, కళ్యాణ్‌కృష్ణ వద్ద పెరుగుతున్న బిడ్డను స్వాధీనం చేసుకున్నారు. కోర్టు తీర్పు ఆధారంగా బిడ్డను అప్పగిస్తామని చెప్పారు. డీఎన్ఏ టెస్ట్ ద్వారా పోలీసులు రాకేశ్‌కు పుట్టిన బిడ్డే అని తేల్చడంతో అతను కూడా కోర్టులో అదే విషయాన్ని అంగీకరించాడు. చివరకు కోర్టు నిర్ణయం తీసుకునే సమయంలో బిడ్డను ఇన్నిరోజులు పెంచిన కళ్యాణ్‌కృష్ణ, అన్నపూర్ణ దంపతులు కూడా కోర్టులో సోమవారం (ఈ నెల 27న) తమ బిడ్డ కనిపించడం లేదని 'హెబియస్ కార్పస్' పిటిషన్ వేశారు. ఇదిలాఉంటే తన వల్ల తల్లిదండ్రులకు మచ్చ రాకూడదనే ఉద్దేశంతో గాయత్రి ఒంటరి పోరాటం చేస్తోంది.

కళ్లు తెరిచి చూస్తే..

ఆ ప్రేమ, పెళ్లికి తీపిగుర్తుగా గర్భం దాల్చడం, కర్నూలులోని అపెక్స్ ఆసుపత్రిలో ఆడబిడ్డకు జన్మనివ్వడం జరిగిపోయింది. కళ్లు తెరిచి చూసేసరికి బిడ్డలేదు. ఎక్కడని ప్రశ్నిస్తే అనారోగ్యంగా ఉండటంతో పెద్దాసుపత్రిలో చేర్పించానన్నాడు. నమ్మింది.. డిశ్చార్జ్ తర్వాత కూడా బిడ్డ తన ఒడి చేరకపోవడంతో మరోసారి ఆరాతీసింది. నీకు ఆరోగ్యం బాగోలేదు కదా, బంధువుల వద్ద ఉంచానన్నాడు. పాలు ఎలాగంటే, మరొకరితో ఇప్పిస్తున్నాం.. ఎలాంటి ఇబ్బంది లేదన్నాడు. చివరికి ఎలాగో ఆ పాపను అనంతపురం జిల్లా రాయదుర్గంలో పిల్లలు లేని తన సమీప బంధువులకు అప్పగించినట్లు విషయం బయటపడింది. ఈ విషయమై నిలదీయడంతో ఇద్దరి మధ్య దూరం పెరిగింది.

నాకిక బిడ్డే లోకం

ప్రేమ పేరిట వెంటపడ్డాడు. పెళ్లి చేసుకున్నాక కలిసి ఉన్నన్ని రోజులు నా జీతంతోనే గడిపాడు. బంగారం కూడా తీసేసుకున్నాడు. బిడ్డ పుట్టిన తర్వాత అసలు రూపం బయటపడింది. పాపను కళ్లారా చూసుకునే అవకాశం లేకుండా పురిట్లోనే మాయం చేశాడు. ఇప్పుడు పాపకు 18 నెలలు. కనీసం పేరు పెట్టే అవకాశం కూడా లేకుండాపోయింది. బిడ్డ లేకపోయింటే నా ఖర్మ ఇంతేలే అనుకునేదాన్ని. ఇప్పుడు సమాజం నన్ను వేలెత్తి చూపుతోంది. అన్నింటినీ భరించి నా బిడ్డ కోసం బతుకుతున్నా. పాప కోసమే పోరాటం చేస్తున్నా.

– గాయత్రి, బాధితురాలు

కేసు కోర్టు పరిధిలో ఉంది

గాయత్రికి జరిగిన అన్యాయంపై కేసు నమోదు చేశాం. డీఎన్ఏ టెస్ట్‌లో రాకేశ్, గాయత్రిలకు పాప పుట్టిన విషయం తేలింది. ఆ తర్వాత పాప కోసం ఆమె కోర్టును ఆశ్రయించింది. కేసు కోర్టులో నడుస్తోంది. త్వరలోనే జడ్జిమెంట్ వస్తుంది.

– మహ్మద్ తబ్రేజ్, సీఐ, త్రీటౌన్

కొబ్బరికి తెల్లదోమ పోటు


తెల్లదోమ తెగులు ఆశించిన కొబ్బరి తోట

దిగుబడి తగ్గే ప్రమాదం
తెగులును అరికట్టేందుకు సదస్సులు

సాక్షి, భీమవరం: జిల్లాలో వరిసాగు తరువాత ఎంతో ప్రాధాన్యత గల కొబ్బరిసాగుకు తెల్లదోమ ఆశించి రైతులు అవస్థలు పడుతున్నారు. సర్పిలాకార తెల్లదోమ కారణంగా బూజు తెగులు నల్లని మసిలా వృద్ధిచెంది కొబ్బరి ఆకులు నల్లగామారి దిగుబడి తగ్గే ప్రమాదముంది. వేసవిలో ఎక్కువగా ఈ తెగులు వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. తెల్లదోమ తెగులు నివారణకు జిల్లా వ్యాప్తంగా రైతులకు సదస్సులు నిర్వహించేందుకు ఉద్యానశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

37 వేల ఎకరాల్లో ఉద్యాన సాగు

జిల్లా వ్యాప్తంగా 37 వేల ఎకరాల్లో ఉద్యాన సాగుచేస్తున్నారు. ఇందులో 20 వేల ఎకరాలకు పైగా కొబ్బరి సాగు ఉంది. పెట్టుబడి తక్కువ కావడంతో రైతులు పెరటిదొడ్లు, పుంతగట్లు, రహదారుల వెంబడి కొబ్బరి సాగు చేస్తున్నారు. కొబ్బరికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉండడంతో అనేక మంది రైతులు తోటలను సైతం పెంచుతున్నారు. కొబ్బరి ధర ఎలా ఉన్నా దిగుబడి బాగుంటే చాలని రైతులు భావిస్తారు. అయితే తెల్లదోమ వంటి తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తెల్లదోమ లక్షణాలు

రసం పీల్చే జాతికి చెందిన తెల్లదోమను 2016 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో గుర్తించారు. తెల్లదోమ చిన్న, పెద్ద రెక్కల పురుగులు ఆకుల అడుగు భాగాల్లో చేరి రసాన్ని పీల్చుతాయి. ఆకుల అడుగు భాగంలో తెల్లటి దూదివంటి పదార్థం కనిపిస్తుంది. సర్పిలాకర తెల్లటి వలయాకారంలో గుడ్లు విసర్జించే తేనేలాంటి జిగురు పదార్థంపై కాప్నోయం జాతికి చెందిన బూజు తెగులు నల్లని మసిలా వృద్ధి చెందుతుంది. జిగురు పదార్థం కింది ఆకులపై పడి నల్లటి మసి మంగుతో కిరణ జన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి ఆహారం తయారుచేసుకునే శక్తి సన్నగిల్లుతుంది. దీంతో కొబ్బరి దిగుబడి తగ్గిపోతుంది.


యలమంచిలిలో తెల్లదోమ నివారణ వివరాలను కలెక్టర్ ప్రశాంతికి తెలియజేస్తున్న ఉద్యానశాఖాధికారులు

నివారణ పద్ధతులు

తెల్లదోమ ఆశించిన కొబ్బరితోటల్లో పురుగు మందులు పిచికారీ చేయకూడదు. తద్వారా సహజ శత్రువులైన పరాన్నజీవులు వృద్ధిచెంది తోల్లదోమలను నియంత్రిస్తాయి. పురుగుస్థాయి ఎక్కువగా ఉంటే అజాడిరక్టిన్ 10 వేల పీపీఎం మిల్లీలీటర్లను లీటరు నీరు లేదా ఐదు మిల్లీలీటర్ల వేప నూనె, రెండు గ్రాముల సర్ఫ్ కలిసి ఆకు అడుగు భాగం పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు ఉపయోగపడే పురుగులను ఉద్యానశాఖ సరఫరా చేస్తోంది. 200 పురుగులుండే డబ్బాను కేవలం రూ.40 అందిస్తుంది. ఈ డబ్బాలు ఎకరాకు ఆరు డబ్బాలను కట్టాల్సి ఉంటుంది.

ప్రత్యేక శ్రద్ధతో తెగులు నివారణ



కొబ్బరిపై ఆశించే తెల్లదోమ నివారణకు రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే యలమంచిలిలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో అవగాహన కల్పించాం. తెల్లదోమ నివారణ పురుగులు అంబాజీపేటలో లభిస్తాయి. వాటిని రైతులు నేరుగా లేదా ఆర్‌బీకేల ద్వారా పొందవచ్చు. తెల్లదోమ వేసవిలో ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. రైతులు ప్రత్యేక శ్రద్ధతో నివారణ చర్యలు చేపట్టాలి.

– ఎ.దుర్గేష్, జిల్లా ఉద్యానశాఖాధికారి, భీమవరం

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943